ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
విజయవాడ
: fb.com/vaartha Digital
Published from Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
21-8-2025 గురువారం సంపుటి: 31 సంచిక: 201 పేజీలు: 10+4 వెల: 6.50

గాజాపై ఇజ్రాయెల్ మలిదశ పోరాటం 5లో

అఫ్ఘాన్ బస్సులో మంటలు.. 71 మంది దుర్మరణం



బుధవారం న్యూఢిల్లీలో ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా నామినేషన్ పత్రాలు సమర్పిస్తున్న రాధాకృష్ణన్

## ఎన్‌డిఎ ఉపరాష్ట్రపతి అభ్యర్థి రాధాకృష్ణన్ నామినేషన్ దాఖలు

**హైదరాబాద్, ఆగస్టు 20 ప్రభాతవార్త:** ఎన్‌డిఎ ఉప రాష్ట్రపతి అభ్యర్థిగా సి.పి.రాధాకృష్ణన్ నామినేషన్ దాఖలుచేశారు. బుధవారం ప్రధానమంత్రి నరేంద్ర మోడీతోపాటు పలువురు కేంద్రమంత్రుల సమక్షంలో నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారికి సమర్పించారు. రాధాకృష్ణన్ నామినేషన్ దాఖలు చేసే సమయంలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా, రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, జాతీయ అధ్యక్షుడు, జెపి నడ్డా, రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ వంటి అగ్రనేతలు ఆయన వెంట ఉన్నారు. కూటమిలోని కీలక నేతలంతా హాజరుకావడంతో ఈ కార్యక్రమానికి రాజకీయ ప్రాధాన్యత ఏర్పడింది. సెప్టెంబర్ 9వ తేదీన ఉపరాష్ట్రపతి ఎన్నిక జరగనుంది. లోకసభ, రాజ్యసభ సభ్యులతో కూడిన ఎలక్టోరల్ కాలేజీలో బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఎ కూటమికి స్పష్టమైన మెజారిటీ ఉంది. ఈ నేపథ్యంలో రాధాకృష్ణన్ విజయం లాంఛనప్రాయమేనని రాజకీయ వర్గాలుభావిస్తున్నాయి. సంఖ్యాబలం దృష్ట్యా ఆయన ఎన్నిక ఏకపక్షంగానే జరగనుందని అంచనావేస్తున్నారు. ప్రతిపక్షాల ఉమ్మడి అభ్యర్థిగా జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డిని ఏకగ్రీవంగా ఎంపికచేసినట్లు కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే ప్రకటించిన విషయం తెలిసిందే.

# వచ్చే మార్చికి 10 లక్షల ఇళ్లు

### ఇళ్లులేని పేదలను గుర్తించేందుకు 15 రోజుల్లో సర్వే
### నెల రోజుల్లో 3 లక్షల కుటుంబాలకు గృహప్రవేశాలు
### - సమీక్షలో సిఎం చంద్రబాబు నాయుడు



బుధవారం సచివాలయంలో జరిగిన గృహనిర్మాణ శాఖ సమీక్షలో సిఎం చంద్రబాబు నాయుడు

**విజయవాడ,ఆగస్టు 20.ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో ప్రతీ పేద కుటుంబానికి సొంతిల్లు ఉండాలని. ఇందుకోసం తలపెట్టిన గృహనిర్మాణ ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. బుధవారం సచివాలయంలో గృహ నిర్మాణ శాఖపై అధికారులతో సిఎం చంద్రబాబు సమీక్షా సమావేశం నిర్వహించారు. వచ్చే ఏడాది మార్చి నాటికి 10 లక్షల ఇళ్ల నిర్మాణం పూర్తి కావాలనే లక్ష్యాన్ని ముఖ్యమంత్రి నిర్దేశించారు. వీటిలో 3 లక్షల ఇళ్లకు వచ్చే నెలలో గృహ ప్రవేశాలు జరగాలని స్పష్టం చేశారు. సంక్రాంతి కల్లా మరో 2 లక్షల ఇళ్లు పూర్తి చేసి లబ్ధిదారులకు అప్పగించాలన్నారు. ప్రస్తుతం చేపట్టిన ప్రాజెక్టులను ఏ, బీ, సీ కేటగిరీలుగా విభజించి నిర్మాణం చేపట్టాలని సూచించారు. రాష్ట్రంలో ఇంకా ఇళ్లులేని పేద కుటుంబాలను గుర్తించి జాబితా రూపొందించాలని ఆదేశించారు. దీనిపై 15 రోజుల్లోగా సర్వే పూర్తి చేయాలన్నారు. పట్టణాల్లో 2 సెంట్లు, గ్రామాల్లో 3 సెంట్లు పేద కుటుంబాలకు ఇస్తామన్న హామీ మేరకు అవసరమైన స్థలాలను గుర్తించాలన్నారు. పెద్ద కుటుంబాలకు ఉమ్మడి ఇళ్లు నిర్మించే యోచన చేయాలన్నారు. ఎన్టీఆర్ హౌసింగ్ పూర్తి చేసేందుకు విడతల వారీగా నిధులు ఇవ్వాలని చెప్పారు.

**త్వరలో 2,73,709 మంది లబ్దిదారులకు రూ.919 కోట్ల చెల్లింపు**

రాష్ట్రానికి పిఎంఎవై(అర్బన్)బిఎల్సీ, పిఎంఎవై (గ్రామీణ్), పిఎం జన్మాన్ కింద మొత్తం 18,59,504 ఇళ్లు మంజూరు కాగా, వీటిలో ఇప్పటికి 9,51,351 ఇళ్ల నిర్మాణం పూర్తయ్యింది. ఈ ఏడాది కాలంలోనే 2.81 లక్షల ఇళ్ల నిర్మాణం పూర్తి చేసుకున్నాయి. వచ్చే నెలలో ఇంకో 19 వేల ఇళ్లు అందుబాటులోకి వస్తాయి.

ఈ ఏడాది కాలంలో గృహ నిర్మాణం కోసం ప్రభుత్వం రూ.2,013.50 కోట్లు ఖర్చు చేసింది. రాష్ట్రంలో 50 శాతానికి పైగా ఇళ్ల నిర్మాణం పూర్తయిన మొత్తం 4,305 లే అవుట్లలో రహదారులు, డ్రైనేజీలు తదితర మౌలికవసతుల కోసం రూ.3,296.58 కోట్ల వ్యయం కానుంది. కుప్పం నియోజకవర్గంలో 4,647 మంది గృహ నిర్మాణ లబ్దిదారులకు రూ.16.37 కోట్లు చెల్లించగా, రాష్ట్రంలోని 2,73,709 >>2

# స్టార్టప్‌లకు కొత్త ఊపిరి

### రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ప్రారంభించిన సిఎం చంద్రబాబు
### అమరావతి సహా ఐదు చోట్ల ఆర్టీఐహెచ్ కేంద్రాలు

**విజయవాడ.ఆగస్టు20,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రజలందరికీ ఉన్నత జీవన ప్రమాణాలు అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని సిఎం చంద్రబాబు నాయుడు అన్నారు. సంపద సృష్టితో పాటు పేదరిక నిర్మూలన ప్రధానమని, ప్రజలందరికీ మెరుగైన జీవన ప్రమాణాలే ప్రాధాన్యమన్నారు. ప్రభుత్వ విధానాలు రూపొందాలంటే వినూత్న ఆవిష్కరణలు ఎంతో అవసరమన్నారు. ఆవిష్కరణలు వినూత్నంగా, ఉన్నతంగా ఉంటేనే పోటీలో నిలబడగలం. నాణ్యమైన ఉత్పత్తులు తయారుచేసి అంతర్జాతీయ ప్రమాణాలు సాధించా లన్నారు. అమరావతిలో రతనాటాటా ఇన్నోవేషన్ హబ్ ఏర్పాటుకు ప్రభుత్వ శ్రీకారం చుట్టింది. ఇన్నోవేషన్ హబ్‌ను లాంఛనంగా సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్‌లు దీనిని ప్రారంభించారు. మంగళగిరిలోని మయూరి టెక్ పార్క్ ప్రాంగణంలో దాదాపు 50 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఇన్నోవేషన్ హబ్ ఏర్పాటు అయ్యింది. ప్రపంచ అవసరాలు తీర్చే స్టార్టప్ కేంద్రంగా విలసిల్లేలా కార్యాచరణను సిద్ధం చేశారు.





బుధవారం అమరావతిలో ఇన్నోవేషన్ హబ్‌ను ప్రారంభించిన ముఖ్యమంత్రి చంద్రబాబు .ప్రారంభోత్సవంలో పాల్గొన్న మంత్రులు లోకేష్, వివిధ సంస్థల ప్రతినిధులు.

కుటుంబానికో పారిశ్రామికవేత్త నినాదాన్ని సాకారం చేయడంలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా గ్రిడ్ ప్రారంభిస్తున్నట్లు ఈ సందర్భంగా మాట్లాడుతూ సిఎం చంద్రబాబు తెలిపారు. అమరావతి కేంద్రంగా హబ్, తిరుపతి, విశాఖపట్నం, రాజమహేంద్రవరం, విజయవాడ, అనంతపురంలో స్పోక్‌లు ఏర్పాటు కానున్నాయని వెల్లడించారు. అంతర్జాతీయ ప్రమాణాలు సాధించడంలో మన పరిశ్రమలు మెరుగైన ఫలితాలు సాధించాలి. ప్రభుత్వం, పరిశ్రమలు, పరిశోధనలు, ఎకో సిస్టం కలిసి పనిచేయాలి. అంతా కలిసి పనిచేస్తేనే అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో ఉత్పత్తులు సాధ్యం. సమస్యకు పరిష్కారం కనుగొంటే అందరికీ ఉపయోగపడుతుందన్నారు.సమస్య కాదు పరిష్కారంపై ఆలోచనలు చేయడం ఉత్తమ విధానమన్నారు. పి4 అమలు సహా నేను ఎన్నో వినూత్నఆలోచనలు పంచుకున్నా. నా ఆలోచనలు పంచుకున్నప్పుడు ఇది అసాధ్యమని చాలామంది విమర్శించారు. ఆచరణలో ఫలితాలను చూపి అంతా అసాధ్యమనుకున్నవి సుసాధ్యం చేసి చూపామన్నారు. అమరావతిలో రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ప్రారంభించడం చరిత్రాత్మక ఘట్టమన్నారు. వినూత్న ఆలోచనలతో ముందు కొచ్చే పారిశ్రామికవేత్తలకు పారదర్శకంగా ప్రోత్సాహకాలుపోత్సహిస్తున్నామని వెల్లడించారు. రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ కీలకవేదిక కానుందని తెలిపారు. ఆలోచనలకు తగ్గ ఫలితాల సాధనే లక్ష్యంగా ఈ వేదిక పని చేస్తుందన్నారు. అమరావతిని కా ంటమ్ వ్యాలీ కేంద్రంగా తీర్చిదిద్దడంతో పాటు ఆవిష్కరణ ఆధారిత ఆర్థిక వ్యవస్థలకు ప్రామాణికంగా రూపొందిస్తారు. >>2



## ఢిల్లీ సిఎం రేఖా గుప్తాపై దాడి

### ప్రజల ఫిర్యాదులు స్వీకరిస్తుండగా ఘటన

**న్యూఢిల్లీ, ఆగస్టు 20:** ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖాగుప్తాపై దాడి జరిగింది. సివిల్ లైన్స్‌లోని అధికారిక నవాసంలో 'జన్ సున్‌వాయ్' నిర్వహిస్తున్న సమయంలో ఈ ఘటన చోటు చేసుకున్నట్లు బిజెపి వర్గాలు వెల్లడించాయి. 35 యేళ్ల వయసున్న ఓ వ్యక్తి ఈ దాడికి పాల్పడినట్లు తెలిపాయి. తొలుత అతడు కొన్ని పేపర్లను సిఎంకు అందించిన తర్వాత ఈ దాడికి పాల్పడినట్లు తెలుస్తోంది. ఈ ఘటనను బిజెపి ఢిల్లీ అధ్యక్షుడు వీరేంద్ర సచ్‌దేవ్ ఖండించారు. పోలీసులు >>2

## అర్హులైన నేతన్నలకు 'ముద్ర' రుణాలు

### కొత్త చేనేత సహకార సంఘాలు ఏర్పాటు చేయండి: మంత్రి సవిత

**విజయవాడ,ఆగస్టు20,ప్రభాతవార్తప్రతినిధి:** అర్హులైన నేతన్నలందరికీ సకాలంలో ముద్ర రుణాలు అందజేయాలని రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత ఆదేశించారు. చేనేత కుటుంబాలకు ఉచిత విద్యుత్ ఫలాలు అందజేసేలా గ్రామ స్థాయిలో అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. ఆప్కో ద్వారా అమ్మకాలు పెంచాలని, ముఖ్యంగా నూతన డిజైన్లతో తయారు చేసిన చేనేతదుస్తులపై సోషల్‌మీడియా ద్వారా వినియోగదారులకు ఎప్పటికప్పుడు సమాచారం అందించేలా చర్యలు తీసుకోవాలని మంత్రి దిశా నిర్దేశం చేశారు. మంగళగిరిలో చేనేత, జౌళి శాఖ కమిషనరేట్‌లో బుధవారం ఆ శాఖాధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో మంత్రి సవిత పాల్గొన్నారు. కమిషనర్ రేఖారాణి చేనేత, జౌళి శాఖలో చేపట్టిన సంక్షేమ, అభివృద్ధికార్యక్రమాలపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. వన్ డిస్ట్రిక్ - వన్ ప్రొడెక్ట్ కింద రాష్ట్ర వ్యాప్తంగా 36 ఉత్పత్తులు గుర్తించినట్లు వివరించారు. ఈసందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ, వన్ డిస్ట్రిక్ - వన్ ప్రొడక్ట్‌గా కింద జిల్లాలో మరిన్ని ఉత్పత్తులను ఎంపిక చేయాలని సూచించారు. ఇటీవల కేంద్రం ప్రకటించిన ఓడీ ఓపీ అవార్డుల్లో 9 అవార్డుల ఎపికి రావడం ఆనందకరమంటూ అభినందించారు. వచ్చే ఏడాది మరిన్ని అవార్డులు వచ్చేలా కృషి చేయాలని. రాష్ట్రంలో క్లస్టర్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్రంలో 93 వేల చేనేత కుటుంబాలకు 200 యూనిట్లు, మరమగ్గం కలిగిన 11,488 కుటుంబాలకు 500 యూనిట్లు అందజేస్తున్నామన్నారు. చేనేతలకు ఇచ్చే ఉచిత విద్యుత్‌పై విస్తృత ప్రచారం కల్పించాలన్నారు.

రాష్ట్రంలో చేనేత సహకార సంఘాల ఎన్నికలకు రాష్ట్ర ప్రభుత్వం సమాయత్తమవుతోందని మంత్రి సవిత వెల్లడించారు. నూతన సహకార సంఘాల ఏర్పాటుకు త్వరితగతిన చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. సహకార సంఘాల ఏర్పాటులో అలసత్వం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. నూతన సహకార సంఘాల ఏర్పాటుపై తరుచూ సమీక్షలు చేయాలని కమిషనర్ రేఖారాణిని మంత్రి సవిత ఆదేశించారు.

2025-26లో ముద్ర రుణాలు ఎంతమందికి ఇచ్చినట్లు మంత్రి సవిత అడిగి తెలుసుకున్నారు. అర్హులైన నేతన్నలందరికీ ముద్ర రుణాల సకాలంలో అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా స్థాయి అధికారులు తమ పరిధిలో ఉన్న బ్యాంకర్లతో చర్చించి, రుణాల మంజూరు >>2

## ఎఐ సాయంతో 1, 2 గంటల్లో శ్రీవారి దర్శనం

### టిటిడి చైర్మన్ బిఆర్ నాయుడు



బుధవారం హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడుతున్న టిటిడి చైర్మన్ బిఆర్ నాయుడు

**హైదరాబాద్,ఆగస్టు20, ప్రభాతవార్త:** శ్రీవారి భక్తులకు టిటిడి గుడ్ న్యూస్ చెప్పింది. తిరుమల శ్రీవారి దర్శనం వేగంగా జరిగేలా చర్యలు తీసుకుంటోంది. ఈ విషయాన్ని తిరుమల తిరుపతి దేవస్థానం చైర్మన్ బిఆర్ నాయుడు వెల్లడించారు. ఎఐ సాయంతో తిరుమల శ్రీవారి దర్శనం 1,2 గంటల్లోగా కల్పించేలా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. అలాగే తిరుమలలో కొత్త క్యాంటీన్లు, శ్రీవాణి దర్శనం వేళల మార్పు, విఐపి దర్శన సమయం గురించి హైదరాబాద్‌లో జరిగిన విలేకర్ల సమావేశంలో కీలక వివరాలు వెల్లడించారు. తిరుమల శ్రీవారి భక్తులకు టిటిడి శుభవార్త వినిపించింది. తిరుమలలో ఏటికేడు భక్తుల రద్దీ పెరుగుతోంది. శ్రీనివాసుడి దర్శనం కోసం విచ్చేస్తున్న భక్తుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. ఈ క్రమంలో తిరుమలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా టిటిడి ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటోంది. అయితే విశేష పర్వదినాలు, ఉత్సవాలు, పండుగల సమయంలో తిరుమలలో భక్తుల రద్దీ విపరీతంగా ఉంటోంది. దీంతో ఇలాంటి రోజులలో శ్రీవారి దర్శనానికి గంటలు గంటలు సమయం పడుతోంది.

ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకుని టిటిడి సరికొత్త ఆలోచన చేస్తోంది. దేవదేవుడి దర్శనం కోసం వచ్చే భక్తులకు వేగంగా దర్శనం కల్పించేందుకు చర్యలు చేపడుతోంది. ఆర్టిఫిషియల్‌ఇంటెలిజెన్స్ సాయంతో గంటనుంచి రెండు గంటల్లో శ్రీవారి దర్శనం కల్పించేందుకు చర్యలు తీసుకుంటోంది. అలాగే తిరుమలలో త్వరలోనే కొత్త క్యాంటీన్లను ప్రారంభిస్తామని టిటిడి చైర్మన్ బిఆర్ నాయుడు వెల్లడించారు. టిటిడిలో పనిచేసే అన్యమత సిబ్బందిని బదిలీ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. అలాంటి వారిని స్వచ్ఛంద పదవీ విరమణ పథకం కింద పంపించేలా ప్రణాళికలురచిస్తున్నట్లు వెల్లడించారు.

అలాగే సిబ్బంది ఎవరైనా అన్యమత ప్రచారంలో పాల్గొంటే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. మరోవైపు తిరుమలలో శ్రీవాణి టికెట్ల దర్శన సమయాలు మారుస్తామన్న టిటిడి చైర్మన్ బిఆర్‌నాయుడు.. ఉదయం శ్రీవాణి దర్శనం టికెట్లు తీసుకున్న భక్తులు సాయంత్రాని కల్లా శ్రీవారిని దర్శనం చేసుకునేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు.అలాగే తిరుమలలో విఐపి దర్శనాలను ఉదయం 8 నుంచి 8.30 గంటలకు ముగించేలా చర్యలు తీసుకుంటున్నట్లు టిటిడి చైర్మన్ బీఆర్ నాయుడు తెలిపారు.



### అరెస్టయి, 30 రోజులు నిర్బంధంలో ఉంటే పిఎం, సిఎం, మంత్రులను తొలగించే బిల్లు
### 3 కీలక బిల్లులను లోక్‌సభలో ప్రవేశపెట్టిన అమిత్‌షా
### తీవ్రంగా వ్యతిరేకించిన విపక్షం
### బిల్లు కాపీలు చించేసిన కాంగ్రెస్ సభ్యులు
### జెపిసి పరిశీలనకు బిల్లులు

## ప్రధానికైనా ఉద్వాసనే!

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఆగస్టు20:** దేశంలో నేరం చేస్తే ప్రధానికైనా ఉద్వాసనే జరిగేలా కేంద్ర ప్రభుత్వం బిల్లులను తీసుకొచ్చింది. తీవ్రమైన నేరారోపణలతో అరెస్టయి వరుసగా 30 రోజులపాటు నిర్బంధంలో ఉంటే ప్రధాని, ముఖ్యమంత్రులు, మంత్రులను పదవి నుంచి తొలగించేందుకు వీలు కల్పించే బిల్లుతో సహా మూడు బిల్లులను బుధవారం కేంద్రం లోక్‌సభలో ప్రవేశపెట్టింది. ఈ సందర్భంగా ప్రతిపక్షాల నుంచి పెద్దఎత్తున నిరసన వ్యక్తమైంది. బిల్లుల కాపీలను చింపి అమిత్ షాపైకి విసిరారు. ప్రతిపాదిత బిల్లులు రాజ్యాంగం,సమాఖ్యవాదానికి వ్యతిరేకంగా ఉన్నట్లు విపక్షాలు ఆరోపించాయి. అయితే ఈ బిల్లులను హడావుడిగా తీసుకొచ్చారనే విమర్శలను కేంద్ర హోం మంత్రి అమిత్ షా తోసిపుచ్చారు. వాటిని సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జెపిసి)పరిశీలనకు పంపనున్నట్లు ప్రకటించారు. నేరం చేస్తే ప్రధాని, సీఎంలు, మంత్రులకు సైతం ఉద్వాసన పలికేలా కేంద్రం ఈ మూడు కీలక బిల్లులను తీసుకువచ్చింది. ప్రతిపక్షాల ఆందోళనల మధ్యే బిల్లులను కేంద్ర హోం మంత్రి అమిత్ షాలోక్ సభలో ప్రవేశపెట్టారు. గవర్నమెంట్ ఆఫ్ యూనియన్ టెరిటరీస్ సవరణబిల్లు, 130వ రాజ్యాంగ సవరణబిల్లు, జమ్ముకశ్మీర్ పునర్వ్యవస్థీకరణ సవరణ బిల్లులుగా వాటిని పేర్కొన్నారు. ఈ సమయంలో అధికార విపక్షాల మధ్య వాగ్వాదం జరిగింది. కాంగ్రెస్ సహా విపక్ష పార్టీల ఎంపీలు బిల్లు కాపీలు చింపి సభలో విసిరారు. వెల్ దగ్గరికి వెళ్లి చింపిన బిల్లు ప్రతులను టిఎంసి ఎంపీలు విసిరారు.హోం మంత్రి అమిత్‌షా స్థానం వైపు >>2

## వినాయక మండపాలకు సింగిల్‌విండో విధానం: డిజిపి

**విజయవాడ ఆగస్టు 20, ప్రభాతవార్తప్రతినిధి:** రానున్న వినాయక చవితి పండుగను దృష్టిలో పెట్టుకుని, వినాయక ఉత్సవ మండప నిర్వాహ కులు సింగిల్‌విండో విధానం ద్వారా, ఆన్‌లైన్లో అనుమతులు పొందడానికి వీలుగా ..ఆంధ్రప్రదేశ్ పోలీస్ శాఖ రూపొందించిన వినాయక ఉత్సవ్. వెబ్‌సైట్‌ను రాష్ట్రవ్యాప్తంగా అందుబాటులోకి తీసుకురావడం జరిగిందని డిజిపి హరీష్ కుమార్ గుప్తాతెలిపారు. వినాయకఉత్సవ మండప నిర్వా హకులు ఆన్ లైన్లో తమ, తమవివరాలను నమోదు చేసుకుని ఎన్‌వోసి (నిరభ్యంతరపత్రం) పొందవచ్చని తెలిపారు. మండప నిర్వాహకులు అనుమ తులుకోసం ఆన్ లైన్లో దరఖాస్తు చేసుకున్న వెంటనే సంబంధిత పోలీస్ స్టేషన్ ముఖ్యాధికారి మండ పాలు ఏర్పాటు చేసే ప్రాంతాలను పరిశీలించి, నిబంధనలకు అనుగుణంగా ఉన్న వినాయక ఉత్సవ మండపాలకు క్యూఆర్ కోడ్‌తో కూడినా ఎన్‌ఒసి (నిరభ్యంతర పత్రం) జారీ చేస్తారని డిజిపి హరీష్ కుమార్ గుప్తా తెలిపారు. బహిరంగ ప్రదేశాలలో ఏర్పాటు చేసే వినాయక ఉత్సవ మండపాలకు మాత్రమే ఈ అనుమతులు అవసరం అని డిజిపి స్పష్టం చేశారు. ఈ సేవలు పూర్తిగా ఉచితమని ఎటువంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. ప్రజలు వినాయక నవరాత్రి ఉత్సవాలను సురక్షి తంగా, ఆనందంగా జరపుకునేందుకు, మండప నిర్వాహకులు పూర్తి పారదర్శకంగా, సులభతరంగా పోలీసు శాఖ అనుమతులు పొందేందుకు ఈ ఆన్ లైన్ వ్యవస్థను ఏర్పాటు చేసినట్లు డిజిపి హరీష్ కుమార్ గుప్తా తెలిపారు. నిర్వాహకులు వినాయక ఉత్సవ్ వెబ్‌సైట్ ద్వారా అనుమతులు పొందవల సిందిగా డిజిపి హరీష్ కుమార్ గుప్తా కోరారు.

## జైలునుంచి కాకాణి విడుదల

**నెల్లూరు క్రైం, ఆగస్టు 20, ప్రభాతవార్త:** గత 85 రోజులుగా జిల్లా కేంద్ర కారాగారంలో పలు కేసుల్లో రిమాండ్ ఖైదీగా ఉన్న మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి బుధవారం జైలు నుండి విడుదలయ్యారు. సోమవారం ఉన్నత న్యాయస్థానం బెయిల్ మంజూరు చేసినప్పటికీ, ఉత్తర్వులు జైలు చేరడంలో ఆలస్యం కావడంతో మంగళవారం విడుదల కావాల్సిన కాకాణి ఎట్టకేలకు బుధవారం విడుదల అయ్యారు. విడుదల అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ తనకున్న ఆస్తి ప్రజల అభిమానమేనని, జిల్లా కేంద్ర కారాగారం లోపల అందరూ వైఎస్సార్సీ వారేనని అన్నారు. జైలు అంటే భయపడాల్సిన అవసరం లేదని,చంద్రబాబు నాయుడు దయవల్ల జైల్లో వైఎస్సార్సీ వారితో >>2

## నీటి గుంటలో పడి ఆరుగురు విద్యార్థులు మృతి

### చిగిలి గ్రామంలో విషాదం

**కర్నూలు,ఆగస్టు 20,ప్రభాతవార్త ప్రతినిధి :** కర్నూలుజిల్లా ఆస్పరిమండలం చిగలి గ్రామంలో విషాదం చోటుచేసుకుంది. బుధవారం నీటి కుంటలో ఆరుగురువిద్యార్థులు మృతి చెందారు. మృతి చెందిన వారంత స్తానిక ప్రాథమిక పాఠశాలలో ఐదవ తరగతి చదువుతున్న విద్యార్థులు. ఈత కోసం వెళ్లిన విద్యార్థులు ప్రమాదవశాత్తు నీటిలో మునిగి మృతు ్యవాత పడ్డారు. దీంతో కుటుంబీకుల రోదనలు మిన్నంటాయి. వివరాల మేరకు చిగిలి గ్రామంలో ప్రాథమిక పాఠశాలలో 5వ తరగతి చదువుతున్న విద్యార్థులు స్కూలువిడిచిన తరువాత ఎవరి ఇళ్లకు వారు వెళ్లిపోయారు. ఇంటిలో >>2



రాజీవ్ జయంతి సందర్భంగా బుధవారం న్యూఢిల్లీలోని వీర్‌భూమి వద్ద నివాళులర్పిస్తున్న ప్రియాంక గాంధీ, వాద్రా తదితరులు

# ఢిల్లీ సీఎం రేఖా గుప్తాపై దాడి

>> దీనిపై దర్యాప్తు చేపట్టినట్లు సమాచారం.

ప్రజా సమస్యలను తెలుసుకునేందుకు ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖాగుప్తా తన అధికారిక నివాసంలో ప్రతివారం 'జన్ సున్‌వాయ్' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో ఫిర్యాదు చేసేందుకు వచ్చిన ఓ యువకుడు కొన్ని పేపర్లను ముఖ్యమంత్రికి అందించాడు. అంతలోనే గట్టిగా అరుస్తూ సిఎంపై దాడి చేశాడు. దీంతో వెంటనే అప్రమత్తమైన వ్యక్తిగత భద్రతాసిబ్బంది నిందితుడిని అదుపులోకితీసుకున్నారు. అతడిని రాజ్‌కోట్‌కు చెందిన వ్యక్తిగా గుర్తించినట్లు సమాచారం. ఊహించని పరిణామంతో ముఖ్యమంత్రి షాక్‌కు గురైనట్లు తెలుస్తోంది. ఆమెను వెంటనే వైద్య పరీక్షల కోసం ఆస్పత్రికి తరలించినట్లు తెలుస్తోంది. ముఖ్యమంత్రిపై దాడిని రాజకీయ పక్షాలు ఖండించాయి. ఢిల్లీ మంత్రి మంజీందర్ సింగ్ సిర్సా మాట్లాడుతూ.. ఢిల్లీ ప్రజల కోసం తీవ్రంగా శ్రమిస్తోన్న ముఖ్యమంత్రిపై దాడిచేయడం దారుణమన్నారు. ఇది ప్రత్యర్థుల కుట్రకావచ్చని అనుమానం వ్యక్తం చేశారు. దీనిలో ఏదైనా రాజకీయ పార్టీ ఉందా? అన్న కోణంలోనూ దర్యాప్తు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి, ప్రతిపక్ష నేత అతిశీ కూడా ఈ ఘటనను ఖండించారు. ప్రజాస్వామ్యంలో హింసకు చోటులేదన్నారు. నిందితులపై ఢిల్లీ పోలీసులు కఠిన చర్యలు తీసుకుంటారని ఆశిస్తున్నామని చెప్పారు. ముఖ్యమంత్రి క్షేమంగా ఉన్నారని భావిస్తున్నామన్నారు. ఈ దాడిని ఖండించిన ఢిల్లీ కాంగ్రెస్.. దురదృష్టకమైన ఘటన అని పేర్కొంది. ముఖ్యమంత్రికే రక్షణ లేకుంటే సాధారణ మహిళల పరిస్థితి ఏమిటని ఢిల్లీ కాంగ్రెస్ అధ్యక్షుడు దేవందర్ యాదవ్ ఆందోళన వ్యక్తం చేశారు.




బుధవారం పార్లమెంటు వద్ద నిరసన ప్రదర్శన జరిపిన పలువురు ఎంపీలు

# స్టార్టప్‌లకు కొత్త ఊపిరి

>> ప్రపంచ మేధను ఆకర్షించి పెట్టుబడులు, ఇన్నోవేషన్ ఆధారిత విధానాలకు అధిక ప్రాధాన్యం ఇస్తారు. ఆవిష్కరణల్లో స్పోక్‌ల వారీ ప్రాధాన్యతలున్నాయి, వాటిలో అనంతపురంలో ఉత్పత్తి, ఆటోమోటివ్, టవిశాఖపట్నంలో సాఫ్ట్‌వేర్ సేవలు, ఫార్మా, మారిటైమ్‌లున్నాయి. విజయవాడకు మొబిలిటీ,పబ్లిక్ సెక్టార్,ఉత్పత్తిరంగంలో, రాజమహేంద్రవరంలో వ్యవసాయం,ఆక్వా ప్రాధాన్యతలున్నాయి. ముందున్న సవాళ్లకు తగ్గట్టుగానే అవకాశాలను అందిపుచ్చుకునే కార్యాచరణతో పని చేస్తు న్నట్లు చెప్పారు.

అమరావతి కేంద్రంగా ఏర్పాటయ్యే రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్... డీప్‌టెక్,, కృత్రిమ మేధ,సుస్థిర,సమ్మిళిత ఆవిష్కరణలకు వేదికగా నిలుస్తుంది. దీనిలో భాగంగా తిరుపతిలో ఆగ్రో ప్రాసెసింగ్,ఎలక్ట్రానిక్ మాన్యుఫాక్చరింగ్ డబుల్ ఇంజన్ సర్కార్ రాష్ట్రంలో పని చేస్తున్నందున దేశానికి ఎపి ఆవిష్కరణల హబ్‌గా అభివృద్ధి చెందాలని ఆకాంక్షి స్తున్నామన్నారు. వ్యాపారంఅంటే లాభాలు మాత్రమే కాదని విలువలు, మానవ త్వంతో కూడిన పని అని చాటిన మహనీయుడు రతన్ టాటా అని లోకేశ్ కొనియాడారు. అలాంటి మహోన్నత వ్యక్తికి ఈ వినూత్న ఆవిష్కరణల వేదికను అంకింతమిస్తున్నట్లు తెలిపారు. వినూత్న నూతన ఆవిష్కరణలు సంస్కృతిగా మారాయని టాటా గ్రూప్ ఛైర్మన్ చంద్రశేఖరన్ స్పష్టం చేశారు. ఆ సంస్క ృతిని అందరికీ పరిచయం చేసే బాధ్యత సీఎం చంద్రబాబు తీసుకున్నారని అన్నారు. ప్రపంచీకరణలో సమస్యల పరిష్కారానికి నూతన ఆవిష్కరణలే కీలకమవుతు న్నాయని వివరించారు. ప్రపంచ వ్యాప్తంగా వైద్య, రక్షణ, ఆర్థిక ఇలా అనేక సమస్యల పరిష్కారానికి లక్ష్యాలను నిర్ధేశించుకుని పనిచేయాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని తెలిపారు. సమస్యల పరిష్కార వేదికగా ఇన్నోవేషన్ హబ్ లు కీలకపాత్ర పోషించనున్నాయని ఆశాభావం వ్యక్తంచేశారు. రతన్ టాటా పేరుతో వినూత్న ఆవిష్కరణల వేదికకు శ్రీకారం చుట్టినందుకు కృతజ్ఞతలు తెలుపుతున్నానని అన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు టీజీ భరత్, నాదెండ్ల మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి లోకేష్ చొరవతో విద్యాశాఖకు అదనంగా నిధులు మంజూరు

**విజయవాడ,ఆగస్టు 20,ప్రభాతవార్త ప్రతినిధి:** సమగ్ర శిక్షణలో ఈ విద్యాసంవత్సరం గతంలో కంటే అదనంగా రూ.432.19 కోట్ల నిధులను రాష్ట్రానికి కేంద్రం మంజూరు చేసింది. మంత్రి లోకేష్ చొరవతో నిధుల కేటాయింపు విషయంలో రాష్ట్రానికి కేంద్రం అధిక ప్రాధాన్యతనిస్తోంది. సెకండరీ,సీనియర్ సెకండరీ పాఠశాలలను బలోపేతం చేయడానికి ఐసిటి లాబ్స్,సా ్మర్ట్ తరగతులు,సైన్స్ ల్యాబ్‌లఏర్పాటుకు కేంద్రం ఈసారి రూ.167.46కోట్ల అదనపు నిధులను మంజూరు చేసింది. దీంతో పాటు డైట్ కళాశాలలను సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్‌గా మార్చడానికి గతంలో 50శాతం మాత్రమే నిధులు వచ్చాయి. ఈ ఏడాది రూ.45 కోట్లకు గాను 96 శాతం మేర రూ.43.23 కోట్ల నిధులు మంజూరయ్యాయి. ఆదివాసీ విద్యార్థులకు వసతి గృహాలకోసం రూ.11 కోట్లు మంజూరు చేసింది.

# వచ్చే మార్చికి 10 లక్షల ఇళ్లు

>> మంది లబ్ధిదారులకు రూ.919.29 కోట్లు త్వరలో చెల్లించనుంది. పిఎం జన్మాన్ కింద నిర్మించిన 15,753 ఇళ్లకు రూ.100 కోట్లు, పీఎంఏవై గ్రామీణ్ కింద నిర్మించిన 15,582 ఇళ్లకు రూ.75 కోట్ల నిధులు మంజూరు చేయనుంది. మరోవైపు పీఎంఏవై అర్బన్ కింద ఇళ్లు మంజూరైనప్పటికీ 1,84,510 మంది లబ్ధిదారులు ఇంకా గృహ నిర్మాణం చేపట్టలేదని అధికారులు ముఖ్యమంత్రికి వెల్లడించారు.

**తుది దశకు 84,094 టిడ్కో ఇళ్ల నిర్మాణం**

2018లో 104 పట్టణ స్థానిక సంస్థల్లో 4,54,706 టిడ్కో ఇళ్లకు టెండర్లు పిలవగా, వీటిలో ప్రస్తుతం 1,77,546 ఇళ్లు పూర్తయ్యాయి. వీటిలో 300 చ.అ. విస్తీర్ణం కలిగిన 45,848 ఇళ్లు, 365 చ.అ. విస్తీర్ణం ఉన్న 12,550 ఇళ్లు, 430 చ.అ. విస్తీర్ణం ఉన్న 25,172 ఇళ్లు... మొత్తం 83,570 ఇళ్లను లబ్ధిదారులకు ప్రభుత్వం అందించింది. మరో 84,094 టిడ్కో ఇళ్ల నిర్మాణం తుది దశకు చేరిందన్నారు.

# జైలునుంచి కాకాణి విడుదల

>> ఎక్కువ సమయం గడిపే అవకాశం వచ్చిందని అన్నారు. హైకోర్టు బెయిలు మంజూరు చేసిన తర్వాత కూడా ఉద్దేశపూర్వకంగానే విడుదల ఆలస్యం చేశారని ఆరోపించారు. తన కోసం మంగళవారం సాయంత్రం ప్రజలు వచ్చారని, బుధవారం ఉదయం కూడా వచ్చారు ప్రజల అభిమానం మర్చిపోలేనిదని భావోద్వేగానికి గురయ్యారు. జిల్లాలో రెండు సార్లు ఎమ్మెల్యేగా, మంత్రిగా పని చేసిన వ్యక్తిని ఇన్ని రోజులు జైల్లో ఉంచడం చరిత్రలో ఇదే మొదటిసారని పేర్కొన్నారు. తనపై 6 సోషల్ మీడియా కేసులు పెట్టారని, ఓట్లు వేస్తే లిక్కర్ ఇస్తా అని తాను చెప్పానంటూ హాస్యాస్పదంగా లిక్కర్ కేసులను నమోదు చేశాని ఆరోపించారు. జైల్లో వేసినంత మాత్రాన మనోధైర్యం కోల్పోలేదని, తాను ఆరోగ్యంగానూ మానసికంగా ధైర్యంగానూ ఉన్నట్లు పేర్కొన్నారు. సోమిరెడ్డి, ఆయన కొడుకు చేసే తప్పులను కచ్చితంగా ఎత్తిచూపుతానని స్పష్టం చేశారు.

# అటవీశాఖ సిబ్బందిపై ఎమ్మెల్యే, అనుచరుల దాడి

## విధుల నిర్వహణకు ఆటంకం

## కిడ్నాప్ చేసి ఫారెస్ట్ సిబ్బందిని బంధించి జీపులో తీసుకెళ్లి దౌర్జన్యం

**పెద్దదోర్నాల, ఆగస్టు 20, ప్రభాతవార్త :** శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి, ఆయన అనుచరులు విధి నిర్వహణలో ఉన్న అటవీశాఖ సిబ్బందిని కొట్టి దాడి చేసి దౌర్జన్యంగా జీపులో కిడ్నాపు చేసి తీసుకెళ్లి ఊరంతా తిప్పి భయభ్రాంతులకు గురి చేసిన సంఘటన కలకలం రేపుతుంది. స్థానికంగా ఈ ఘటన తీవ్ర ఆగ్రహానికి దారి తీసింది. ప్రజా ప్రతినిధిగా ఉండి, చట్టాన్ని కాపాడాల్సిన ఎమ్మెల్యేనే దాడికి తెగబడటం ప్రజాస్వామ్య వ్యవస్థకు చేటని అటవీశాఖ ఉద్యోగులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎమ్మెల్యే ఆయన అనుచరులు తీరు రౌడీయిజం తీరు భయభ్రాంతులకు గురి చేసిందని, అటవీ క్షేత్ర అధికారి ఇద్దరు బీట్ అధికారులు, ఇతర సిబ్బందిపై దౌర్జన్యానికి పాల్పడ్డారు. అసభ్య పదజాలాన్ని ఉపయోగిస్తూ వారి వద్ద ఉన్న వాకిటాకీలు, సెల్ ఫోన్లు, నగదు ఇతర వస్తువులను దోచుకున్న తీరు భయానకం సృష్టించిందని, ప్రభుత్వ వాహనమైన అటవీ క్షేత్రాధికారులోనే సిబ్బందిని బంధించి శ్రీశైలం, సున్నిపెంట రోడ్లన్నీ తిప్పుకుంటూ దాడి చేశారని, అనంతరం గెస్ట్ హౌస్‌లో బంధించి చిత్రటహింసలకు గురి చేసి రాత్రి రెండుగంటలకు వదిలి పెట్టారని అన్నారు.

దాడికి గురైన ఉద్యోగు లంతా ఎస్సీ, ఎస్టీ మైనార్టీ వర్గాలకు చెందిన వారే. ఈ సంఘటనపై అటవీ ఉద్యోగ సంఘాలు చెంచు గిరిజన సంఘాలు తీవ్రంగా ఖండిస్తున్నాం. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, అటవీశాఖ మంత్రి పవన్ కల్యాణ్ వెంటనే స్పందించి దాడి జరిగిన వారికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. తక్షణమే ఆయ నను, అనుచర ముఠాను అరెస్టు చేయాలని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బుడ్డ రాజశేఖర్‌రెడ్డిని పార్టీ నుండి సస్పెండ్ చేయాలని కోరారు. ఎమ్మెల్యే పదవికి బుడ్డా రాజశేఖర్ రెడ్డితో రాజీనామా చేయించాలని ఆంధ్ర ప్రదేశ్ జూనియర్ ఫారెస్ట్‌అధికారుల అసోసియేషన్ మార్కాపురం యూని యన్ అధ్యక్షుడు షేక్ కరిముల్లా, ఆర్గనైజింగ్ కార్యదర్శి జి.సుధాకర్, సంయుక్త కార్యదర్శి బాల కుమారి, డిప్యూటీ రేంజ్ ఆఫీసర్లు శివ, జెఫిలిప్ ఇన్‌ఛార్జీ డివైఆర్‌ఓ కే.చెన్నయ్య, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ ప్రభు, ఎఫ్‌బీఓ వెంకటేశ్వర్లు బుధవారం పెద్దదోర్నాల అటవీశాఖ రేంజ్ కార్యాలయంలో జరిగిన విలేకర్ల సమావేశంలో డిమాండ్ చేశార. ఈ ఘటనపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని అలా జరగని పక్షంలో తాము ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఇలాంటి భౌతిక దాడులు చేసి, దౌర్జన్యాలకు పాల్పడటం, దుర్భాషలాడడం ప్రజా ప్రాతినిధ్యానికి ఒక చెరగని మచ్చ అని అన్నారు.

అటువంటి వారు ఎమ్మెల్యేగా ఉండడం అనర్హులని, ఉద్యోగులందరం కలిసి రాష్ట్ర వ్యాప్తంగా చేపడతామని హెచ్చరించారు. నల్లమల అరణ్యంలోని శిఖరం ఫారెస్టు చెక్ పోస్టు వద్ద మంగళవారం రాత్రి 10గంటలకు చోటు చేసుకున్న ఈ సంఘటన సంచలనం సృష్టించింది. ప్రజా ప్రతినిధుల పేరుతో జరిగే ఇలాంటి దాడులను అరికట్టకపోతే భవిష్యత్తులో అటవీ సంపద, వన్య ప్రాణి సంపద రక్షణ కష్టతరమవుతుందని, ఇలాంటి దాడులు పునరావృతం అయితే అడవిని కాపాడడం ప్రశ్నార్థకమవుతుందన్న అభిప్రాయం వ్యక్తం అవుతుంది.

## 'వ్యూహం' చిత్ర నిర్మాత దాసరి కిరణ్‌కుమార్ అరెస్ట్

**విజయవాడ,ఆగస్టు20,ప్రభాతవార్తప్రతినిధి:** విజయవాడ పటమట పోలీసులు ఆర్థిక లావాదేవీల నేపథ్యంలో జరిగినదాడి కేసుల్లో వ్యూహం చిత్ర నిర్మాణ దాసరి కిరణ్‌కుమార్‌ను అరెస్ట్ చేసారు.కిరణ్‌కుమార్ తన సమీప బంధువు గాజుల మహేష్ దగ్గర సుమారు రూ.అయిదు కోట్లు అప్పు తీసుకున్నారు.ఈ మొత్తాన్ని చెల్లించాలని కోరుతూ మహేష్ తన కుటుంబ సభ్యులతో కలిసి కిరణ్ ఇంటికి వెళ్లారు.కిరణ్ ఆయనకు బాకీ చెల్లించక పోగా, వారిపై దాడి చేయించారు.దీనిపై మహేష్ విజయవాడ పటమట పోలీసులకు ఫిర్యాదు చేసారు.పోలీసులు కేసు నమోదు చేసి, బుధవారం కిరణ్‌కుమార్‌ను హైదరాబాద్‌లో ఉండగా అరెస్ట్ చేసారు.

# 'ముద్ర' రుణాలు

>> ఆలస్యం చోటుచేసుకోకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ ఏడాది డిసెంబర్ నాటికి నిర్దేశించిన లక్ష్యంలో 70 శాతం మేర ముద్ర రుణాలు అందించాలని స్పష్టంచేశారు. లబ్ధిదారుల ఎంపికలో ఎమ్మెల్యేలతో సమన్వయం చేసుకోవాలని మంత్రి సవిత తెలిపారు. రాష్ట్రంలో ఉన్న 92 ఆప్కో షో రూమ్‌ల ద్వారా అమ్మకాలు మరింత పెంచేలా చర్యలు తీసుకోవాలని మంత్రి సవిత ఆదేశించారు. ఆప్కో షో రూమ్‌ల ద్వారా గతేడాది 35.60 కోట్ల అమ్మకాలు జరిగాయన్నారు. ఈఏడాది అమ్మకాలు మరింత పెంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. కస్టమర్లకు వేగవంతమైన సేవలు అందించాలని, షో రూమ్‌లను ఆకర్షించేలా తీర్చిదిద్దాలని స్పష్టంచేశారు. నూతన డిజైన్లతో రూపొందించిన దుస్తులను షో రూమ్‌ల్లో ప్రదర్శనగా పెట్టాలన్నారు. ముఖ్యంగా ఈ కామర్స్ ద్వారా అమ్మకాలు పెంచాలన్నారు. చేనేత దుస్తుల సోషల్ మీడియా ద్వారా చేనేత దుస్తులపై విస్తృతంగా ప్రచారం కల్పించాలన్నారు. ఎయిర్ పోర్టుల్లో ఉన్న ఆప్కో షో రూమ్ ల్లో చేనేత దుస్తులతో పాటు హస్త కళా రూపాలను కూడా అమ్మకానికి పెట్టాలని మంత్రి సవిత ఆదేశించారు.

# ఆన్‌లైన్ గేమ్‌లపై నిషేధం

## కీలక బిల్లుకు లోక్‌సభ ఆమోదం

**న్యూఢిల్లీ, ఆగస్టు 20:** డబ్బులతో ముడిపడిన ఆన్‌లైన్ గేమింగ్ నిర్వహణను నిషేధించే కీలక బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపింది. 'ది ప్రమోషన్ అండ్ రెగ్యులేషన్ ఆఫ్ ఆన్‌లైన్ గేమింగ్ బిల్లు-2025' పేరిట తీసుకొచ్చిన ఈబిల్లును కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటిశాఖమంత్రి అశ్వినీ వైష్ణవ్ బుధవారం లోక్‌సభలో ప్రవేశపెట్టారు. మూజువాణి ఓటుతో ఈ బిల్లు ఆమోదం పొందింది. ఆన్‌లైన్ బెట్టింగ్‌యాప్‌లకు కొంతమంది బానిస కావడం, మనీలాండరింగ్, ఆర్థిక మోసాల వంటివి ఇటీవల కాలంలో పెరిగిపోయిన నేపథ్యంలో కేంద్రం ఈ బిల్లును ప్రవేశపెట్టింది. ఆన్‌లైన్ గేమ్స్, ఇ-స్పోర్ట్స్ మధ్య విభజన చూపించేలా బిల్లును రూపొందించారు. నిబంధనల్ని ఉల్లంఘించి ఆన్‌లైన్ గేమ్స్ అందిస్తున్న వారికి మూడేళ్ల వరకు జైలుశిక్ష లేదా రూ. కోటివరకు జరిమానా లేదా ఆరెండూ విధించాలని ప్రతిపాదించారు. సంబంధిత అడ్వర్టయిజ్‌మెంట్లలో భాగం పంచుకున్న వారికి గరిష్ఠంగా రెండేళ్ల జైలుశిక్ష, రూ. 50 లక్షల వరకు జరిమానా విధిస్తారు. వీటి ఆర్థిక లావాదేవీల్లో ప్రమేయం ఉన్నవారికీ గరిష్ఠంగా మూడేళ్ల శిక్ష, రూ. కోటి వరకు జరిమానా వేస్తారు. ఆన్‌లైన్ మనీ గేమ్స్ ఆడేవారిని నేరస్థులుగా కాకుండా.. బాధితులుగా ఈ బిల్లులో పేర్కొన్నారు. మరోవైపు.. ఈ బిల్లు కారణంగా తమ రంగానికి తీవ్రనష్టం కలుగుతుందని ఆల్ ఇండియా గేమింగ్ ఫెడరేషన్ కేంద్ర హోంమంత్రి అమిత్‌షాకు లేఖ రాసింది. గేమింగ్‌పై నిషేధం విధించే కంటే.. నియంత్రణ ఉంచాలని సూచించింది.

# 'స్త్రీ శక్తి' పథకం విజయవంతం

## - మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి

**విజయవాడ, ఆగస్టు 20,ప్రభాతవార్తప్రతినిధి:** స్త్రీ శక్తి పథకం రాష్ట్రవ్యాప్తంగా విజయవంతంగా అమలవుతుండటంపై సంతోషంగా ఉందని రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి అన్నారు. ఆర్టీసీ హౌస్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడుతూ స్త్రీ శక్తి పథకం ఎప్పుడొస్తుందా అని మీడియా, ప్రతిపక్షాలు ఎదురు చూశాయన్నారు ఇప్పుడు సినిమా సక్సెస్ మీట్ లాగా, స్త్రీ శక్తి సక్సెస్ మీట్ నిర్వహించడం నాకు ఎంతో ఉత్సాహంగా ఉందని ఆయనఅన్నారు. రాష్ట్రంలో అమలవుతున్న సూపర్ సిక్స్ పథకాలలో ఒకదాన్ని మించి ఒకటి ప్రజల ఆదరణ పొందుతున్నాయని తెలిపారు. వాటిలో ఎక్కువ మంది లబ్ధిదారులు ఉన్న పథకం స్త్రీ శక్తి అని, దీని ద్వారా రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మంది మహిళలు లబ్ధి పొందుతున్నారని పేర్కొన్నారు. స్త్రీ శక్తి పథకం ప్రారంభించి ఆరవ రోజుకే సుమారు 65 లక్షల మంది మహిళలు ఉచిత బస్సు ప్రయాణం చేసారని మంత్రితెలిపారు. ఇప్పటివరకు సుమారు ..25కోట్లు ఖర్చయిందని, ఆ మొత్తం మొత్తాన్ని ఏపీఎస్‌ఆర్టీసీకి చెల్లిస్తున్నామని వివరించారు.

ఘాట్ రోడ్ల విషయంలో మొదట్లో వచ్చిన కొన్ని విమర్శలను గంటల్లోనే పరిష్కరించామని చెప్పారు. ప్రతిపక్షాల్లో ఉన్న మాజీ ఎమ్మెల్యేలు కూడా స్త్రీ శక్తి పథకం అమలును కొనియాడటం రాష్ట్ర ప్రభుత్వానికి గర్వకారణమని తెలిపారు. త్వరలోనే 750 ఎలక్ట్రిక్ ఏసీ బస్సులు రానున్నాయని, రాబోయే 4 ఏళ్లలో 2500 ఎలక్ట్రిక్ బస్సులు ప్రవేశపెట్టనున్నామని తెలిపారు. తిరుమల మినహా రాష్ట్రంలోని అన్ని ఘాట్ రోడ్లలో మహిళలకు ఉచిత ప్రయాణం వర్తిస్తుందని స్పష్టం చేశారు. రాష్ట్ర బోర్డర్ ప్రాంతాల్లో ఉన్న సమస్యలను వారం రోజుల్లో పరిష్కరిస్తామని మంత్రి మండిపల్లి తెలిపారు. కండక్టర్ల కొరత అంశం తమ దృష్టికి వచ్చిందని, తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు.

పురుషులు ఇబ్బందులు పడుతున్నారనే అంశంపై ఇప్పటివరకు ఎలాంటి ఫిర్యాదులు రాలేదని స్పష్టం చేశారు. భవిష్యత్తులో మహిళలకు ప్రత్యేక గుర్తింపుకోసం స్మార్ట్ కార్డ్ జారీ చేసే ఆలోచన ఉందని మంత్రి ప్రకటించారు. పెట్టుబడిదారులను రాష్ట్రానికి ఆకర్షించడంలో భాగంగా మాత్రమే భూములను కేటాయిస్తున్నామని, ఆ భూములు పూర్తిగా ఏపీఎస్‌ఆర్టీసీ ఆధీనంలో ఉన్నవే అని స్పష్టం చేశారు. ఈ పథకం అమలు చేయగలగడం మా పూర్వ జన్మ సుకృతంగా భావిస్తున్నాం. స్త్రీశక్తి భారంకాదు, ఇదిరాష్ట్ర ప్రభుత్వ బాధ్యత. మహిళలఆశీస్సుల వలననే చంద్రబాబు గారు నాలుగోసారి సిఎం అయ్యారు. మహిళల కోసం ఈ పథకాన్ని ప్రారంభించడం గర్వకారణం అని అన్నారు.

## వారం - వర్జ్యం

21-08-2025, గురువారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
శ్రావణ మాసం, దక్షిణాయణం
వర్ష ఋతువు, కృష్ణపక్షం
త్రయోదశి మ.12.48
పుష్యమి రా.12.11
వర్జ్యం : మ1.03-2.39
దు.ఉ.10.05-10.55, 2) మ.3.08-3.58
శుభసమయం: ఉ6.30-8.30
రాహుకాలం - మ.1.30-3.00

## వార్తాఫలం

**మేషం :** బంధువుల నుండి వచ్చిన ఆనందం కలిగిస్తుంది. ఆరోగ్యంపట్ల మెలుకువ అవసరం.

**వృషభం :** ఇంటర్వ్యూలకు హాజరవుతారు. షేర్లు, భూముల క్రయవిక్రయాలలో ప్రోత్సాహం లభిస్తుంది.

**మిథునం:** ధైర్యం, పట్టుదలతో ముందుకు సాగుతారు. రుణాలు తీరుస్తారు.

**కర్కాటకం :** ఆస్తి వివాదాలు తీరి నూతన ఒప్పందాలు కుదురుతాయి. వాహన సౌఖ్యం.

**సింహం:** భూమి, ఇళ్ల కొనుగోలు యత్నాలు సాగిస్తారు. భాగస్వామ్య వ్యాపారాలు లాభిస్తాయి.

**కన్య :** ఉద్యోగులకు హోదాలు కలుగుతాయి. కళలు, రాజకీయ రంగాల వారికి అన్ని విధాలా అనుకూలిస్తాయి.

**తుల :** చిన్న చిన్న నిర్మాణపనులకు పన్నులు కట్టడానికి ధనం ఖర్చుచేయవలసి వస్తుంది.

**వృశ్చికం:** వృత్తి వ్యాపారలో చెప్పుకోదగిన ఒడిదుడుకులు ఉండవు. ధనలాభం.

**ధనుస్సు:** సెంటిమెంటు వస్తు భద్రతపట్ల జాగ్రత్తలు పాటించండి. సోదరుల కలయిక.

**మకరం:** మీ వెంటే ఉంటూ మీ వైరి వర్గానికి సహాయసహకారాలు అందించే వారిని గుర్తిస్తారు.

**కుంభం:** కీలక వ్యావహారాలలో గోప్యతను వహించి లాభపడతారు. వస్తులాభం.

**మీనం :** దగ్గరి బంధువులతో చర్చించి ఒక శుభకార్యాన్ని ఖరారుచేస్తారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

## ప్రకాశం బ్యారేజీ వద్ద కొనసాగుతున్న

# మొదటి ప్రమాద హెచ్చరిక

**విజయవాడ.ఆగస్టు20,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రకాశం బ్యారేజి వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక కొనసాగుతున్నదని విపత్తుల నిర్వహణ సంస్థ ఎండి ప్రఖర్ జైన్ పేర్కొన్నారు. ప్రస్తుత ఇన్ ఫ్లో, ఔట్ ఫ్లో 4.92 లక్షల క్యూసెక్కులుగా ఉంది. గోదావరిలో నీరు ప్రవహిస్తున్నది. భద్రాచలం వద్ద నీటిమట్టం 42.2 అడుగులు ఉంది ప్రభావిత ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండాలని జిల్లా అధికార యంత్రాంగం హెచ్చరించింది. సహాయక కార్యకలాపాలకు రూ.16 కోట్లు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. రక్షణ చర్యలకు ఎస్డీఆర్‌ఎఫ్ బృందాలను సిద్ధం చేశారు. కృష్ణా నదిపరీవాహక లంక గ్రామ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. వాగులు/కాలువలు దాటే ప్రయత్నం చేయరాదని పేర్కొన్నారు. కృష్ణా నదికి విస్తృతంగా వచ్చి చేరుతున్న దృష్ట్యా ప్రకాశం బ్యారేజీ ఎగువ నుంచి దిగువకు ఉన్న లోతట్టు ప్రాంతాలను అధికార యంత్రాంగం అప్రమత్తం చేసింది. ఇప్పటికే ముంపు ప్రమాదం ఉన్న గ్రామాల ప్రజలను పునారావాస కేంద్రాలకు తరలించారు. ఈ సాయంత్రానికి ఆనకట్ట వద్ద వరద నీరు తగ్గుముఖం పడుతుందని అధికారులు తెలిపారు. మరో వైపు గోదావరి నదికి వరద భారీగానే చేరింది. ధవళేశ్వరం బ్యారేజీ ప్రాంతంలోను,రాజమండ్రి వంతెన సమీపంలో పెరుగుతున్న వరదను దృష్టిలో ఉంచుకుని అనేక సహాయక చర్యలను సన్నద్ధం చేసారు.

# ప్రధానికైనా ఉద్వాసనే!

>> కూడా విసిరారు. గుజరాత్ హోంమంత్రిగా ఉన్న సమయంలో అమిత్ షా అరెస్టయిన అంశాన్ని కాంగ్రెస్ ఎంపీ కెసి వేణుగోపాల్ లేవనెత్తారు. దీన్ని అమిత్ షా ఖండిస్తూ అరెస్టుకు ముందే నైతిక కారణాలతో తాను రాజీనామా చేశానని, కోర్టు నిర్దోషిగా ప్రకటించాకే ప్రభుత్వంలో చేరానని స్పష్టంచేశారు. తీవ్రమైన నేరారోపణలు ఎదుర్కొంటున్నప్పటికీ, రాజ్యాంగ పదవుల్లో కొనసాగడం తగదని హితవు పలికారు.ప్రతిపాదిత బిల్లులను అమిత్ షా, సంయుక్త పార్లమెంటరీ కమిటీకి సిఫారసు చేశారు. ఈ బిల్లులపై విపక్ష సభ్యులకు అభ్యంతరాలుంటే జెపిసికి వెల్లడించాలని సూచించారు. ఈ క్రమంలో ప్రతిపక్షాల నిరసనలు తెలిపాయి.ఈ గందరగోళం మధ్యలోనే అమిత్ షా మూడు బిల్లుల కోసం ప్రవేశపెట్టిన తీర్మానానికి లోక్‌సభ ఆమోదం తెలిపింది. దీంతో విపక్షాలు వెల్‌లోకి దూసుకురాగా, సభ వాయిదా పడింది. అయినప్పటికీ ప్రతిపక్ష ఎంపీలు ఆందోళనలు చేశారు.ఇక ఈ బిల్లులు ప్రకారం, ఐదేళ్ల జైలు శిక్ష పడే కేసుల్లో వరుసగా 30 రోజులు అరెస్ట్ లేదా నిర్బంధంలో ఉంటే ప్రధాన మంత్రి, ముఖ్యమంత్రి లేదా మంత్రులు 31వ రోజున తమ పదవిని కోల్పోతారు. ఒకవేళ ఎవరైనా మంత్రి పదవిలో ఉండి అరెస్టైతే వారిని తొలిగించేందుకు 30 రోజుల్లోపు రాష్ట్రపతికి ప్రధాని సిఫారసు చేయకపోయినా 31వ రోజు సదరు మంత్రి పదవిని కోల్పోతారు. ఒక వేళ ప్రధాని 30 రోజుల పాటు అరెస్టైతే ఆయన 30 రోజుల్లోపు రాజీనామా చేయకున్నా 31వ రోజున పదవి కోల్పోతారు. ఈ నేపథ్యంలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఈ బిల్లుపై సోషల్ మీడియా వేదికగా వివరణ ఇచ్చారు. రాజకీయాల్లో నైతిక విలువలను పునరుద్ధరించే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ఈ కీలక బిల్లు తెచ్చిందని స్పష్టం చేశారు. అరెస్ట్ అయి జైల్లో ఉన్న వ్యక్తులు ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి లేదా మంత్రులు వంటి ఉన్నత రాజ్యాంగ పదవుల్లో కొనసాగకుండా నిరోధించేందుకు ఉద్దేశించిన మూడు రాజ్యాంగ సవరణ బిల్లులను లోక్‌సభలో ప్రవేశపెట్టినట్టు వెల్లడించారు. స్పీకర్ అనుమతితో సభ ముందు ఈ బిల్లులను ఉంచినట్లు ఆయన తెలిపారు.

**బిల్లుల్లోని ప్రధాన నిబంధనలు ఇవే: అమిత్ షా**

1. జైల్లో ఉంటే పదవిలో కొనసాగలేరు

ఏదైనా కేసులో అరెస్ట్ అయి జైలులో ఉన్న వ్యక్తి.. ప్రధానమంత్రి, ముఖ్యమంత్రిగా గానీ, కేంద్ర లేదా రాష్ట్ర మంత్రిగా గానీ తన విధులను నిర్వర్తించలేరు. వారు తమ పదవిలో కొనసాగడాన్ని ఈ బిల్లులు పూర్తిగా నిరోధిస్తాయి.

2. 30 రోజుల గడువు

అరెస్టయిన రాజకీయ నాయకుడు 30 రోజుల్లోగా బెయిల్ పొందడంలో విఫలమైతే, 31వ రోజున వారిని పదవి నుంచి తప్పించాల్సి ఉంటుంది. ఒకవేళ ప్రధానమంత్రి లేదా ముఖ్యమంత్రి వారిని తొలగించకపోతే, చట్టప్రకారం వారు ఆ పదవిలో కొనసాగే అర్హతను వాటంతట అవే కోల్పోతారు. అయితే, న్యాయ ప్రక్రియ ద్వారా బెయిల్ పొందిన తర్వాత తిరిగి వారిని ఆ పదవుల్లో నియమించేందుకు అవకాశం ఉంటుంది.

3. నైతిక విలువల పరిరక్షణే లక్ష్యం రాజ్యాంగాన్ని రూపొందించిన సమయంలో, నేతలు అరెస్ట్ అయిన తర్వాత కూడా నైతిక బాధ్యతతో రాజీనామా చేయరని బహుశా మన రాజ్యాంగ నిర్మాతలు ఊహించి ఉండరని అమిత్ షా వ్యాఖ్యానించారు. ఇటీవల కాలంలో కొందరు ముఖ్యమంత్రులు, మంత్రులు అరెస్ట్ అయినా రాజీనామా చేయకుండా జైలు నుంచే ప్రభుత్వాలను నడుపుతున్న దిగ్భ్రాంతికరమైన సంఘటనలు దేశం చూసిందని ఆయన గుర్తుచేశారు. ఈ జాడ్యంపై ప్రజల్లో పెరుగుతున్న వ్యతిరేకతను, రాజకీయాల్లో దిగజారుతున్న ప్రమాణాలను దృష్టిలో ఉంచుకునే ఈ బిల్లులను తీసుకొచ్చినట్లు ఆయన వివరించారు. ఈ సందర్భంగా, ఒక మంత్రి, ముఖ్యమంత్రి లేదా ప్రధానమంత్రి జైలు నుంచి ప్రభుత్వాన్ని నడపడం సరైనదేనా? అనే విషయాన్ని దేశ ప్రజలు తేల్చుకోవాలని అమిత్ షా అన్నారు.

# ఆరుగురు విద్యార్థులు మృతి

>> స్కూల్ బ్యాగులు పెట్టిన అనంతరం గ్రామ శివారులోని హైస్కూల్ శివారులోని బిల్డింగ్ నిర్మాణపు పనులు జరుగుతున్న సమీపంలోని నీటి కుంటలో సరదాగా ఈత కొట్టడానికి శశికుమార్, కిన్నెరసాయి, భీమా, సాయికిరణ్, వీరేంద్ర, మహాబాబు, ధుర్గాప్రసాద్ మొత్తం ఏడు మంది విద్యార్థులు ఈతకు వెళ్లారు. ఇటీవలే కురిసిన భారీ వర్షాలకు కుంటలోకి భారీ వర్షం నీరు చేరడడంతో కుంటలో ఈతకు దిగిన ఆరుగురు విద్యార్థులు శశికుమార్, కిన్నెరసాయి, భీమా, సాయికిరణ్, వీరేంద్ర, మహాబాబు నీటి కుంటలో మునిగిపోయారు. గమనించిన మరో విద్యార్థి ధుర్గాప్రసాద్ సమీపంలోని గ్రామంలోకి చేరుకొని జరిగిన విషయాన్ని గ్రామస్తులకు సమాచారాన్ని తెలియజేశాడు. గ్రామస్తులు వచ్చి నీటికుంటలో చిక్కుకు పోయిన 6 మంది మృత్యుదేహాలను వెలికి తీశారు. విషయం తెలుసుకున్న సిఐ గంగాధర్ పోలీసు సిబ్బందితో గ్రామానికి వెళ్లి సంఘటనా స్థలాన్ని పరిశీలించి విచారణ చేపట్టారు. అలాగే పత్తికొండ ఆర్డీవో భరత్‌నాయక్, తహాసిల్దార్ రామేశ్వర్‌రెడ్డి, ఎంపిడివో గీతావాణీ చిగలి గ్రామాన్ని సంధర్శించి ప్రమాదం జరిగిన ఘటనా వివరాలను అధికారులు తమ గ్రామస్తులను, విద్యార్థుల కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. నీటి కుంటలో పడి మృతి చెందిన విద్యార్థుల తల్లిదండ్రులను గడప గడపకు వెళ్లి ఓదార్చారు. హైస్కూల్ నిర్మాణపు పనులు జరుగుతున్న కొండ సమీపంలో అక్రమంగా గరుసును తోలడంతో పెద్దగుంత ఏర్పడి ఈ రోజు 6 మది విద్యార్థుల మృతికి కారణమైందన్నారు.

**రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లిచాలి: ఎమ్మెల్యే విరుపాక్షి**

చిగలి గ్రామంలో ఈతకు వెళ్లి మృత్యువాత పడ్డ విద్యార్థుల మృతుల కుటుంబానికి రూ.50లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని బూషినేని విరుపాక్షి ప్రభుత్వాన్ని కోరారు.

# అనర్హులను ఏరివేసేందుకే సదరం సర్టిఫికెట్ల పునఃపరిశీలన



- మంత్రి కొలుసు పార్థసారధి

**సచివాలయం,ఆగస్టు 20,ప్రభాతవార్త :** బోగస్ సదరం సర్టిఫికేట్లతో దివ్యాంగుల ఫించన్లను పొందే అనర్హులను ఏరివేసేందుకే సదరం సర్టిఫికెట్ల పున:పరిశీలన కార్యక్రమం జరుగుతుందని రాష్ట్ర సమాచార పౌర సంబంధాలు, గృహనిర్మాణ శాఖమంత్రి కొలుసు పార్థసారధి స్పష్టం చేశారు.గతంలో ఉన్న అర్హతలను బట్టే సర్టిఫికేట్ల పున: పరిశీలన జరుగుతుందని, అర్హతలను మారి ్చ ఫించనుదారులకు అన్యాయం చేసే విధంగా కూటమి ప్రభుత్వం ఏ మాత్రం ప్రవర్తించడం లేదని ఆయన తెలిపారు. బుధవారం రాష్ట్ర సచివాలయం ప్రచార విభాగంలో మంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ ఎన్టీఆర్ భరోసా ఫించను పథకం క్రింద దివ్యాంగులకు ప్రభుత్వం ఇచ్చే రూ.6000ల ఫించన్ గత ప్రభుత్వం హాయంలో అనర్హులకు కూడా మంజూరు చేసి దుర్వినియోగం చేయడం జరిగిందన్నారు.రాష్ట్రంలో మొత్తం 7.86లక్షల మంది దివ్యాంగ ఫించన్లు పొందడం జరుగుతుందని,వారిలో 5.10లక్షల మందికి చెందిన సదరం సర్టిఫికేట్లను పున:పరిశీలించేందుకు నోటీసులు జారీ చేయడం జరిగిందన్నారు. అయితే ఇప్పటివరకు 4.50 లక్షల మంది వారి సర్టిఫికేట్లు తనిఖీ చేయించుకోగా వారిలో దాదాపు ఒక లక్ష మంది అనరు ్హలు ఉన్నట్లు గుర్తించడమైందన్నారు.అదే విధంగా మిగిలిన వారు తమ సర్టిఫికేట్లు రీవెరిఫై చేయించుకునేందుకు ముందుకు రాలేదన్నారు. వీరందరికి మరోసారి నోటీసులు జారీ చేస్తామని,అప్పటికీ వారు ముందుకు రాకపోతే వారి ఫించన్లు నిలుపుదల చేస్తామని తెలిపారు.అయితే వైద్యులు ఎవర్నిఅయితే అనర్హులుగా దృవీకరించారో వారు మరోసారి తమ అర్జీని మండలాభివృద్ధ అధికారికిగాని, మున్సిపల్ కమీషనర్‌కు గాని అందజేసినట్లయితే మరోసారి వారి అర్హతను పరిశీలించడం జరుగుతుందన్నారు. అన్ని జిల్లాల్లో సదరం సర్టిఫికేట్ల రీవెరిఫికేషన్ జరిగిందని,అయితే అత్యధికంగా పులివెందులలోనే 1708మంది బోగస్ ఫించనుదారులు ఉన్నట్లు గుర్తించడమైందన్నారు.అదే విధంగా మచిలీపట్నంలో 1539మంది, చంద్రగిరిలో 1604మంది బోగస్ ఫించనుదారులను గుర్తించడమైందన్నారు. అదేవిధంగా అత్యల్పంగా కాకినాడలో 19మంది,విశాఖ దక్షిణ నియోజకవర్గంలో 39మంది మరియు తాడికొండలో 55మంది బోగస్ ఫించనుదారులను గుర్తించడం జరిగిందన్నారు.గత ప్రభుత్వం రూ.3వేలు ఫించను ఇస్తానని హామీ ఇచ్చి ఘోరంగా మోసం చేయడం జరిగిందని,అయితే తమ ప్రభుత్వం రూ.3వేల నుండి రూ.4వేలకు పెంచడమే కాకుండా అధికారంలోనికి వచ్చే మూడు మాసాల ముందు నుండే పెంచిన ఫించను ఎరియర్స్‌ను కూడా ఫించనుదారులకు చెల్లించడం జరిగిందన్నారు. తమ కూటమి ప్రభుత్వం దివ్యాంగులకు రూ.6వేలు,మంచంమీద నుండి లేవలేని అంగవికలురకు రూ.15వేలు,దీర్ఘకాలిక వా ్యధిగ్ర స్తులకు రూ.10వేలు ఫించన్ తమ ప్రభుత్వం అందజేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర ఇమేజ్‌ను డ్యామేజ్ చేసే విధంగా ప్రధాన ప్రతిపక్ష పార్టీ విషం చిమ్మడం ఎంతో దురదృష్టకరమన్నారు. రాష్ట్ర రాజధాని అమరావతిపై గత ప్రభుత్వానికి ఉన్న ద్వేషంతో ఎటువంటి అభివృద్ధి పనులు నిర్వహించక పోవడం వల్లే నేడు రాజధాని ప్రాంతం ముంపుకు గురవ్వడానికి కారణ మన్నారు. రాజధాని ప్రాంతంలో భవిష్యత్తులో జరిగే నిర్మాణాలు,కట్టడాలు ఏ మాత్రం వరద నీటికి గురవ్వకుండా ఉండేందుకు అవసరమైన వరద నీటి పారుదల వ్యవస్థలను ప్రభుత్వం ప్రణాళికా బద్దంగా నిర్మిస్తున ్నట్లు మంత్రి తెలిపారు.

# మహిళలకు భద్రతా కవచంలా శక్తి యాప్

- మహిళా కమిషన్ ఛైర్మన్ డాక్టర్ రాయపాటి శైలజ

**విజయవాడ,ఆగస్టు20,ప్రభాతవార్తప్రతినిధి:** మహిళలకు భద్రతా కవచంలా శక్తి యాప్ ఉపయోగపడుతుందని రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్మన్ డాక్టర్ రాయపాటి శైలజ పేర్కొన్నారు. విజయవాడ కెబిఎన్ కళాశాలలో "మహిళల సంక్షేమం భద్రత, రక్షణ సాధికారికతపై" అవగాహన సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆమె మాట్లాడుతూమహిళల హక్కులు, భద్రత, సాధికారికతే మహిళా కమిషన్ లక్ష్యమని చెప్పారు. మహిళలు, బాలికలు శక్తి యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. ఇటీవల సైబర్ నేరాలు అనే కొత్త ముప్పు పొంచి ఉందని, మహిళలు, డిజిటల్ భద్రతా చైతన్యం పెంచుకోవాలన్నారు. అవసరమైన సమయంలో ప్రభుత్వ హెల్ప్‌లైన్స్, చట్టపరమైన రక్షణకు ఉపయోగించుకోవాలన్నారు. సోషల్ మీడియాలో మహిళలపై వేధింపులు జరుగుతున్నాయని, నకిలీ అకౌంట్లు సృష్టించి అపవాదులు వేయడం, వ్యక్తిగత పోటోలు, వీడియోలు దుర్వినియోగం చేయడం వంటి వాటి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. మహిళలు, ప్రత్యేక రక్షణ కోసం 181 హెల్ప్‌లైన్ ద్వారా తక్షణ సహాయం పొందాలన్నారు.ఈ కార్యక్రమంలో సిడబ్ల్యుసి సభ్యురాలు రాధాకుమారి, మహిళా కమిషన్ కార్యదర్శి అనూరాధ, వన్‌స్టాఫ్ సెంటర్ సిబ్బంది పాల్గొన్నారు.

# కేతిరెడ్డి పెద్దిరెడ్డికి హైకోర్టులో షాక్ తాడిపత్రి వెళ్లేందుకు అనుమతి రద్దు

**విజయవాడ,ఆగస్టు20,ప్రభాతవార్తప్రతినిధి:** మాజీ ఎంఎల్‌ఏ కేతిరెడ్డి పెద్దరెడ్డి హైకోర్టులో షాక్ ఎదురైంది,ఆయనకు తాడిపత్రి వెళ్ళేందుకు ఇటీవల హైకోర్టు సింగిల్ జడ్జి ఇచ్చిన అనుమతిని డివిజన్ బెంచి బుధవారం కొట్టేసింది. ఎంఎల్‌ఏ కేతిరెడ్డికి తాడిపత్రి వెళ్ళేందుకు అనుమతినిస్తే తగిన భద్రత కల్పించలేమని అనంతపురం ఎస్పీ జగదీష్ హైకోర్టు డివిజన్ బెంచిలో హైకోర్టు డివిజనల్ బెంచీలో పిటిషన్ దాఖలు చేసారు.

ఆయన తాడిపత్రి వస్తే శాంతి భద్రతలకు విఘాతం కలుగుతుందని

డివిజన్ బెంచి ఎదుట పిటిషనర్ తరపు న్యాయవాదులు వాదించారు. దీనిపై డివిజన్ బెంచి న్యాయమూర్తులు సింగిల్ బెంచి ఇచ్చిన తీర్పును రద్దు చేసారు.

# డిఎ, పిఆర్‌సి బకాయిల పిటిషన్‌పై విచారణ వాయిదా

**విజయవాడ,ఆగస్టు20,ప్రభాతవార్తప్రతినిధి:** వైసిపి ప్రభుత్వంలో పెండింగ్‌లో ఉన్న కరువు భత్యం (డిఎ), 11వ పిఆర్‌సి బకాయిలను చెల్లింపునకు ఉత్తర్వులు ఇవ్వాలంటూ ఎపి కాం ట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఎంప్లాయిస్ అసోసియేషన్(ఏపీసీపీఎస్ఈఏ) వేసిన పిటిషన్‌లో ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు ఇచ్చింది. కౌంటర్ దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ఆర్థికశాఖ ముఖ్యకార్యదర్శి, ట్రెజరీస్, అకౌంట్స్ డైరెక్టరేట్, పే అండ్ అకౌంట్స్ ఆఫీసర్, వర్క్ అకౌంట్స్ డైరెక్టర్లకు నోటీసులు ఇచ్చింది. అసోసియేషన్ అధ్యక్షుడు పఠాన్ బాజీ వేసిన వ్యాజ్యంపై తదుపరి విచారణను నాలుగు వారాలకు వాయిదా వేస్తూ జస్టిస్ ఎన్. విజరు ఆదేశాలిచ్చారు.

# భూమనపై భూ ఆక్రమణ కేసు కొట్టివేత

**విజయవాడ,ఆగస్టు20,ప్రభాతవార్తప్రతినిధి:** టిటిడి మాజీ ఛైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి కుటుంబ సభ్యులకు మంగళవారం హైకోర్టులో ఊరట లభించింది. వాళ్లకు చెందిన భూమిని అక్రమిత భూమిగా పేర్కొంటూ తిరుపతి రూరల్ మండల తహసీల్దార్ జారీ చేసిన నోటీసును హైకోర్టు రద్దు చేసింది. ఆ నోటీసు చట్ట నిబంధనలకు వ్యతిరేకమని భూమాన కుటుంబసభ్యుల తరపు సీనియర్ న్యాయవాది చిత్తరవు నాగేశ్వరరావు వాదనను ఆమోదిస్తూ జస్టిస్ తర్లాడ రాజశేఖరరావు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. తిరుపతి గ్రామీణ మండలం, తిరుచానూరు గ్రామంలోని సర్వే నెంబర్ 479లో ఉన్న 9.33 ఎకరాల భూమిని ఆక్రమిత భూమిగా పేర్కొంటూ తహసీల్దార్ ఇచ్చిన నోటీసును కరుణాకర్ రెడ్డి భార్య జంగా రేవతి, కుమారుడు భూమన అభినయ రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. హైకోర్టు ఉత్తర్వులతో ఆ తొమ్మిది ఎకరాల భూమిని పిటిషనర్లు ఆక్రమించుకున్నారని ప్రభుత్వం చేసిన వాదన వీగిపోయింది. యాపిల్ ఫోన్ లాక్ తీయలేదు లిక్కర్ స్కాం కేసులో నిందితుడు వెంకటేష్ నాయుడు ఫోన్‌లోని సమాచారాన్ని సిట్ ఆఫీసర్లు మీడియాకు లీక్ చేశారనే అభియోగాలు వాస్తవం కాదని సిట్ తరఫున పబ్లిక్ ప్రాసిక్యూటర్ వాదించారు. యాపిల్ ఫోన్ లాక్ ఓపెన్ చేసేందుకు నిందితుడు సహకరించలేదని, యాపిల్ ఫోన్‌ను ఓపెన్ చేయలేమని తెలిపారు. ఈ కేసులో గ్యాగ్ ఆర్డర్ పొందేందుకు వెంకటేష్ భార్య మహిత ప్రయత్నిస్తున్నారని చెప్పారు. లిక్కర్ స్కాంపై సిట్ దర్యాప్తు చేస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే తన భర్త ఫోన్‌లోని సమాచారన్ని సిట్ లీక్ చేసిందంటూ వెంకటేష్ నాయుడు భార్య మహిత దాఖలు చేసిన వ్యాజ్యంపై మంగళవారం హైకోర్టు విచారణ జరపింది. ప్రభుత్వ వాదనలు తరువాత విచారణను ఆగస్టు 22కి వాయిదా వేస్తూ జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ఉత్తర్వులు జారీ చేశారు.

# రాష్ట్ర వ్యాప్తంగా పిపిలు, ఎపిపిలపై క్రమశిక్షణా చర్యలు తీసుకున్న ప్రభుత్వం

- డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్ 'భైరా' సిఫార్సు మేరకు తొలగింపు

- నిబంధనలు ఉల్లంఘించిన పిపిలు, ఎపిపిలుగా ఉన్న 17 మంది లాయర్లపై వేటు

**విజయవాడ క్రైం,ఆగస్టు 20,ప్రభాతవార్త** నిబంధనలు ఉల్లంఘించినందుకు గాను పీపీలు,ఏపీపీలుగా పనిచేస్తున్న 17 మంది లాయర్లపై క్రమ శిక్షణా చర్యల్లో భాగంగా తొలగించాలని ప్రాసిక్యూషన్స్ డైరెక్టర్ భైరా రామకోటేశ్వరరావు చేసిన సిఫార్సు మేరకు ప్రభుత్వం వేటు వేసింది. రాష్ట్ర వ్యాప్తంగా పలు కోర్టులో చేసే ఇద్దరు పీపీలతో పాటు 15 మంది ఏపిపిలను తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. తొలగించబడిన పిపిలు,ఎపిపిలు: 1.కర్నూలు సెషన్స్ కోర్టులో పీపీగా భాధ్యతలు నిర్వహిస్తున్న వెంకటరెడ్డి 2.ఒంగోలు ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ కోర్టులో పీపీగా విధులు నిర్వహిస్తున్న సుందర 3.కర్నూలు జిల్లా ఆత్మకూరు కోర్టులో అసిస్టెంట్ పీపీ ఆసిఫ్ ఆలీ ఖాన్ 4.కర్నూలు నాలుగో అడిషనల్ జిల్లా సెషన్స్ కోర్టు ఏపీపీ ప్రకాశరెడ్డి 5.కర్నూలు అదనపు జిల్లా కోర్టులో ఏపీపీ బాల రంగస్వామి 6.అనంతపురం జిల్లా గుత్తి నాలుగో అదనపు జిల్లా కోర్టులో ఏపిపిగా విధులు నిర్వహిస్తున్న సుదర్శనరెడ్డి 7.కడప ఏడవ అదనపు జిల్లా కోర్టులో ఏపీపీగా పనిచేస్తున్న మొఘల్ ఎస్మిన్ బేగం 8.కడప జిల్లా 6వ అదనపు,డిస్ట్రిక్ట్ సెషన్స్ కోర్టులో ఏపిపిగా విధులు నిర్వహిస్తున్న ప్రతాప్‌కుమార్ రెడ్డి 9.మదనపల్లి కోర్టులో ఏపీపీగా ఉన్న వి.జయనారాయణ రెడ్డి 10.రాయచోటి ఐదవ అడిషనల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ కోర్టులో ఏపిపిగా పనిచేస్తున్న టి.జగన్మోహనరెడ్డి 11.మచిలీపట్నం అడిషనల్ జడ్జి కోర్టులో ఏపిపిగా పనిచేస్తున్న సియాద్రి చిన్నారావు 12.గుడివాడ 11వ అదనపు డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ కోర్టులో ఏపిపిగా పనిచేస్తున్న పల్లపు కృష్ణ, 13.గుంటూరు అడిషనల్ డిస్ట్రిక్ట్,సెషన్స్ కోర్టులో ఏపీపీ పల్లపు కృష్ణ 14.గుంటూరు నాలుగో అసిస్టెంట్ జడ్జి కోర్టులో ఏపీపీ జ్యోత్న 15.గుంటూరు 12వ జిల్లా అడిషనల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ కోర్టులో ఏపీపీగా పనిచేస్తున్న బొడ్డు కోటేశ్వరరావు 16. నెల్లూరు అసిస్టెంట్ సెషన్స్ కోర్టులో ఏపీపీగా విధులు నిర్వహిస్తున్న ప్రసాదరావులను తొలగిస్తూ చర్యలు తీసుకోవాలని ప్రాసిక్యూషన్ ్స డైరెక్టర్‌కు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

# కొత్త క్రిమినల్ చట్టాలపై చర్చలు

## సిఎస్, డిజిపిలతో కేంద్ర హోంశాఖ కార్యదర్శి వీడియో కాన్ఫరెన్స్



నూతన క్రిమినల్ చట్టాలపై కేంద్ర హోంశాఖ కార్యదర్శి గోవింద్ మోహన్ నిర్వహించిన వీడియో సమావేశం

**విజయవాడ,ఆగస్టు20, ప్రభాతవార్తప్రతినిధి:** నూతన క్రిమినల్ చట్టాల పటిష్ట అమలుకు సంబంధించి తీసుకోవాల్సిన చర్యలపై బుధవారం కేంద్ర హోం శాఖ కార్యదర్శి గోవింద్ మోహన్ ఢిల్లీ నుండి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్, డిజిపి హరీశ్ కుమార్ గుప్తాలతో వీడియో సమావేశం నిర్వహించారు.మన దేశంలో కొత్త క్రిమినల్ చట్టాలు అనగా భారతీయ న్యాయ సంహిత,భారతీయ నాగరిక్ సురక్ష సంహిత,భారతీయ సాక్ష్య అధినియం అనే చట్టాలు పాత క్రిమినల్ చట్టాలైన ఇండియన్ పీనల్ కోడ్,క్రిమినల్ ప్రొసీజర్ కోడ్.ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్ ల స్థానే అమలులోకి వచ్చాయి.ఈనూతన క్రిమినల్ చట్టాలను క్షేత్ర స్థాయిలో పటిష్టవంతంగా అమలు చేసేందుకు వివిధ పోలీస్ స్టేషన్లు, కోర్టులు,జైళ్ళు,ఫోరెన్సిక్ లేబరేటరీల్లో అందుబాటులో ఉన్న మౌలిక సదుపాయాలు, సాంకేతిక పరిజ్ఞానం తదితర అంశాలపై ఆయన చర్చించారు.ఈసందర్భంగా హోంశాఖ కార్యదర్శి గోవింద్ మోహన్ మాట్లాడుతూ ఫోరెన్సిక్ ఇకో సిస్టమ్ ను పటిష్టం చేయాల్సిన అవసరం ఉందని దానిలో భాగంగా ప్రస్తుతం ఉన్న ఫోరెన్సిక్ సైన్స్ లేబరేటరీలను మరింత పటిష్టంవంతం చేయాలని ఆదిశగా తగిన చర్యలు తీసుకోవాలని సిఎస్,డిజిపిలకు సూచించారు.వాటిలో వివిధ ఖాళీలను భర్తీ చేసేందుకు అర్హులైన వారిని కాంట్రాక్టు విధానంలో భర్తీ చేయాలని చెప్పారు.నూతన క్రిమినల్ చట్టాల అమలులో ఎపి దేశానికి రోల్ మోడల్ గా ఉండే విధంగా తగు చర్యలు తీసుకోవాలని సిఎస్,డిజిపిలకు సూచించారు.నేరం జరిగిన ప్రాంతాల్లో అనగా సీన్ ఆఫ్ అఫెన్స్ లో పూర్తిగా ఆడియో వీడియో చిత్రీకరణ చేయాలని,అన్ని ఎఫ్ఐఆర్లను ఇసాక్ష్యంలో పొందుపర్చాలని డిజిపికి హోంశాఖ కార్యదర్శికి గోవింద్ మోహన్ సూచించారు. నూతన క్రిమినల్ చట్టాల పటిష్ట అమలుకు సంబంధించి కోర్టు రూములు,జైళ్ళు, ఫోరెన్సిక్ సైన్స్ లేబొరేటరీలు,ప్రభుత్వ కార్యాలయాల,బ్యాంకులు తదితర చోట్ల వీడియో కాన్ఫరెన్సింగ్ విధానం అందుబాటులో ఉండేలా చూడాలని కేంద్ర హోంశాఖ కార్యదర్శి గోవింద్ మోహన్ సిఎస్,డిజిపిలకు సూచించారు.అలాగే ట్రైనింగ్ అండ్ కెపాసిటీ బిల్డింగ్,జీరో ఎఫ్ఐఆర్, ఇఎఫ్ఐఆర్,మానిటరింగ్ ఆఫ్ ఆర్గనైజ్డ్ క్రైమ్,వివిధ ఫోరెన్సిక్ సైన్స్ లేబొరేటరీల ఆధునికీకరణ,తగిన సిబ్బంది ఏర్పాటు,సిటిజన్ సెంట్రిక్ ప్రొవిజన్స్ అయిన ఎస్ఎంఎస్,ఇమెయిల్ సేవలను సిసిటిఎన్స్తో ఇంటిగ్రేషన్,ఫిర్యాదుదారులకు ఎస్ఎంఎస్ అలెర్టులు పంపించడం వంటి అంశాల్లో ఎపి పోలీసులు చేపట్టిన ఎపి పోలీస్ సేవా,సిటిజన్ పోర్టల్,శక్తి యాప్ వంటి వినూత్న చర్యలను హోంశాఖ కార్యదర్శి గోవింద్ మోహన్ ప్రశంసించారు.

# బ్రహ్మోత్సవాల్లో భక్తులకు సౌలభ్యంగా ఏర్పాట్లు

- మాఢవీధుల్లో ఇఒ శ్యామలరావు, అదనపు ఇఒ చౌదరి తనిఖీలు



**తిరుమల,ఆగస్టు 20ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమలశ్రీ వేంకటేశ్వరస్వామికి సెప్టెంబర్24నుండి తొమ్మిదిరోజులు జరగనున్న సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో భక్తులకు సౌలభ్యంగా ఏర్పాట్లు చేపడుతున్నట్లు టిటిడి ఇఒ జె.శ్యామలరావు, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి తెలిపారు.తొమ్మిదిరోజులు ఉదయం ,రాత్రి వాహనసేవలు ఆలయ మాఢవీధుల్లో ఊరేగనున్నందున వేడుకలకు అశేషంగా భక్తులు తరలివస్తారని అంచనాతో పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేపట్టడం జరుగుతోందన్నారు. బ్రహ్మోత్సవాల సమయంలో గ్యాలరీలకు ప్రవేశ నిష్క్రమణ మార్గాలు, అందులో ఉండే భక్తులకు సౌకర్యాలు, సదుపాయాలు,భద్రత పరంగా తదనుగుణంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పటిష్ట ఏర్పాట్లపై బుధవారం సాయంత్రం ఆలయ మాడవీధుల్లో తనిఖీలు చేశారు. తిరుపతి జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్‌రాజు, టిటిడి సివిఎస్ఒ కెవి మురళీకృష్ణ, తిరుమల అదనపు ఎస్పీ ఐ.రామకృష్ణ, డిఎస్పీ కె.విజయశేఖర్, ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం, టిటిడి విజిలెన్స్ విఎస్ఒలు ఎన్టీవిరామ్‌కుమార్, సురేంద్ర, ఆలయ ఏవిఎస్ఒ రాజశేఖర్, తిరుమల సిఐలు విజయకుమార్,రాముడు,సిఐ సత్యనారాయణ, సిపిఆర్ఒ డాక్టర్ తలారి రవి, పిఆర్ఒ నీలిమతో కలసి టిటిడి ఇఒ జె.శ్యామలరావు, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి ఏర్పాట్లను పరిశీలించారు.మాఢవీధుల్లో వాహనసేవలు జరిగే సమయంలో గత అనుభవాల దృష్ట్యా భక్తులకు ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సదుపాయాలు ఉంటాయన్నారు. పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేపడుతున్నట్లు తెలిపారు. మాఢవీధుల్లోని గ్యాలరీల్లో పోలీసులు, శ్రీవారిసేవకులు, ఎస్పిఎఫ్, ఆక్టోపస్, విజిలెన్స్ బలగాలు భద్రతాపరంగా, సేవలకు సిద్దంగా ఉంటారన్నారు. దాదాపు 2లక్షలమంది లోపు భక్తులు రావచ్చని అంచనాతో అన్ని ఏర్పాట్లు చేపడుతున్నారు. ఆలయం ముందు, మాఢవీధుల్లో గ్యాలరీలు నిర్మాణం పనులు తనిఖీ చేశారు. గ్యాలరీల్లో భక్తులకు అన్నప్రసాదాలు, తాగునీరు. టీ,కాఫీ,పాలు అందించేలా శ్రీవారిసేవకులు, టిటిడి ఉద్యోగులను నియమిస్తున్నామన్నారు. తిరుమలలో ట్రాఫిక్‌కు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నారని, అదనపు పార్కింగ్ ప్రదేశాలకు సూచిక బోర్డులు ఏర్పాటుచేస్తున్నారు. ఆ తొమ్మిదిరోజులు అన్ని ఆర్జితసేవలు, ఇతర ప్రత్యేక దర్శనాలు, సిఫార్సుదర్శనాలు,బ్రేక్ దర్శనాలు పూర్తిగా రద్దుచేస్తున్నారు.

# తిరుపతిలో హాథీరాంజీ బాబా మఠం భవనాన్ని కూల్చొద్దు

- మఠం భూముల పరిరక్షణకు కృషి చేస్తాం : తెలంగాణ జనసేన విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సంపత్ నాయక్

**తిరుపతిరూరల్,ఆగస్టు20 ప్రభాతవార్త:** తిరుపతిలో పురాతన కట్టడమైన శ్రీహాథీరాంజీ బావాజీ మఠం భవనాలను కూల్చొద్దని, బాబా మఠానికి చెందిన 16వేల ఎకరాల విలువైన ఆస్తులను పరిరక్షించాలని తెలంగాణా జనసేన పార్టీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు సంపత్ నాయక్ డిమాండ్ చేసారు. బుధవారం తిరుపతిరూరల్ మండలం వేదాంతపురం పంచాయతీలోని విద్యుత్ నగర్‌లో బంజరా బిడ్డలు నిర్మించే శ్రీహాథీరాంజీ బావాజీ ఆలయ నిర్మాణ పనులను పరిశీలించారు. ఆలయ నిర్మాణ పనులు నిలుపుదలపై ఆవేశం వ్యక్తపరిచారు. బాలలయంలో వున్న బావాజీ విగ్రహాన్ని సంపత్ నాయక్ దర్శించుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ సాక్షత్తు వేంకటేశ్వరస్వామితో పాచికలు ఆడిన పరమభక్తుడు బావాజీ బంజరా బిడ్డ కావడం తమ జాతి చేసుకున్న అదృష్టమన్నారు. శ్రీవారికి పరమభక్తుడైన బావాజీ మఠం నుంచే మొదటి నైవేద్యం వెళ్ళుతుందని, అంతటి వైశిష్ట్యం కలిగిన బావాజీ మఠాన్ని, ఆస్తులను పరిరక్షించాల్సిన బాధ్యత టిటిడిపైన, ప్రభుత్వంపైన ఉందన్నారు.

# తిరుమల సమాచారం

## పూర్ణాహుతితో ముగిసిన సాంగోపాంగ శ్రీనివాస విశ్వశాంతి మహాయాగం



**తిరుమల,ఆగస్టు 20ప్రభాత వార్తప్రతినిధి:** ప్రపంచవ్యాప్తంగా ఉన్న హిందు భక్తులు ఐశ్వర్యం, ఆయురారోగ్యం, సంపదలు కాంక్షిస్తూ చేపట్టిన సంగోపాంగ శ్రీనివాస విశ్వశాంతి మహాయాగం బుధవారం మధ్యాహ్నం పూర్ణాహుతితో శాస్రో ్తక్తంగా ముగిసింది. తిరుమ లలో ధర్మగిరి శ్రీవేంకటేశ్వర వేదవిజ్ఞాన పీఠంలో నిర్వహించిన శ్రీనివాస విశ్వశాంతి మహాయాగంలో నాలుగు రోజులుగా 32మంది వేదపండితులు పాల్గొని వేదపారాయణం, సుందరకాండపారాయణం తదితర వైదిక క్రతువులు జరిపించారు. దేశంలోని వివిధ ప్రాంతాల్లో విశ్వశాంతి యాగాలు, హవనాలను నిర్వహించాలని టిటిడి నిర్ణయం తీసుకుందని టిటిడి ఇఒ జె.శ్యామలరావు, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి వెల్లడించారు. త్వరలోనే ఈ కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. మహాయాగం కార్యక్రమాలు వేదోక్తంగా నిర్వహించారు.పూర్ణాహుతిలో టిటిడి ఇఒ శ్యామలరావు దంపతులు, టిటిడి అదనపు ఇఒచిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, ఎస్వీవేదవిజ్ఞానపీఠం ప్రిన్సిపాల్ కుప్పాశివసుబ్రమణ్యం అవధాని, అర్చకులు. వేదపండితులు పాల్గొన్నారు.

## ప్రయాణికులకు మెరుగైన సేవలు

- తిరుమల భక్తులకు ప్రాధాన్యత
- దక్షిణ మధ్య రైల్వే జిఎం సంజయ్‌కుమార్‌శ్రీవాస్తవ



**తిరుమల,ఆగస్టు 20ప్రభాతవార్తప్రతినిధి:** ప్రయాణీకులకు మెరుగైన సేవలందించడమే లక్ష్యంగా రైల్వే సేవలందిస్తుందని, ఇంకా తిరుమల క్షేత్రాన్ని దృష్టిలో ఉంచుకుని నడుస్తున్న రైళ్ళలో భద్రతకు ప్రాధాన్యత ఉంటుందని దక్షిణమధ్యరైల్వే జిఎం సంజయ్ కుమార్‌శ్రీవాస్తవ తెలిపారు. తిరుపతి రైల్వేస్టేషన్ అంతర్జాతీయంగా విస్తరణ, అభివృద్ధి పనులు అనుకున్న స్థాయిలో సాగుతున్నాయన్నారు. పలు మార్పులు కూడా జరిగాయన్నారు. శ్రీవాస్తవ దంపతులు తిరుమలకు చేరుకున్నారు. ఆలయ అధికారులు స్వాగతం పలికి శ్రీవారి దర్శనం చేయించారు. అనంతరం తీర్థప్రసాదాలు అందజేశారు.

## భక్తులకు అందుబాటులోకి పుష్కరిణి



**తిరుమల,ఆగస్టు 20ప్రభాత వార్తప్రతినిధి:** నెలరోజుల మరమ్మతుల అనంతరం తిరుమలలో శ్రీవారి పుష్కరిణి భక్తులకు బుధవారం నుండి అందుబాటులోకి వచ్చింది, పాతనీటిని తొలగించి ఇటీవల కొత్తగా నీటితో నింపారు. స్వామి వారి పుష్కరిణి మెట్లకు ఆకర్షణీయమైన రంగులు అద్దకంతో శోభాయమానంగా తీర్చిదిద్దారు. దాదాపు కోటిలీటర్ల నీటితో స్వామి పుష్కరిణి నింపారు. ప్రతిరోజూ నిర్వహించే పుష్కరిణి హారతి పునరుద్దరణ చేశారు.

## బ్రహ్మోత్సవాలకు సర్వాంగసుందరంగా సిద్ధమవుతున్న ఏడుకొండలు!

**తిరుమల,ఆగస్టు 20ప్రభాతవార్తప్రతినిధి:** ఏడుకొండల శ్రీవేంకటేశ్వరస్వామికి సెప్టెంబర్ 24నుండి మొదలుకానున్న సాలకట్ల వార్షిక బ్రహ్మోత్సవాలకు తిరుమలలో ఏర్పాట్లు వేగంగా సాగుతున్నాయి. తొమ్మిదిరోజులుపాటు జరిగే దేవుని ఉత్సవాలకు దేశవిదేశాల ఉండి అశేషంగా భక్తులు తరలివస్తారనే ముందుచూపుతో అన్ని విధాలా అవసరమైన ఏర్పాట్లు, సౌకర్యాలు,ఆలయ గోపురాలకు రంగులు వేయడం, చక్కగా తీర్చిదిద్దడం, ఆలయం ప్రహారీగోడలకు రంగులేసే పనులు మొదలయ్యాయి. ఇంకా మాఢవీధుల్లో గ్యాలరీలు నిర్మాణం, ఆలయానికి ఎదురుగా చలువపందిళ్ళు, జర్మన్‌షెడ్లు,ఆస్థాన మండపం వద్ద భక్తులు వానకు తడవకుండా ఉండేలా షెడ్లు నిర్మాణం జరుగుతోంది. మాఢవీధుల్లో ఎండకు.వానకు రక్షణగా గ్యాలరీలు నిర్మితమవుతున్నాయి. ఇంజనీరింగ్ పనులు జోరుగా సాగుతున్నాయి. ఈ ఏడాది సాలకట్ల బ్రహ్మోత్సవాలు మాత్రమే జరగనున్నాయి.తొమ్మిదిరోజులు వాహనసేవలను భక్తుల మధ్య జరిపించేందుకు తిరుమల తిరుపతి దేవస్థానం సిద్ధమవుతోంది. ఆలయం పరిసరాలు ,మాఢవీధుల్లో గ్యాలరీలు, ఇనుప పైపులతో నింపేస్తున్నారు. బ్రహ్మోత్సవాలకు కొండను సర్వాంగసుందరంగా ముస్తాబుచేసే పనులు జోరందుకున్నాయి. శ్రీవారి పుష్కరిణి మరమ్మతులు పనులు పూర్తిచేసి నీటిని వదలడంతో బుధవారం సాయంత్రం పుష్కరిణి హారతితో పున:ప్రారంభమైంది.

# కేన్సర్ కేసుల గుర్తింపునకు ఎన్‌సిడి 4.0 సర్వే

- 18వేల నుంచి వైద్యారోగ్య సిబ్బందికి శిక్షణ
- 4.10 కోట్ల మంది నుంచి వివరాల సేకరణ

**విజయవాడ,ఆగస్టు20,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రవ్యాప్తంగా క్యాన్సర్ లక్షణాలున్న వారిని ప్రాథమిక దశలోనే గుర్తించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందు కోసం వచ్చే అక్టోబరు నుంచి అసంక్రమిత వ్యాధుల (ఎన్‌సీడీ) 4.0 సర్వే పేరిట ఇంటింటా వివరాలు సేకరించనుంది. సర్వే తీరుపై ఈ నెల 21 నుంచి సెప్టెంబరు 20 వరకు 18 వేల మంది వైద్యులు,ఆరోగ్య సంరక్షణ సహాయకులకు వైద్య ఆరోగ్య శాఖ శిక్షణ ఇవ్వనుంది. గతేడాది నవంబర్‌లో నిర్వహించిన ఎన్‌సీడీ 3.0 సర్వేలో రక్తపోటు,మధుమేహం,క్యాన్సర్ పీడితులను గుర్తించారు. నోటి,రొమ్ము,గర్భాశయ ముఖద్వారా క్యాన్సర్ లక్షణాలు ఉన్నవారిలో కొందరు వివరాలు చెప్పడానికి,పరీక్షలకు ఆసక్తి చూపలేదు. తద్వారా వాస్తవ పరిస్థితులు వెలుగులోకి రాలేదు. తాజా సర్వేలో కేవలం క్యాన్సర్ లక్షణాలు ఉన్నవారిని మాత్రమే గుర్తించనున్నారు. సర్వే లక్ష్యాలపై జనంలో అవగాహన కల్పించేందుకు సామాజిక మాధ్యమాల్లో విస్తృత ప్రచారంతో పాటు ప్రజాప్రతినిధులను కూడ భాగస్వాములను చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.గతంలో ఎన్‌సీడీ 3.0 సర్వేలో ఆరోగ్యశాఖ 225 ప్రశ్నాలు అడిగింది. ఇన్ని ప్రశ్నలకు సమాధానాలు రాబట్టడం ఇబ్బందిగా మారింది. 4.0 సర్వేలో ప్రశ్నలను 28కి తగ్గించారు. 18 ఏళ్ళు పైబడిన 4.10 కోట్ల మంది నుంచి ఈ ప్రశ్నలకు సమాధానాలు రాబడతారు. పురుషుల్లో నోటి క్యాన్సర్ మహిళల్లో రొమ్ము,గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ లక్షణాలు ఉన్న వారి వివరాలు సేకరిస్తారు. ప్రాథమిక స్థాయిలో సర్వేలో ఓ అంచనాకు వచ్చి వైద్యల సమక్షంలో మరోసారి పరీక్షిస్తారు.

## ఆయన మాటలు దెయ్యాలు వేదాలు వల్లించినట్లే : టిటిడి మాజీచైర్మన్ భూమన




**తిరుపతి,ఆగస్టు 20ప్రభాతవార్త:** ఏడాదికాలంలోనే టిటిడిలో అనేక తప్పిదాలు జరిగాయని టిటిడి మాజీ ఛైర్మన్, వైసిపి అధికారప్రతినిధి భూమన కరుణాకర్‌రెడ్డి విమర్శించారు. వైకుంఠ ఏకాదశి టిక్కెట్ల జారీకేంద్రం వద్ద తొక్కిసలాట జరిగిందని, ఆరుగురు ప్రాణాలు కోల్పోయారని ఆరోపించారు. తొక్కిసలాట ఘటనపై కూడా క్షమాపణ చెప్పలేని అహం అడ్డువచ్చిందని, పాపవినాశనంలో బోటుషికారుచేయించారని మండిపడ్డారు. బుధవారం తిరుపతిలో మీడియాతో భూమన మాట్లాడారు. భక్తులకు మసాల లేక మసాల వడ వడ్డించడమే గోప్పనా అని ఎద్దేవాచేశారు. ప్రజాస్వామ్యాన్ని ఖూనీచేసింది మీరు ప్రజాస్వామ్యం గురించి మాట్లాడటమా అని విమర్శించారు. ఏఐ పరిస్థితి అమలుకాదని తెలిసినా పట్టుకుని ఊగలాడటం ఎంతవరకు సబబన్నారు.

వార్త

నేను ఏ పనీ చేయలేను అని అనుకున్నందువల్ల ఎలాంటి ప్రయోజనం ఉండదు. 'ప్రయత్నిస్తాను' అనుకున్నప్పుడే ఏదైనా సాధించగలుగుతాం.

-జె. హెలెన్

# జీఎస్టీ భారాల కుదింపు?

జీఎస్‌టి సంస్కరణలతో పన్నుల వడ్డన తగ్గుతుందని, ఇకపై హేతుబద్ధమైన పన్నుల వసూళ్లు మాత్రమే జరుగుతుందని సర్వేసర్వత్రా సంతోషం వ్యక్తమౌతోంది. కొత్తగా రాబోయేజిఎస్‌టి విధానంలో 5,18శాతం శ్లాబులు మాత్రమే ఉంటాయి. వచ్చేనెలలో జరిగే జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో కూలంకషంగా చర్చించి సూత్రప్రాయంగా అంగీకరిస్తారు. వస్తు సేవల పన్ను (జీఎస్టీ) విధానంలో ప్రస్తుతం నాలుగు శ్లాబులుండగా 12,28 శాతం శ్లాబ్‌లకు స్వస్తి చెప్పడం ఆహ్వానించదగిన పరిణామం. జీఎస్టీ అనగానే సామాన్య వినియోగదారులు వ్యాపారులు సైతం భయపడిపోతున్న విషయం తెలిసిందే. ప్రస్తుతమున్న విధానంలో నిత్యావసర వస్తువులపై 5 శాతం, సాధారణ వస్తువులపై 12 శాతం, ఎలక్ట్రానిక్స్ సేవలపై 18 శాతం, విలాస, హానికారకాలపై 28 శాతం జీఎస్టీ ఉండేది. క్రమేపీ పన్ను సంస్కరణల సమీక్షలో ఎప్పటికప్పుడు విధాన నిర్ణయాలు జరుగుతూనే ఉన్నాయి. సవరించిన విధానానికి లోబడి జౌళి, ఎరువులు, పునరుత్పాదక విద్యుత్తు, ఆటోమేటిక్, హస్తకళలు, వ్యవసాయం, వైద్యం, బీమారంగాలకు పన్నులు తగ్గుతాయి. గృహ వినియోగ వస్తువులపై జిఎస్‌టి తగ్గుతుంది. సమాజానికి హానికారకంగా ఉండే పాన్‌మసాలా, పొగాకు ఉత్పత్తులకు 40శాతం ఉంటుంది. ప్రస్తుతం సంప్రదాయ వాహనాలపై 28శాతం పన్నుండగా అదనంగా 1-22 శాతం పరిహార సెస్ విధిస్తున్నారు. కొత్త జిఎస్‌టి అమలైతే కార్లపై పన్నులు తగ్గి సామాన్యుడికి చిన్నకార్లు అందుబాటులోకి వస్తాయి. వాటికి గిరాకీ, విక్రయాలు పెరుగుతాయి. సామాన్యుడికి సుంకాల భారం తగ్గితేనే జీవన పరిస్థితులను సరిదిద్దుకోగలడు. అలాంటి ప్రయోజనాలు కల్పించే దిశగా కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం ఆలోచిస్తోంది. జిఎస్టీ శ్లాబులను తగ్గించి వారికిమంచి చేయాలనే సంకల్పంతో ముందడుగు వేస్తోంది. వస్తు సేవల పన్నులు తగ్గితే భారత జిడిపిలో0.6శాతం వృద్ధి కలుగుతుందని ఇప్పటికే ఆర్థిక శాస్త్రవేత్తలు గణించారు. వారి సూచనల మేరకు జీఎస్టీ విధానంలో మార్పులు తెస్తున్నారు. ప్రజాసంక్షేమం కోసం జీఎస్టీ సుంకాల తగ్గింపునకు జీఎస్టీనే క్రమబద్ధీకరించడం మేలైన పద్ధతిగా ఆర్థికవేత్తలే నిర్వచించారు. 'ఒకే దేశం ఒకే పన్ను'వ్యవస్థగా ఎనిమిదేళ్ల క్రితం జీఎస్టీ విధానానికి రూపకల్పన చేసిన కేంద్రం సామాన్యునికి అందుబాటులోకి వచ్చే విధంగా పన్నుల వ్యవస్థలను పునర్వ్యవస్థీకరించడం స్వాగతిద్దాం. చేనేత వస్త్రాలపై ఐదు శాతం జీఎస్టీ విధించిన కేంద్రం 12 శాతానికి పన్ను పెంచాలన్న ప్రతిపాదన చేసింది. వ్యవసాయం తర్వాత చేనేత రంగం ప్రాధాన్యత చెందింది. ఇప్పటికే చేనేత కార్మికులు తమ వృత్తిని వదల్లేక, ఉన్నవృత్తిలో బతుకలేక దీనావస్థలో ఉండగా ప్రభుత్వ ప్రతిపాదనలు వారి జీవన విధానంపై దాడిచేస్తున్నాయి. ప్రస్తుత చేనేత రంగంపై వాటి ఉత్పత్తులపై పూర్తిగా జీఎస్టీ రద్దు చేయడమొక్కటే కేంద్ర ప్రభుత్వానికి తక్షణకర్తవ్యం కావాలి. సమీపంలో ఎలాంటి ఎన్నికలు లేకపోయినా మొన్న పంద్రాగస్టునాడు ఎర్రకోటపై ప్రధానినరేంద్రమోడీ మాట్లాడుతూ దీపావళి నాటినుండి కొత్త జీఎస్టీ ప్రక్షాళన జరుగుతుందన్నారు. ఇదే జరిగితే సామాన్యుడికి ప్రాణం హాయిగా ఉంటుంది. ఎలాంటి పరిస్థితులనైనా తట్టుకునేందుకు బడుగు జీవులపై పరోక్షంగా పడేసుంకాల భారాన్ని తగ్గించేందుకు ఎన్డీయే ప్రభుత్వపాలన ఎంతగానో కృషి చేయాలని తపిస్తోంది. తొలుత జీఎస్టీ పన్నుల విధానం అమలులోకి వచ్చినప్పుడు కూడా ఎన్నో అభ్యంతరాలొచ్చి పడ్డాయి. ఏమైతేనేం తాజా సంస్కరణలనుబట్టి జీఎస్టీపన్నువసూళ్లను హేతుబద్ధీకరణ జరిగినట్లే భావించాలి. ఇటీవల కర్ణాటకలో వీధి వ్యాపారులు, తోపుడు బండ్ల వర్తకుల ఫోన్ యాప్‌లద్వారా జరిగే చెల్లింపులను ఆసరాగా తీసుకొని ఆ రాష్ట్ర వాణిజ్య పన్నులశాఖ 13వేలమంది చిన్నపాటి వర్తకులకు నోటీసులుపంపి అగచాట్లకు గురిచేసింది. తద్వారా వినియోగదారులపై పన్నుల భారంవేసే ప్రయత్నం జరిగింది. పరోక్షంగా వినియోగదారుల మీద, ప్రత్యక్షంగా వీధి వర్తకుల మీద సుంకాల భారం పడిందన్న మాట. ఈ పన్నులవిధానం పట్ల వినియోగదారుల నుంచి ఎన్నో అభ్యంతరాలొచ్చినప్పుడు దేశంలో సగటు వసూళ్లు రెండు లక్షల కోట్లపై మాటే. ఎంఎస్‌ఎంఇ పరి శ్రమలు జిఎస్‌టి తకరారుతో చాలా ఇబ్బంది పెట్టారు. వస్తుసేవల ధరలు తగ్గడమంటే సామాన్యుడి నెత్తినపాలు పోసినట్లే. శీతలీకరించిన కూరగాయలు వంటి ప్యాకేజీ ఫుడ్స్, నాన్ ఎలక్ట్రానిక్, గృహోపకరణ పరికరాలు, కంప్యూటర్లునే కాక, వెయ్యి రూపాయలలోపు ఖరీదైన పాదరక్షలు, ఆయుర్వేద ఔషధాలు, వ్యవసాయపరికరాలు, సిమెంట్, గ్లేజ్డ్ టైల్స్‌పై కూడా ఎస్టీ తగ్గుతుంది. ఆరోమా కాఫీ, కాఫీ ఉత్పత్తులు ఇటీవల కాలంలో బాగా ధరలు పెరిగిపోయాయి. కొత్త జీఎస్టీ ప్రతిపాదనల్లోవీటిపై సుంకాలు తగ్గనున్నందున కాఫీ ప్రియులకు పసందైన వార్త యిది. మోటారు సైకిళ్ల పై దాదాపు పదిశాతం పన్నులు తగ్గుతాయన్న ఆశాభావంతో దేశప్రజలు ఎదురుచూస్తున్నారు. ఆన్‌లైన్ గేమ్‌లు సామాన్యుడిని పీల్చిపిండెస్తున్నందున అలాంటి వాటిపై నిషేధం ఒక ఎత్తయితే, అధిక పన్నులు మరొకటి. కనుక 40 శాతం పన్నులు పడ్డాయి. ఇన్నాళ్లు బడుగు వర్తకులు పడిన బాధలు దీపావళి నాటికి కొండెక్కిపోతాయి. అయితే బీమా ప్రీమియంల చెల్లింపుల పై జీఎస్టీని తగ్గించాలని డిమాండ్ చేస్తున్నాయి. కానీ వీటి విషయమై ప్రభుత్వం ఇంకా ఆలోచించినట్లు లేదు. కాగా న్యాయంగా హేతుబద్ధమైన పన్నులతో తెచ్చే ఏ ప్రతిపాదనను భారతీయులెవరూ అభ్యంతర పెట్టబోరు. కొత్త జీఎస్టీ నిషేధం అమలైతే సామాన్యుడు ప్రశాంతంగా ఊపిరి పీల్చుకునే అవకాశం ఉంది.

దేనినైనా అస్యహించుకోవడం తేలిక, సంస్కరించుకోవడం చాలా కష్టం.



బర్ట్రండ్ రస్సెల్

తెలిసిన వాడు సత్యం కోసం వాడిగా వేడిగా వాదిస్తాడు. తెలియనివాడు తన అభిప్రాయం కోసం వాదిస్తాడు.



టాల్‌స్టాయ్

# ప్రజావాక్కు



### తిరుమల దర్శనం దివ్యంగా కల్పించాలి

కలియుగ వైకుంఠమైన తిరుమలకు ఆపదమొక్కులవాన్ని దర్శనానికి ప్రతి హిందువు అత్యంత భక్తిశ్రద్ధలతో వెళ్తుంటారు తమ కష్టాలను కడ తీరుస్తాడని అపారమైన నమ్మకం!అలిపిరిలో భద్రతా కారణాలతో ప్రతిభక్తున్ని, వారి వెంటఉన్నసంచులను సామాగ్రిని నిశితంగా పరిశీలిస్తారు. ఇది అత్యంత అవసరం. కానీ వయోధికులు స్త్రీలు పిల్లలు తమతమసంచులను ఇతరసామాగ్రిని వాహనాల నుండి దించి పరిశీలన తర్వాత మరల వాహనంలో పెట్టుటకు అత్యంత ప్రయాసలకు లోనుకావలసి వస్తుంది. తిరుమలలో కేంద్ర రిసెప్షన్ కార్యాలయంలో గదులు పొందిన తర్వాత వాటివద్దకు పోవుటకు అత్యంత వ్యయం వెచ్చించవలసి వస్తున్నది. దేవదేవుని దర్శనానికి భక్తులను క్రమబద్ధంగా నిర్వహిస్తున్నవిధానాన్ని దర్శనం తర్వాత బయటకు వెళ్లేంతవరకు కూడా అదే విధంగా కొనసాగించాలి.

- దండంరాజు రాంచందర్ రావు, సికింద్రాబాద్

### సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తత

వర్షాల వల్ల రాష్ట్ర వ్యాప్తముగా దగ్గు, జలుబు, జ్వరాల కారణంగా ఇటీవలరాష్ట్రంలోని ఆస్పత్రుల అవుట్‌పేషెంట్ సంఖ్యలో గణనీయమైన పెరుగుదల కనిపిస్తోంది. డెంగీ, మలేరియావంటి వ్యాధులు ఇప్పటికీ నియంత్రణలో ఉన్నప్పటికీ, ఈఏడాది డెంగీ కేసులు మళ్లీపెరగొచ్చే అవకాశం ఉందని తెలుస్తుంది అని వైద్యనిపుణులు హెచ్చరించారు. దీనివల్ల, ఇంట్లో నీరు నిలవకుండా చూసుకోవాలని, జ్వరానికి గమనిస్తూ అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు. గతంలో వర్షాకాలంలో ప్రత్యేక ఫీవర్ ఓ పి కౌంటర్లను ఏర్పాటు చేయడం వంటి అవగాహన కార్యక్రమాలు నిర్వహించేవారు. కానీ ఈసంవత్సరం అవసరమైనప్పుడు ప్రత్యేకఓపీక్లినిక్‌లు ఏర్పాటుచేస్తామని చెబుతున్నారు.

- కామిడి సతీష్ రెడ్డి, భూపాల్ పల్లి జిల్లా

### విద్యా ప్రమాణాలు పెంచాలి

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు పెంచాలి. ఆధునిక పద్ధతిలో విద్యా బోధన జరపాలి. అలాగే స్మార్ట్ బోర్డులు, ప్రొజక్టర్లు ఉపయోగించాలి. ప్రభుత్వ పాఠశాలల్లో ఇప్పటికైనా మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేయాలి. ముఖ్యంగా టాయిలెట్‌లు, బెంచీలు, మంచినీరు, తదితర సదుపాయాలు కల్పించాలి.

- డి చాంద్ బాషా, కర్నూలు

### సామాన్యులకు ఊరట కలుగునా?

మొన్న ఆగష్టు 15,2025, శుక్రవారం రోజున ఎర్రకోట వేదికగా దేశాన్ని ఉద్దేశించి ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మాట్లాడుతూ, జీఎస్టీ (సరుకులుమరియు సేవల పన్ను) భారం తగ్గించేందుకు స్పష్టమైన హామీ ఇచ్చారు. మధ్యతరగతి మన ఆర్థిక వ్యవస్థకు మూలస్తంభం. వారి జీవన ఖర్చులు తగ్గేలా జీఎస్టీ స్లాబ్లలను సరి చేయడానికి కౌన్సిల్‌లో చర్యలు జరుగుతున్నాయి. ఈ సవరణలు పేదలు, మధ్యతరగతి వ్యాపారవేత్తలు, చిన్న వ్యాపారులకు ప్రయోజనం చేకూరుస్తాయి అనే భావంతో ప్రకటన చేశారు. ప్రధానమంత్రి మాటల ప్రకారం, దీపావళికి ముందు ఈ సవరణలు అమలు కావచ్చునని ఆశాభావం వ్యక్తమవుతోంది. ఈ కొత్త తరం జీఎస్టీ సవరణలు అమలైతే, హెల్త్ ఇన్సూరెన్స్, విద్య, రోజూవారీ అవసరాల ఖర్చులు తగ్గడంవల్ల సామాన్య కుటుంబాలు ఆర్థికంగా ఊపిరి పీల్చుకోగలరు. ఏదే మైనా, ప్రధానమంత్రి గారి హామీతో జీఎస్టీ స్లాబ్లలు తగ్గితే, అది సామాన్యులకు ఆర్థిక ఊరటను అందించడమే.

-దాసం వెంకటరెడ్డి, బెంగుళూరు

### భూ భారతిని అమలు చేయాలి

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం భూములకు సంబంధించిన సమాచారం కోసం భూ భారతి చట్టాన్ని తీసుకు రావడం జరిగింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకు వచ్చిన ధరణిని పోర్టల్ లో అవకతవకలు జరిగాయి అని కాంగ్రెస్ ప్రభుత్వం భూ భారతి తీసుకువచ్చింది. కానీ భూభారతిలో కూడా రైతులకు న్యాయం జరగడం లేదని వాపోతున్నారు. సంబంధిత అధికారులు పట్టాదారు పాసు పుస్తకాలలో తప్పులను సవరించడం లేదు. దీంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు.

-మిద్దె సురేష్, నాగర్ కర్నూల్ జిల్లా

### అమెరికా ఎవరినీ ఎదగనివ్వదు

గత వందేళ్లుగా అమెరికా ప్రపంచంలో తిరుగులేని మహాశక్తిగా నిలిచింది. తమ ఆధిపత్యాన్ని సవాల్ చేసిన ఏ దేశాన్నైనా అంతం చేయడంలో వెనుకాడదు. జపాన్ ఎదురు తిరిగితే అణుబాంబులు వేసి పాతాళానికి తొక్కేసింది. అమెరికా శక్తికి ప్రధాన కారణం దాని వ్యాపార సామ్రాజ్యం. ప్రపంచంలోని టాప్ 10 పారిశ్రామికవేత్తల్లో 89 మంది అమెరికన్లే. చైనాకు చెందిన జాక్ మా మూడోస్థానానికి చేరినప్పుడు, అతడిని దెబ్బ తీయడానికి లాబీయింగ్ మొదలుపెట్టారు. ఇప్పుడు భారతీయ పారిశ్రామికవేత్తలైన అదానీ, అంబానీలను టార్గెట్ చేస్తున్నారు.

- డా.దన్నాన అప్పలనాయుడు, చీపురుపల్లి

మన వి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# వృద్ధులను జాతి సంపదగా గుర్తించాలి

**ఇంట్లో ఎన్ని బాధలు పడుతున్నా నోరువిప్పని వృద్ధులు ఢిల్లీలో 92 శాతం వరకు ఉంటారని హెల్ప్‌ఏజ్ ఇండియా అధ్యయనం తెలిపింది. నేటి ఆధునిక కాలంలో వృద్ధాశ్రమాలు ఎక్కువ సంఖ్యలో ఏర్పాటు కావాల్సిన అవసరం ఎంతైనా ఉంది. వృద్ధులు ప్రశాంతంగా కాలం గడపడానికి అవసరమైన చేయూత అందచేయడం కుటుంబ సభ్యులందరి కనీస బాధ్యత. వృద్ధాప్యంలో ఉన్నవారితో ప్రతిరోజూ కాసేపైనా గడపాలి. వారి అనుభవాల్ని తెలుసుకోవాలి. ఈరోజు మనం వృద్ధులకు ప్రేమను పంచితే రేపు మన వృద్ధాప్యంలో మనం కూడా ప్రేమను పొందగలుగుతాం అని యువత గుర్తించాలి. వృద్ధులను మన జాతి సంపదగా గుర్తించాలి. ప్రభుత్వాలు ఎన్ని చట్టాలు చేసినా, కుటుంబ వ్యవస్థ విచ్ఛిన్నం అవుతున్నందున వయోధికులకు ఈ పరిస్థితి ఎదురవుతోంది. ఉమ్మడి కుటుంబ వ్యవస్థకు పూర్వ వైభవం వచ్చినపుడే వృద్ధులకు గౌరవం పెరుగుతుంది. అన్నింటికన్నా కుటుంబ సభ్యుల ఆదరణే వారికి కొండంత అండ అన్న సంగతిని విస్మరించరాదు.**



రామ కిష్టయ్య సంగన భట్ల

బాల్య, కౌమార, యవ్వన, వృద్ధాప్యాలు జీవితంలో ఏ ప్రాణికైనా తప్పనిసరిగా సంభవించే జీవన రేఖలు. ఎండుటాకును చూసి పచ్చటాకు నవ్వింది అని తెలుగులో ఒకసామెత ఉంది. పండిపోయి చెట్టు నుంచి రాలే ఎండు టాకును చూసి చెట్టురెమ్మలకు వేలాడే పచ్చటాకు నవ్విందట. అది గమనించిన ఎండుటాకు పిచ్చిమొహమా రేపు నీకు కూడా నా గతే కదే.. అని పకపకమంటూ ఆ ఎండు టాకు రాలిపోయిందట. మనిషి జీవిత చక్రంలో వచ్చేమార్పు లు బాల్యం, యవ్వనం, వృద్ధాప్యం. అయితే మనిషిగా పుట్టిన ప్రతివ్యక్తి తుదిశ్వాస ఉన్నంతవరకు, ప్రతి దశలోనూ ఎంతో ఆనందంగా జీవించాలని కోరుకుంటాడు. వృద్ధాప్యం లేదా ముసలితనం మానవ జన్మలో చివరి దశ. దీనిని నిర్వచించడానికి వయోపరిమితి లేనప్పటికి, మనిషి శరీరం రోగ నిరోధక శక్తిని క్రమక్రమంగా కోల్పోయి చివరకు మరణించే స్థితికి చేరే దశను వృద్ధాప్యంగా చెప్పవచ్చు. నేడు పిల్లలుగా, యువజనులుగా, నడివయస్కులుగా పాత్రలు పోషిస్తున్న అందరూ వృద్ధుల బృందంలోకి అడుగు పెట్టే పరిస్థితి తప్పక వస్తుంది. యవ్వన దశలో వారు సమాజానికి అవసరమైన సమస్త ఉత్పత్తి కార్యకలాపాలలో పాల్గొని రేపటి తరాల ఉజ్వల భవిష్యత్తుకు తమవంతు కృషి చేసి ఉంటారు. పనులు మాని, లక్ష్యాలు పూర్తి చేసుకుని ఉత్పత్తికి దూరమై విశ్రాంతి తీసుకుంటూ జీవన చరమదశను ముగిద్దామని దీర్ఘ సెలవులో ఉన్న జాతి నిర్మాతలేవృద్ధులు. అందుకే వారికీ ఓ రోజును కేటాయించి సమాజానికి వారు అందించిన సేవలను గుర్తు చేసుకుంటూ ప్రపంచ వ్యాప్తంగా ఏటా ఆగష్టు 21న అంతర్జాతీయ సీనియర్ సిటిజన్స్ డే జరుపుకుంటున్నారు. ఐక్యరాజ్య సమితి అంచనా ప్రకారం ప్రపంచంలో ప్రతి 10 మందిలో ఒకరు ఇప్పుడు 60 ఏళ్ల వయసును కలిగి ఉన్నారు. 2050 నాటికి ప్రపంచంలోని ప్రతి అయిదు మందిలో ఒకరు 60ఏళ్ల ఆ పైబడి వయసు కలిగి ఉంటారట. 2150వ సంవత్సరానికి ప్రపంచంలో ప్రతి ముగ్గురు వ్యక్తుల్లో ఒకరు ముదుసలిగా ఉంటారట. సీనియర్ సిటిజన్లుగా పేరు పడిన ఈ వయోవృద్ధుల అవసరాలు తీర్చే కృషిలో వ్యక్తులూ, సమాజమూ పునరంకితం అయేందుకు గాను ప్రపంచం వ్యాప్తంగా అన్ని దేశాలూ అంతర్జాతీయ వృద్ధాప్య దినాన్ని జరుపుతున్నాయి. తన కుమారులకు, కుమార్తెలకు, మనుమళ్లకు, ముని మనుమలకు సలహాలు ఇచ్చే వయస్సు కూడా ఇదే. దీనికి అనుగుణంగా కేంద్ర ప్రభుత్వం కూడా వృద్ధుల సంక్షేమానికి కొన్ని జాతీయ ప్రణాళికను, కొన్ని మార్గదర్శకాలను ప్రకటించింది. అలాగే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా గత 2007లో వృద్ధుల కోసం పోషణ, సంక్షేమం కోసం ప్రత్యేక చట్టాన్ని తీసుకొచ్చింది. అయితే, ఈచట్టాలు అమలుకు పూర్తిగా నోచుకోవడం లేదన్నది తెలిసిన సత్యమే. వృద్ధుల సమస్యల పరిష్కారానికి సమాజంలో ప్రతిఒక్కరూ శ్రద్ధచూపాలి. వేధింపులు, ఆరోగ్య సమస్యల నుంచి వృద్ధులను దూరంగా ఉంచేలా కుటుంబ సభ్యులంతా చొరవ చూపాలి. జీవితంలో వృద్ధాప్యం అనేది చివరి దశకావడంతో వారిలో శారీరక మార్పులను ఆపడం ఎవరితరం కాదు. వృద్ధాప్యం అన్నది శరీరానికే కానీ మనసుకు కాదని ప్రతివారూ తెలుసుకోవాలి. ప్రస్తుతం అరవయ్యేళ్ల వయసు దాటిన వారు దేశంలో 15



కోట్ల మేరకు ఉంటారని అంచనా. వీరిలో సుమారు కోటిన్నర మందికి పైగా ఒంటరి జీవితం సాగిస్తున్నారు. ఆధునిక వైద్య సదుపాయాలు, ఔషధాలు అందుబాటులోకి రావడంతో ఆయుర్దాయం పెరుగుతోంది. దీంతో వృద్ధుల సంఖ్య అదేస్థాయిలో అధికమవుతోంది. ప్రపంచంలో ఎక్కువ మంది వృద్ధులు ఉన్న దేశంగా చైనా మొదటిస్థానంలో ఉంది. ఇక్కడ 60ఏళ్లకు పైబడినవారు 16.7 కోట్ల మంది, 80 ఏళ్లకు పైబడిన వారు పది లక్షలమంది ఉన్నారు. 80ఏళ్లకుపైబడిన వారి సూపర్ సీనియర్ సిటిజన్స్ అంటారు. జపాన్‌లో నూటికి 30 శాతం మంది 60 ఏళ్ల పైబడిన వారు ఉన్నారు. 2050 నాటికి 64 దేశాలు 30 శాతం వృద్ధులతో నిండిపోతాయి! అంటే వృద్ధుల జనాభా 120కోట్లకు చేరుతుంది. అభివృద్ధి చెందుతున్న దేశాల్లో 80 శాతం వృద్ధులుంటారని ఐక్యరాజ్యసమితి చెబుతోంది. 2050 నాటికి మన దేశంలో వృద్ధుల జనాభా 30 కోట్లపైనే ఉండే అవకాశముంది. మన దేశంలో ప్రతి ఐదుగురు వృద్ధుల్లో ఒకరు ఒంటరిగా జీవిస్తున్నారు. ముగ్గురిలో ఒకరు వేధింపులకు గురి అవుతున్నారు. హెల్ప్‌ఏజ్ ఇండియా అధ్యయనం నిగ్గుతేల్చిన విషయమిది. వృద్ధుల సంరక్షణ వారి పిల్లల కనీస బాధ్యత. వయసుడిగిన దశలో తమ వారసుల నుంచి వారు కోరుకునేది ప్రేమపూర్వక పలకరింపు, ఆదరణ, అభిమానాలే తప్ప ఆడంబరాలు, విలాసాలు కాదు. వృద్ధాప్యంలో ఆరోగ్యసమస్యలే కాదు, ఆర్థిక, సామాజిక సమస్యలు వారిని చుట్టు ముడుతాయి. ఇలాంటి సమయంలో వారికి అండగా నిలవాల్సి ఉండాలి. 60 ఏళ్ల పైబడిన అనుభవజ్ఞుల శక్తిని, అనుభవ సారాన్ని ఉపయోగం చేసుకుంటే తప్పకుండా ఏ దేశమైనా పురోగమిస్తుంది అనడంలో అతిశయోక్తిలేదు. పేద, మధ్యతరగతి కుటుంబాల వారే కాదు, సంపన్న కుటుంబాలలోనూ వృద్ధులైన తల్లిదండ్రులను వృద్ధాశ్రమంలో చేర్పించి తమ పని పూర్తయిందనుకుంటున్నారు. రేపు తమదీ ఇదే బతుకని వారు మరచిపోతున్నారు. సంతానం ఉన్నవారు, లేనివారు అనే తేడా లేకుండా పిల్లలు కళ్లముందున్నప్పటికీ కొందరు వృద్ధులు అనాథలుగా మారుతున్నారు. ఆవేదనతో మానసిక క్షోభను అనుభవిస్తున్నారు. సంపాదన అనే వ్యామోహంలో పడి కొందరు యువకులు తల్లిదండ్రుల ప్రేమను పోగొట్టుకుంటున్నారు. మరికొంత మంది బంధాలను దూరం చేసుకుంటున్నారు. జాతీయ స్థాయిలో వృద్ధుల స్థితిగతులపై హెల్ప్‌ఏజ్ ఇండియా వెలువరించిన నివేదికలో అనేక ఆసక్తికర అంశాలు వెలుగుచూశాయి. సొంత కుటుంబ సభ్యులనుంచే నిరాదరణ ఎదురవుతోందంటూ 56శాతం వృద్ధులు స్పందించారు. కుమారుల్లో 57 శాతం, కోడళ్లలో 38 శాతం పెద్దవారిని ఆదరించడం లేదట. తమ హక్కుల సంరక్షణ కోసం రూపొందించిన చట్టాలపై వృద్ధుల్లో కొంతవరకు అవగాహన ఉన్నప్పటికీ, కుటుంబ గౌరవం మంటగలుస్తుందన్న భయంతో పోలీసులను ఆశ్రయించటం లేదన్నది 52 శాతం వృద్ధుల స్పందన. వృద్ధులపై వేధింపుల నిరోధానికి కేంద్రం ఒక చట్టం చేసింది. తల్లిదండ్రులు, వృద్ధుల సంక్షేమ నిర్వహణ చట్టంగా వ్యవహరించే దీని గురించి చాలామంది వృద్ధులకు తెలియదు. గ్రామీణ వృద్ధుల్లో 45 శాతం మంది దీర్ఘకాల అనారోగ్యాలతో బాధపడుతున్నారని జాతీయనమూనా సర్వే తెలిపింది. ఇంట్లో ఎన్ని బాధలు పడుతున్నా నోరువిప్పని వృద్ధులు ఢిల్లీలో 92 శాతం వరకు ఉంటారని హెల్ప్ ఏజ్ ఇండియా అధ్యయనం తెలిపింది. నేటి ఆధునిక కాలంలో వృద్ధాశ్రమాలు ఎక్కువ సంఖ్యలో ఏర్పాటు కావాల్సిన అవసరం ఎంతైనా ఉంది. వృద్ధులు ప్రశాంతంగా కాలం గడపడానికి అవసరమైన చేయూత అందచేయడం కుటుంబ సభ్యులందరి కనీస బాధ్యత. వృద్ధాప్యంలో ఉన్న వారితో ప్రతిరోజూ కాసేపైనా గడపాలి. వారి అనుభవాల్ని తెలుసుకోవాలి. ఈరోజు మనం వృద్ధులకు ప్రేమను పంచితే రేపు మన వృద్ధాప్యంలో మనం కూడా ప్రేమను పొందగలుగుతాం అని యువత గుర్తించాలి. వృద్ధులను మన జాతి సంపదగా గుర్తించాలి. ప్రభుత్వాలు ఎన్ని చట్టాలు చేసినా, కుటుంబ వ్యవస్థ విచ్ఛిన్నం అవుతున్నందున వయోధికులకు ఈ పరిస్థితి ఎదురవుతోంది. ఉమ్మడి కుటుంబ వ్యవస్థకు పూర్వ వైభవం వచ్చినపుడే వృద్ధులకు గౌరవం పెరుగుతుంది. అన్నింటికన్నా కుటుంబ సభ్యుల ఆదరణే వారికి కొండంత అండ అన్న సంగతిని విస్మరించరాదు. •

# కేన్సర్ విస్తరణను నిరోధించలేమా?

సి.హెచ్. ప్రతాప్

భారతదేశంలో ఆరోగ్య రంగం అనేక సవాళ్లను ఎదుర్కొంటోంది. వాటిలో అత్యంత ఆందోళనకరమైనది క్యాన్సర్ కేసులు వేగంగా పెరుగుదల. గుండె, ఊపిరితిత్తుల వ్యాధుల తరువాత దేశంలో మరణాలకు కారణమవుతున్న మూడవ ప్రధాన వ్యాధి క్యాన్సర్. అయినప్పటికీ దీనిపై తగిన శ్రద్ధ తీసుకోవడంలో లోటు స్పష్టంగా కనిపిస్తోంది. ప్రస్తుతం దేశంలో దాదాపు ప్రతి లక్ష మందిలో వందమంది క్యాన్సర్‌తో బాధపడుతున్నారని అంచనా. భారత వైద్య పరిశోధన మండలి వివరాల ప్రకారం 2023లో పద్నాలుగు లక్షల మందికిపైగా కొత్త క్యాన్సర్ కేసులు నమోదయ్యాయి. ప్రతి సంవత్సరం సుమారు ఎనిమిది లక్షల కొత్త కేసులు వెలుగులోకి వస్తున్నాయి. కానీ ఈ పెరుగుతున్న వ్యాధి భారానికి సరిపడే వైద్య సదుపాయాలు అందుబాటులో లేవు. క్యాన్సర్ చికిత్స కేంద్రాలు దేశవ్యాప్తంగా వంద పట్టణాలు, నగరాలకే పరిమితం కాగా, ఎక్కువ మంది రోగులు చిన్న పట్టణాలు, గ్రామాల్లో నివసిస్తున్నారు. ఫలితంగా వారు పెద్ద నగరాలకు వెళ్లక తప్పదు. ఖరీదైన ఔషధాలు, రేడియోథెరపీ పరికరాల కొరత, శిక్షణ పొందిన వైద్యుల లేమి రోగులను మరింత ఇబ్బందుల్లోకి నెడుతున్నాయి. ప్రభుత్వం నిర్వహించే ఆసుపత్రుల్లో కేవలం మూడోవంతు రోగులకే చికిత్స లభిస్తున్నప్పుడు, మిగిలిన వారు ప్రైవేటు ఆసుపత్రుల అధిక ఖర్చులు భరించలేక ఆర్థిక కష్టాల్లో కూరుకుపోతున్నారు. చాలామంది కుటుంబాలు ఆస్తులు అమ్ముకుని చికిత్స కోసం నిధులు సమకూర్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. క్యాన్సర్ కేసుల పెరుగుదలకు అనేక కారణాలున్నాయి. వాయు కాలుష్యం, జీవనశైలి మార్పులు, ధూమపానం, మద్యపానం, అస్వస్థకరమైన ఆహారం, శారీరక శ్రమలేమి, వారసత్వ కారణాలు ఇవన్నీ దీనికి తోడ్పడుతున్నాయి. అయితే ప్రధాన సమస్య వేళలో నిర్ధారణ జరగకపోవడం, చాలామంది రోగులు చివరి దశలోనే ఆసుపత్రులకు చేరుతున్నారు. దాంతో చికిత్స ఫలితాలు తగ్గిపోతున్నాయి. భారతదేశంలో క్యాన్సర్‌రోగుల ఐదేళ్ల జీవన శాతం కేవలం ముప్పై శాతం మాత్రమే ఉండగా, యూరప్, అమెరికా దేశాల్లో ఇది తొంభైశాతం వరకు ఉంది. వాస్తవానికి కొన్ని రకాల క్యాన్సర్‌లు పూర్తిగా నివారించదగినవిగా ప్రారంభ దశలో గుర్తిస్తే నయం చేయదగినవిగా ఉంటాయి. భారతదేశం ప్రపంచంలోనే అత్యధిక క్యాన్సర్ మరణాలు నమోదయ్యే దేశంగా నిలుస్తున్నా, సమర్థవంతమైన స్క్రీనింగ్ విధానం అమలు చేయడంలో అలసత్వం ప్రదర్శిస్తోంది. 2010లోనే ప్రారంభించిన జాతీయ క్యాన్సర్, మధుమేహం, గుండె వ్యాధులు, బ్రెయిన్ స్ట్రోక్ నివారణ నియంత్రణ కార్యక్రమం (ఎన్‌పిసిడిసిఎస్) ప్రధానంగా గర్భాశయ ముఖం, మౌఖికం, వక్షోజ క్యాన్సర్ల స్క్రీనింగ్ పైనే దృష్టి పెట్టింది. ఇవే దేశంలో మొత్తం క్యాన్సర్ కేసుల మూడో వంతును ఆక్రమిస్తున్నాయి. అలాగే ఆయుష్మాన్ భారత్ ప్రధాన్ మంత్రి జనఆరోగ్య యోజన కింద ఒకటిన్నర లక్షకు పైగా ఆరోగ్య, వెల్‌నెస్ కేంద్రాలను క్యాన్సర్ గుర్తింపు కేంద్రాలుగా ప్రకటించారు. కానీ ఫలితాలుమాత్రం నిరుత్సాహకరంగా ఉన్నాయి. నీతి ఆయోగ్ నివేదిక స్పష్టంగా చెప్పినట్లుగా, గ్రామీణ స్థాయిలోనైనా, పట్టణ స్థాయిలోనైనా ప్రాథమిక స్క్రీనింగ్‌లో పెద్దగామార్పు జరగలేదు. నేల స్థాయి వాస్తవాలు కేంద్రం దృష్టికి వచ్చినా సమగ్ర వ్యూహం లేకపోవడం బాధాకరం. క్యాన్సర్ వ్యాధి భారాన్ని తగ్గించాలంటే ముందుగా స్క్రీనింగ్‌ను బలపర్చడం తప్పనిసరి. పాలనా స్థాయిలో కూడా ఈ వ్యాధి తగిన ప్రాధాన్యం పొందడం లేదు. మొత్తం ఆరోగ్య బడ్జెట్‌లో ఐదో వంతుకన్నా తక్కువ నిధులే కేటాయిస్తున్నారు. ఇది సమగ్ర వ్యూహ రూపకల్పనకు పెద్ద అడ్డంకిగా మారుతోంది. అంతేకాకుండా, ప్రపంచవ్యాప్తంగా కొత్త ఔషధాలపై అపార ఖర్చులుపెట్టినా, అభివృద్ధి చెందుతున్న దేశాల్లో ప్రాథమిక ఔషధాలే అందుబాటులో లేవు. అందువల్ల క్యాన్సర్ మరణాల డెబ్బై శాతం కంటే ఎక్కువ తక్కువ, మధ్యస్థ ఆదాయ దేశాల్లోనే జరుగుతున్నాయి. భారతదేశంలోనూ ఇదే దృశ్యం. ఈ నేపథ్యంలో పాలకులు తక్షణం దృష్టి పెట్టాల్సిన అంశాలున్నాయి. జిల్లాస్థాయి ఆసుపత్రుల్లో స్క్రీనింగ్ సదుపాయాలు ఏర్పాటు చేసి ప్రాథమిక దశలోనే వ్యాధిని గుర్తించే అవకాశం కల్పించాలి. రేడియోథెరపీ పరికరాలు, నైపుణ్యం కలిగిన వైద్యులు, నర్సులు అందుబాటులో ఉండేలా వైద్యమౌలిక సదుపాయాలను విస్తరించాలి. పేద కుటుంబాలకు సరసమైన ధరల వద్ద ఔషధాలు లభించేలా విధానం రూపొందించాలి. •

# భారత్ స్వయం పోషకత్వాన్ని పెంపొందించుకోవాలి



డాక్టర్ ఎనుగొండ నాగరాజు నాయుడు

ప్రపంచాన్ని కొన్ని వందల సంవత్సరాలుగా పాలించి శాసిస్తున్న పాశ్చాత్య దేశాలను తట్టుకొని నిలబడాలంటే వాటికి సమాన స్థాయిలో ఎదగాలంటే చైనా లాగా భారత్ కూడా స్వయం సమృద్ధిని సాధించాలి. ట్రంప్ విధించిన సుంకాలకు వ్యతిరేకంగా చైనా ప్రతీకార సుంకాలు విధించినట్టుగా భారత్ కూడా అడుగులు వేయాలి. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సుంకాల ఫలితంగా మన ఎగుమతులు తగ్గిపోతే మిగిలినవి మనదేశంలోనే మనం అమ్ముకోగలమా? లోకల్ మార్కెట్లు విస్తరించేలాగా ప్రభుత్వం బడ్జెట్లో నిధులు కేటాయించి వ్యయం చేయగలదా?దానికి నిధులు ఎక్కడివి? ధనవంతులపై పన్నులు వేయాలి కదా దీనినే అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడిదారులు ఒప్పుకోరు. ఫలితంగా దేశంలోస్థూల డిమాండ్ పడిపోతుంది. ఆర్థిక సంక్షోభం వైపుగా భారత్ ఆర్థికవ్యవస్థ పోతే ఉద్యోగిత ఉత్పత్తి ఆదాయాలు తగ్గిపోతాయి. సుంకాలు విధించడం వలన అమెరికాలో అవన్నీ పెరగవచ్చు కానీ మిగతా ఆర్థిక వ్యవస్థలు భవిష్యత్తు ఏమిటి? ప్రపంచ ఆర్థికవ్యవస్థలో స్థూలడిమాండ్ పడిపోతుంది. దీనినే సార్థక డిమాండ్ లేని పరిస్థితి అని అంటారు. అంటే సప్లై డిమాండు సమతుల్య స్థితి లేని పరిస్థితి. అదే 1930 లలో ఆర్థిక మాధ్యానికి కారణం. ఒకవేళ ఉత్పత్తులు ఇప్పటికే గణనీయంగా పెరిగి ఉంటే ప్రజలకు ఆదాయాలు కల్పించాలి కాబట్టి పని కల్పించేందుకు గుంతల తవ్వమనండి అదే గుంతలు పూడ్చమనండి. వారికి వేతనాలు మాత్రం ఇవ్వండి తద్వారా ఆదాయాలు పెరిగి ప్రజల డిమాండ్ పెరిగి ఈ పెరిగిన కొనుగోలు శక్తితో మిగులు ఉత్పత్తులను వారు కొని ఆర్థిక వ్యవస్థ పుంజుకుంటుంది. తద్వారా సప్లై డిమాండ్ సమానమవుతుంది. ఇప్పటి ప్రభుత్వాలు ఈ పని చేయగలవా? పెట్టుబడిదారుల చేతుల్లో ఉండే ప్రభుత్వాలు అందుకు పూనుకోలేవు దేశంలో ఆర్థిక వృద్ధి అంతా పెట్టుబడిదారుల చేతుల్లోనే జరుగుతున్నది కదా ప్రజల భాగస్వామ్యం నామ మాత్రమే కదా? అమెరికా విధించిన సుంకాలకు ప్రతీకారంగా మరికొన్ని దేశాలు తమ సుంకాలను కూడా పెంచవచ్చు. కానీ అలా పెంచినంత మాత్రాన ప్రపంచ వస్తు సేవల స్థూల డిమాండ్ పెరగదు. ఈ దేశాలన్నీ దాదాపుగా నయా ఉదారవాదానికి లోబడే వ్యవహరిస్తున్నాయి. అవి తాము పెంచిన సుంకాల వలన వచ్చిన అదనపు ఆదాయాన్ని ప్రజలపై ఖర్చు చేస్తారా? తమ దేశాల్లోనే సంపన్నులకుమరింత రాయితీలు కల్పించడానికి ఖర్చు చేస్తాయి. అంతే తప్పప్రజల ఆదాయాలను డిమాండ్‌ను పెంచేలా ఖర్చు చేయవు. ఆ దేశాలలో అటు దేశీయ కార్మికులకు కొనుగోలు శక్తి పడిపోతుంది.



ఎగుమతులు తగ్గిపోయి ఉపాధి తగ్గుతుంది. ఇటు దేశీయ వ్యయం పెరగదు దాని ఫలితంగా ప్రపంచ స్థూల డిమాండ్ మరింత పడిపోతుంది. ప్రతీకార సుంకాల విధింపు ద్వారా ఆయా దేశాలు తమ అమెరికా ఎగుమతులు తగ్గించుకొని ఆ మేరకు ఉత్పత్తిని దేశీయ మార్కెట్లోకి మళ్లించాలి. ప్రపంచ పెట్టుబడేదారి మార్కెట్ మొత్తం మీద చూసినప్పుడు డిమాండ్ తగ్గిపోయి నయా ఉదారవాద ఆర్థిక సంక్షోభం మరింత తీవ్రతరంకాక మానదు. ఇప్పుడు నయా ఉదారవాద విధానాలు మన దేశాన్ని వెనుకకు నెట్టాయి. ఇప్పుడు మన దేశం అటు రైతుల ప్రయోజనాలకైనా బలి చేయాలి లేదా ఫార్మా ఆభరణాల తయారీ వజ్రాల తయారీ వంటి రంగా ప్రయోజనాలనైనా బలి చేయాలి. ఏది జరిగినా మన దేశానికి నష్టమే. అందుచేత అసలు ఈ నయా ఉదారవాద నుండి మన దేశాన్ని బయటకు తెచ్చుకుని ఇప్పుడున్న చిక్కు పరిస్థితుల నుండి విముక్తి చేయాలి. స్వాలంబనతోనే ఆర్థిక అభివృద్ధి జరగాలి. గ్లోబలైజేషన్ వైపు అడుగులు వేయాలి. నయా ఉదారవాద విధానాల నుండి గ్లోబలైజేషన్కు వెళ్లాలి. అలా విధానాన్ని మార్చితే అప్పుడు బడా బూర్జువా వర్గం దానిని వ్యతిరేకిస్తుంది. ఎందుకంటే ఆ వర్గం ఇప్పటికే అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడితో మమేకం అయిపోయి ఉంది. అటువంటి బడా బూర్జువా వర్గ ప్రయోజనలు నెరవేర్చడానికి కట్టుబడి ఉన్న ప్రభుత్వం డి గ్లోబలైజేషన్ వైపు మళ్లీ ఆలోచన కూడా చేయలేదు. అందుచేత సామ్రాజ్యవాద వాదం బెదిరించినప్పుడల్లా రాజీపడేందుకే సిద్ధమవుతుంది. సామ్రాజ్యవాద పెత్తనం నుండి బయటపడి స్వాతంత్ర్యంగా మనగలడం అంటేనే నయా ఉదారవాద వ్యూహాన్ని తిరస్కరించడం. 1990లకి మునుపు నడిచిన ప్రభుత్వాలు ఈ వాస్తవాన్ని గ్రహించాయి గనుకే ఆ కాలంలో సామ్రావాజ వాదుల ఎత్తుగడలకు అవి భయపడలేదు. నయా ఉదారవాద విధానాలను ఎప్పుడైతే చేపట్టడం జరిగిందో అప్పటినుంచి మన దేశ స్వాతంత్ర్యం విషయంలో పరిమితులు ఏర్పడడం మొదలైంది. జాతీయవాదంతో మనం వలస పాలన పారదోలినట్టు ఈ సామ్రాజ్య వాదుల నయా వలసపాలనకూడా దేశాన్ని గ్లోబలైజేషన్ అనగా అమెరికా, యూరోప్ దేశాలపై ఆధారపడే ప్రభుత్వ విధానాల నుంచి తప్పించి స్వయం పోషకత్వ విధానాలవైపు ప్రభుత్వ విధానాలుండాలి. ప్రపంచ ఆర్థికరంగం ఎదుర్కొంటున్న ఈ సుంకాలవలయం నుంచి బయటకు రావాలంటే మన సొంత ఆర్థిక ప్రయోజనాల కోసం ప్రాధాన్యతఇవ్వాలి. మరలా వలసపాలనకు వ్యతిరేకంగా ఆనాడు విదేశీ వస్త్ర బహిష్కరణ చేసినట్టుగా స్వదేశీ వస్త్రాలైన ఖాదీధరించినట్లుగా ప్రస్తుతం భారతీయులుతయారుచేసిన వస్తువులనే కొనుగోలు చేయాలని కూడా గుర్తించాలి. దీనినే ప్రధానమంత్రి మోడీ79వ స్వాతంత్ర్యదినోత్సవం నాడు ఎర్రకోటనుంచి పిలుపు ఇచ్చారు. ముఖ్యంగా చిన్నపరిశ్రమలను ప్రోత్సహించాలని ప్రధాని కోరారు. దేశీయ తయారీ రంగాన్ని అభివృద్ధి చేయడం అత్యవసరం. •

# ఢిల్లీ సిఎంపై దాడి ఎందుకు చేశాడు?

## నిందితుని అరెస్టుచేసి దర్యాప్తు జరుపుతున్న పోలీసులు




**న్యూఢిల్లీ, ఆగస్టు 20:** ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖాగుప్తాపై ఓ వ్యక్తి దాడి చేయడం సంచనలం రేపిన విషయం తెలిసిందే. నిందితుడిని అరెస్టు చేసిన పోలీసులు అతడిని గుజరాత్‌లోని రాజ్‌కోట్‌కు చెందిన రాజేశ్ భాయ్ ఖిమ్జీ భాయ్ సకారియా (41)గా గుర్తించారు. గుజరాత్‌లోనూ అతడిపై దర్యాప్తు ముమ్మరం చేసిన అధికారులు దాడికి గల కారణాలు తెలుసుకొనే పనిలో పడ్డారు. ఈ సందర్భంగా అతడి కుటుంబ సభ్యులను విచారిస్తున్నారు. ముఖ్యమంత్రిపై సకారియా ఎందుకు దాడి చేశాడనే విషయంపై భిన్న కథనాలు వినిపిస్తున్నాయి. నిందితుడి బంధువు జైల్లో ఉన్నాడని, అతడిని విడుదల చేయాలని సిఎంకు విజ్ఞప్తి చేసేందుకు ముఖ్యమంత్రి అధికార నివాసానికి వచ్చినట్లు వార్తలు వచ్చాయి. ఇందుకు సంబంధించిన వ్యవహారం ప్రస్తుతం కోర్టులో పెండింగులో ఉందని జాతీయ మీడియాలో కథనాలు వచ్చాయి. అయితే వీటిని పోలీసులు ధృవీకరించాల్సి ఉంది. మరోవైపు గుజరాత్‌లో నిందితుడి తల్లిని ప్రశ్నించిన అధికారులు, ఆమె నుంచి వివరాలు సేకరించే పనిలో పడ్డారు. కుమారుడు ఢిల్లీ సిఎంను కలిసేందుకు వెళ్లిన విషయం తనకు తెలియదని ఆమె చెప్పినట్లు సమాచారం. అతడు జంతు ప్రేమికుడని, ఇటీవల వీధి శునకాలపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుతో అసంతృప్తిగా ఉన్నాడని పేర్కొన్నట్లు తెలుస్తోంది. అయితే, అతడి మానసిక పరిస్థితి బాగా లేదని, గతంలోనూ ఓసారి ఢిల్లీ వెళ్లి వచ్చా డనిపోలీసులకు వివరించినట్లు సమాచారం. అజీ డ్యామ్ ప్రాంతంలో నివాసముండే రాజేష్‌పై స్థానిక పోలీస్ స్టేషన్‌లో తొమ్మిది కేసులు ఉన్నట్లు సమాచారం. 2017-22 మధ్యకాలంలో బెదిరింపులు, స్థానికులపై దాడి, మద్యం మత్తులో దుష్ప్రవర్త నకు సంబంధించి ఈ కేసులు నమోదైనట్లు తెలిసింది.

అయితే జైల్లో ఉన్న బంధువు విడుదల కోసం వెళ్లినట్లు వార్తలు వచ్చినప్పటికీ అటువంటిదేమీ లేదని గుజరాత్ పోలీసులు గుర్తించినట్లు వెల్లడైంది.

ఇదిలా ఉంటే ఢిల్లీ సివిల్ లైన్స్‌లోని సిఎం అధికారిక నివాసంలో 'జన్ సున్‌వాయ్' నిర్వహిస్తున్న సమయంలో ముఖ్యమంత్రి రేఖా గుప్తాపై రాజ్‌కోట్ వ్యక్తి దాడికి పాల్పడ్డాడు. కొన్ని పేపర్లను సిఎంకు అందించిన తర్వాత అతడు గట్టిగా అరుస్తూ సిఎంపై దాడి చేసినట్లు ప్రత్యక్ష సాక్షులు మీడియాకు వెల్లడించారు. ఈ ఘటనను బిజెపి సహా విపక్ష పార్టీలు తీవ్రంగా ఖండించాయి.

# ఆగిపోని చమురు కుంపట్లు.. ట్రంప్ కార్యవర్గం లక్ష్యమే భారత్!



**వాషింగ్టన్, ఆగస్టు 20:** రష్యా చమురుపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కార్యవర్గం గత 10 రోజులుగా అదేపనిగా భారత్‌ను లక్ష్యంగా చేసుకొని ప్రకటనలు గుప్పిస్తోంది. ముఖ్యంగా అమెరికా ట్రెజరీ సెక్రటరీ స్కాట్ బెస్సెంట్ మరోసారి ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఈసారి భారత పారిశ్రామిక వేత్తలను లక్ష్యంగా చేసుకొన్నారు. పశ్చిమదేశాలు విధించిన ఆంక్షల లబ్ధిని భారత్ పొందుతోందని ఆరోపించారు. సిఎన్‌బిసికి ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ భారత వైఖరి ఆమోదయోగ్యం కాదన్నారు. 'రష్యా నుంచి భారత్ చౌకగా చమురు కొనుగోలు చేసి.. దానిని ఉత్పత్తి చేసినట్లు బయట విక్రయిస్తోంది. ఈ యుద్ధ సమయంలో ఇది మొదలుపెట్టింది. దీనిని ఏమాత్రం ఆమోదించలేము. వారు మారువిక్రయం చేసి.. లబ్ధి పొందుతున్నారు. 16 బిలియన్ డాలర్ల వరకు వారికి మిగులుతున్నాయి. ఈ వ్యవహారంలో భారత్‌లోని కొన్ని సంపన్న కుటుంబాలు భాగస్వామ్యం అయ్యాయి. యుద్ధానికి భారత్ రష్యా నుంచి 1 శాతం చమురు కొనుగోలు చేస్తే.. సంక్షోభం మొదలయ్యాక అది 40 శాతానికి చేరింది' అని బెస్సెంట్ పేర్కొన్నారు. మరోవైపు అమెరికా మాజీ అధ్యక్షుడు జార్జి డబ్ల్యు బుష్ సలహాదారు సిఎన్‌బిసితో మాట్లాడుతూ అమెరికా కోరిక మేరకు భారత్ పెద్దఎత్తున రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తోందన్నారు. ప్రస్తుతం ఆయన రాపిడన్ ఎనర్జీకి ప్రెసిడెంట్‌గా చేస్తున్నారు. బైడెన్ కార్యవర్గం రష్యా నుంచి వచ్చే చమురు తీసుకోమని భారత్‌ను కోరిందన్నారు. చమురు ధరల్లో భారీ వృద్ధి ఉండకుండానే ఈ చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. అమెరికా రూపొందించిన ఆంక్షల చట్రంలో భారత్ ధరలను అదుపు చేసే పాత్రను పోషించిందన్నారు.

# కేంద్రం బిల్లును సమర్థించిన శశిథరూర్

## కాంగ్రెస్ వైఖరికి భిన్నంగా వ్యాఖ్యలు



**న్యూఢిల్లీ, ఆగస్టు 20:** గత కొంతకాలంగా కాంగ్రెస్ విధానాలతో విభేదిస్తున్నారు ఆ పార్టీ ఎంపి శశి థరూర్. తాజాగా తీవ్రమైన నేరారోపణలతో అరెస్టయి వరుసగా 30 రోజులపాటు నిర్బం ధంలో ఉంటే ప్రధానమంత్రినైనా, కేంద్ర మంత్రినైనా పదవి నుంచి తొలగించేందుకు వీలు కల్పించేలా కేంద్ర ప్రభుత్వం తీసుకురానున్న సరికొత్త బిల్లుపైకూడా ఆయన పార్టీ అధిష్టా నానికి భిన్నంగా వ్యాఖ్యలు చేశారు.

ఈ బిల్లును ప్రతిపక్ష ఎంపిలు తీవ్రంగా వ్యతిరేకి స్తున్నారు. దీనిపై కాంగ్రెస్ ఎంపి ప్రియాంక గాంధీ మాట్లాడుతూ ఈ బిల్లు క్రూరమైన దన్నారు. అన్యాయంగా ముఖ్యమంత్రులను అరెస్టు చేస్తే పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. ఇది పూర్తిగా రాజ్యాంగ విరుద్ధమన్నారు. అయితే, విపక్షాలు ఈ బిల్లును వ్యతిరేకించడాన్ని శశిథరూర్ తప్పుబట్టారు. ఇది ఇంగిత జ్ఞానానికి సంబం ధించిన విషయం. ఇందులో నాకు ఎలాంటి తప్పు కనిపించడంలేదు అని ఓ వార్తా సంస్థతో పేర్కొన్నారు. ఈ బిల్లును మరింత అధ్యయనం చేసేందుకు సెలక్ట్ కమిటీకిపంపే అవకాశం ఉందని అధికార వర్గాలు పేర్కొ న్నాయి. దీనిపై థరూర్ మాట్లాడుతూ అదిఎంతో మంచి విషయ మన్నారు.

అది మనప్రజాస్వామ్యానికి ఎంతో మేలు చేస్తుం దని తాను భావిస్తున్నట్లు తెలిపారు. తీవ్రమైన నేరారోప ణలతో అరెస్టయి వరుసగా 30 రోజులపాటు నిర్బంధంలో ఉంటే ప్రధానమంత్రి నైనా, కేంద్రమంత్రినైనా పదవి నుంచి తొలగిం చేందుకు వీలు కల్పించే బిల్లు ప్రవేశపెట్టేందుకు కేంద్రం సిద్ధమైంది. కనీసం అయిదేళ్ల శిక్ష పడే నేరానికి పాల్పడి, అరెస్టయి నెల రోజులు నిర్బంధంలో ఉంటే 31వ రోజున వారి పదవి పోయేలా నిబంధనను ఈ బిల్లులో చేర్చారు. వారంత వారు రాజీనామా చేయకపోయినా కొత్త నిబంధన ప్రకారం పదవిని కోల్పోతారు.

## అలాస్కా వ్యక్తికి 'పుతిన్' గిఫ్ట్‌గా ఖరీదైన యూరల్ బైక్!

**వాషింగ్టన్, ఆగస్టు 20:** రష్యా అధ్యక్షుడు పుతిన్ ఇటీవల అలాస్కాలో ట్రంప్‌తో భేటీ అయిన విషయం తెలిసిందే. ఆ సమయంలో ఓ ఆసక్తి కర పరిణామం చోటుచేసుకుంది. అలాస్కాకు చెందిన ఓ వ్యక్తికి రూ. 19లక్షల విలువైన బైక్‌ను పుతిన్ బహుమతిగా ఇచ్చారు. రష్యాలో తయా రైన యూరల్ బైక్‌ను అతడు వాడుతుండటమే అందుకు కారణం. ఈ ఊహించని పరిణామానికి అలాస్కా వ్యక్తి ఆనందంతో మునిగిపోయాడు. అలాస్కా వేదికగా అమెరికా అధ్యక్షుడు ట్రంప్, రష్యా అధ్యక్షుడు పుతిన్‌ల భేటీ జరిగింది. అంతకు ఓవారం ముందే యాంకరేజ్‌కు చేరు కున్న రష్యన్ మీడియా ప్రతినిధులు స్థానికులతో ముచ్చటించే ప్రయత్నం చేశారు. ఈ సమ యంలో యూరల్ కంపెనీకి చెందిన ఓ పాత బైక్ వాడుతున్న మార్క్ వారెన్ అనే రిటైర్డ్ ఫైర్ ఇన్‌స్పెక్టర్ రష్యా జర్నలిస్టుల కంటపడ్డాడు. ఈ బైక్‌అంటే చాలాఇష్టమని చెప్పినవారెన్.. యుద్ధం నేపథ్యంలో ఆ బైక్ విడిభాగాలు దొరక ట్లేదని, నిర్వహణ కష్టంగా మారిందని వాపో యాడు. ట్రంప్-పుతిన్ భేటీ వల్ల ఈ యుద్ధానికి ముగింపు లభిస్తే ప్రయోజనం ఉంటుందా అని విలేకరులు అడిగిన ప్రశ్నకు అవునంటూ సమా ధానమిచ్చాడు.

ఇందుకు సంబంధించిన న్యూస్ రష్యాలో వైరల్‌గా మారింది. క్రెమ్లిన్ దృష్టికీ వెళ్లింది. దీంతో స్పందించిన రష్యా అధికారులు వారెన్‌కు ఫోన్ చేసి బైక్ గురించి ఆందోళన చెందవద్దని భరోసా ఇచ్చారు. పుతిన్ వచ్చిన విమానంలోనే ఆ బైక్‌ను తీసుకొచ్చినఅధికారులు.. అమెరికా అధికారుల సాయంతో స్థానిక ఎంబసీకి తరలిం చారు. భేటీ మరుసటి రోజు దీనిని వారెన్‌కు అప్పగించే ఏర్పాట్లు చేశారు. సతీమణితో రష్యా ఎంబసీకి వెళ్లిన వారెన్‌కు.. రష్యా అధ్యక్షుడు మీకు ఇచ్చిన బహుమానం ఇదేనని బైక్‌ను చూపించడంతో ఆనందంతో మునిగిపోయాడు.



# గాజాపై ఇజ్రాయెల్ మలిదశ పోరాటం

## రంగంలోకి 50 వేల మంది రిజర్వ్ బలగాలు!

**టెల్అవీవ్, ఆగస్టు 20:** గాజా నగరంపై పూర్తిస్థాయిలో పట్టు సాధించే దిశగా అడుగులు వేస్తున్న ఇజ్రాయెల్ సైన్యం మరో దశ సమరానికి సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. ఇందుకు సంబంధించిన ప్రణాళికకు అత్యున్నత స్థాయి సైనికాధికారులు ఆమోదం తెలిపినట్లు సైనికవర్గాలు వెల్లడించాయి. ఇందుకోసం రానున్న రోజుల్లో దాదాపు 50 వేల మంది రిజర్వు బలగాలను రంగంలోకి దించనున్నట్లు పేర్కొన్నాయి. గాజా నగరంలోని పలు ప్రాంతాల్లో హమాస్ ఇంకా చురుకుగా ఉన్నట్లు ఇజ్రాయెల్ సైన్యం భావిస్తోంది. తమ సైన్యం కార్యకలాపాలు లేని అటువంటి ప్రాంతాలపై దృష్టి పెట్టామని.. త్వరలోనే అక్కడ సైన్యాన్ని మోహరించే ప్రయత్నాలు చేస్తున్నామని ఓ అధికారి వెల్లడించారు. ఇందుకు సంబధించిన ప్రణాళిక తుది దశలో ఉందన్నారు. అయితే, ఈ ఆపరేషన్ ఎప్పుడు మొదలవుతుందనే విషయంపై స్పష్టత లేదు. రానున్న నెలల్లో 50 మంది రిజర్విస్టులను రంగంలోకి దించనున్నట్లు ఆ అధికారి వెల్లడించారు. దీంతో క్రియాశీల రిజర్విస్టుల సంఖ్య 1.2 లక్షలకు చేరుకుంటుం దన్నారు.

మరోవైపు గాజాను స్వాధీనం చేసుకోవాలనే ప్రతిపాదనకు సెక్యూరిటీ కేబినెట్ ఆమోదం తెలిపినట్లు ఇజ్రాయెల్ ప్రధాని కార్యాలయం ఇటీవల ప్రకటించింది. ఐడిఎఫ్ దళాలు ఆ ప్రాంతాన్ని స్వాధీనం చేసుకోవడానికి సిద్ధమవుతున్నాయని, యుద్ధభూమికి వెలుపల ఉన్న ప్రజలకు మానవతా సాయం అందించనున్నట్లు పేర్కొంది. ఈ చర్య హమాస్ దగ్గర బందీలుగా ఉన్న వారిని వెనక్కి తీసుకొచ్చే ప్రణాళికలలో భాగమని వివరించింది. అయితే, ప్రధాని నెతన్యాహు మాత్రం గాజాను స్వాధీనం చేసుకోవడం తమ ప్రణాళిక కాదన్నారు. హమాస్‌ను నాశనం చేసి బందీలను వెనక్కి తీసుకున్న తర్వాత, ఆ ప్రాంతాన్ని తాత్కాలిక ప్రభుత్వానికి అప్పగించడమే తమ లక్ష్య మన్నారు.

## పాక్ క్రికెటర్ వాసిం అక్రంపై బెట్టింగ్ యాప్ కేసు

**హైదరాబాద్, ఆగస్టు 20, ప్రభాతవార్త:** భారత్‌లో బెట్టింగ్ యాప్‌లకు సంబంధించి సినీ తారలతో పాటు క్రికెటర్లు, సెలబ్రటీలపై కేంద్ర దర్యాప్తు స ంస్థ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్ (ఈడీ)తో పాటు ఆయా రాష్ట్రాలు వేరు వేరుగా కేసులు నమోదు చేయడం తెలిసిందే. దీనికి సంబంధించి నింది తులుగా వున్న వారిలో క్రికెటర్ సురేష్ రైనా, టాలీవుడ్ నటులు పలువురిని ఈడీతో పాటు ఆయా రాష్ట్రాల పోలీసులు ఇప్పటికే విచారించి వారి వాంగ్మూలం కూడా తీసుకు న్నారు. ఇప్పుడు ఇదే బెట్టింగ్ యాప్‌ను ప్రమోట్ చేసినందుకు పాకిస్తాన్‌కు చెందిన దిగ్గజ క్రికెటర్ వాసిం అక్రంపై లాహోర్ లోని నేషనల్ సైబర్ క్రైం ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ (ఎన్‌సిసిఐఎ)లో కేసు నమోదయ్యింది. లాహోర్‌కు చెందిన ఫైజ్ అనే వ్యక్తి చేసిన ఫిర్యాదు మేరకు వాసిం అక్రంపై కేసు నమోదయ్యింది. వాసిం అక్రం కొన్నేళ్లుగా బాజీ అనే విదేశీ బెట్టింగ్ యాప్‌కు బ్రాండ్ ప్రమోటర్‌గా వ్యవహరిస్తున్నాడని ఫైజ్ తన ఫిర్యాదులో తెలిపాడు. దీనికి సంబంధించి సోషల్ మీడియాలో వున్న పోస్టర్లు, వీడియో క్లిప్‌ను అతను పోలీసులకు అందించాడు. వాసిం అ క్రం వంటి సెలబ్రటీ బెట్టింగ్ యాప్‌లను ప్రమోట్ చేయడం వల్ల సామాన్యులు ముఖ్యంగా యువత జూదం వైపు మళ్లీ అప్పులపాలై ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆ ఫిర్యాదులో ఫైజ్ తెలిపాడు. ఇందుకుగానూ వాసిం అక్రంపై ఎలక్ట్రానిక్ క్రైం యాక్ట్ 2016 కింద చర్యలు తీసుకోవాలని ఫిర్యా దిదారుడు కోరాడు. ఈ ఫిర్యాదు మేరకు ఎన్‌సిసిఐఎలో వాసిం అక్రంపై కేసు నమోదయ్యింది.

# ఆడుకుంటూ కారులోకి వెళ్లిన అన్నదమ్ములు

## ఆటో లాక్ పడి ఊపిరాడక మృతి



**జైపూర్, ఆగస్టు 20:** ఆట ఆడుకుంటూ కారులోకి వెళ్లిన ఇద్దరు అన్నదమ్ములు మరణించారు. కారు ఆటో లాక్ పడటంతో ఊపిరాడక అక్కడిక్కడే ప్రాణాలు కోల్పోయారు. తమ పిల్లలు కనిపిచడం లేదని వెతికినా తల్లిదండ్రులకు ఇంటికి కేవలం 20 మీటర్ల దూరంలో పార్క్ చేసిన కారులో విగత జీవులుగా కనిపించారు. ఈ ఘటన రాజస్థాన్‌లో జరిగింది. ఇది ప్రమాదవశాత్తూ జరిగిన ఘటనగా పోలీసులు భావిస్తుండగా, తల్లిదండ్రులు మాత్రం హత్య అని అనుమానిస్తున్నారు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం, జయపుర్‌లోని గలతా గెట్ పోలీస్ స్టేషన్ పరిధికి చెందిన ఇద్దరు మైనర్ సోదరులు మంగళవారం సాయంత్రం అకస్మాత్తుగా కనిపించకుండా పోయారు. ఒకరికి 8 యేళ్ల కాగా, మరొకరికి 5సంవత్సరాల వయసు ఉంటుంది. వారి కుటుంబసభ్యులు అర్ధరాత్రి వరకు వెతికినా, ఎక్కడా ఆచూకీ లభించలేదు. చివరకు తమ పిల్లలు కనిపించడం లేదని గలతా గెట్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వెంటనే ఆ పిల్లల ఇంటి చుట్టుపక్కల ప్రాంతాల్లో పోలీసులు వెతకడం ప్రారంభించారు. ఇంటికి కొంచెం దూరంలో పార్క్ చేసి ఉన్న కారులో ఆ పిల్లల మృతదేహాలు కనిపించారు. ఆ మైనర్ సోదరులు ఊపిరాడక మృతి చెందారని ప్రాథమిక దర్యాప్తులో తేలిందని ఎసిపి రామ్ గంజ్ తెలిపారు. చిన్నారులు ఇద్దరు ఆటలాడుతూ కారులో వెళ్లారు. అది ఆటో లాక్ కావడం వల్ల లోపలే చిక్కుపోయారు. దీంతో ఊపిరాడక మృతి చెంది ఉంటారని తెలిపారు.

శవపరీక్షల నిమిత్తం మృతదేహాలను ఎస్ఎంఎస్ ఆస్పత్రికి తరలించినట్లు చెప్పారు. అలాగే ఫోరెన్సిక్ బృందాన్ని పిలిపించి కారులోని వేలిముద్రలను సేకరించినట్లు తెలిపారు. ఆ ప్రాంతం చుట్టుపక్కల ఉన్న సిసిటివిలను పరిశీలిస్తున్నట్లు పేర్కొన్నారు. దర్యాప్తు తర్వాతే స్పష్టత వస్తుందని అన్నారు. అయితే తల్లిదండ్రులు మాత్రం తమ పిల్లలను హత్య చేసినట్లుగా అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

మృతదేహాలపై గాయాలు ఉన్నట్లు ఆరోపిస్తున్నారు. ఈ ఘటన గురించి సమాచారం అందుకున్న స్థానిక ఎమ్మెల్యే రఫీక్‌ఖాన్ బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

## ప్రియుడితో దొరికిన భార్య - వారిద్దరికీ వివాహం చేసిన భర్త!

**లక్నో, ఆగస్టు 20:** ఆ ఇద్దరికి వివాహం జరిగి 25 యేళ్లు. వారికి ఇద్దరు ఎదిగిన పిల్లలు ఉన్నారు. ఈ క్రమంలో భార్య తన ప్రియుడితో కలిసి రెడ్ హ్యాండెడ్‌గా భర్త కంటపడింది. దాంతో ఆ భర్త విచిత్రమైన నిర్ణయం తీసుకున్నాడు. ఇద్దరికీ దగ్గరుండి వివాహం జరిపించాడు! ఉత్తరప్రదేశ్ లోని వారణాసి నగరంలో ఈ ఘటన జరిగింది. ఈ వార్త ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. వివరాల్లోకి వెళ్తే.. మీర్జాపూర్ జిల్లాకు చెందిన అర్విండ్ పటేల్, చందౌలి జిల్లా హమీద్‌పూర్‌కు చెందిన రీనాకు 25 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. పాతికేళ్లుగా ఇద్దరూ కాపురం చేస్తున్నారు. వారికి ఇద్దరు ఎదిగిన పిల్లలు ఉన్నారు. ఈ క్రమంలో రీనాకు చందౌలికే చెందిన సియారామ్ యాదవ్ అనే వ్యక్తితో పరిచయం ఏర్పడింది. ఆ పరిచయం క్రమంగా వివాహేతర బంధానికి దారితీసింది. సియారామ్ గతంలో అర్విండ్ పటేల్‌కు చెందిన దుకాణంలో పనిచేసేవాడు. ఆ సమయంలోనే అతడికి రీనాతో పరిచయం ఏర్పడింది. అది క్రమంగా వివాహేతర బంధానికి దారితీసింది.

# పాకిస్థాన్‌కు అది సిగ్గు చేటు

## ఐరాసలో దాయాది దురాగతాలను ఎండగట్టిన భారత్

**న్యూయార్క్, ఆగస్టు 20:** పాకిస్థాన్‌లో మైనారిటీ వర్గాల మహిళలపై లైంగిక హింస నేటికీ కొనసాగుతోందని భారత్ ఆందోళన వ్యక్తం చేసింది.

మునుపటి తూర్పు పాకిస్థాన్‌లో వేలాది మంది మహిళలపై దారుణమైన నేరాలకు పాల్పడిన చరిత్ర పాక్ సైన్యానిదని, అయినప్ప టికీ వారిపై చర్యలు శూన్యమని దుయ్యబట్టింది. ఆ దురాగతాలు నేటికీ కొనసాగుతున్నాయని ఐరాస వేదికగా మండిపడింది.

'1971లో మునుపటి తూర్పు పాకిస్థాన్‌లో వేలాది మంది మైనారిటీ వర్గాల మహిళ్లపై దారుణమైన లైంగిక హింసకు పాల్పడిన చరిత్ర పాక్ సైన్యానిది. అయినప్పటికీ నిందితులపై ఎటువంటి శిక్షలు విధించకపోవడం సిగ్గుచేటు. అటువంటి దుర్భర పరిస్థితి నేటికీ పాక్‌లో కొనసాగుతోంది. మహిళల అపహరణ, అక్రమ రవాణా, బాల్య వివాహాలు, లైంగికహింస, బలహీనవర్గాల మహిళ బలవంతపు మత మార్పిడిలు, బాలికలపై వేధింపులకు సంబం ధించి ఐరాస మానవ హక్కుల కమిషన్‌తోపాటు ఎన్నో అంతర్జాతీయ సంస్థలు తమ నివేదికల్లో వివరించాయి' అని ఐరాసలో భారత రాయబారి ఎల్డోస్ మాథ్యూ పున్నూస్ వెల్లడించారు.

ఐరాస భద్రతా మండలిలో 'సంఘర్షణ- సంబం ధిత లైంగిక హింస' అనే అంశంపై పున్నూస్ ప్రసంగిస్తూ పాక్ తీరును ఎండగట్టారు. గతంలో బంగ్లాదేశ్‌లో మహిళలపై పాకిస్థాన్ సైన్యం చేసిన దురాగతాలను ప్రపంచం ముందుంచారు. వీటికి అక్కడి న్యాయవ్యవస్థకూడ వంత పాడు తోందని విమర్శలు గుప్పించారు. క్రూరమైన చర్యలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకో వాలని డిమాండ్ చేసిన ఆయన.. హేయమైన చర్యలకు పాల్పడేవారిని శిక్షించాలన్నారు. సంఘర్షణ ప్రాంతాల్లో లైంగిక హింస అనేది వ్యక్తిగత జీవితాలను నాశనం చేయడమే కాకుండా సమాజంలోనూ భయాలను సృష్టిస్తుం దన్నారు.

ఇటువంటి అంశాలకు పరిష్కార మార్గం చూపిన దేశాల్లో భారత్ ఒకటని, సెక్రటరీ జనరల్ ట్రస్ట్ ఫండ్‌కు సాయం అందిస్తున్న విషయాన్ని గుర్తుచేశారు.

## నిషేధం కాదు.. నియంత్రణకు

# చర్యలు తీసుకోవాలి

## ఆన్‌లైన్ బెట్టింగ్ గేమ్స్‌పై కేంద్ర మంత్రి అమిత్ షాకు గేమింగ్ ఫెడరేషన్ లేఖ

**న్యూఢిల్లీ,ఆగస్టు 20:** ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్స్ ఆగడాలు ఇటీవల మరీ పెరిగిపోయాయి. దీన్ని అరికట్టడంలో భాగంగా 'ఆన్‌లైన్ గేమింగ్ బిల్లు'ను తీసుకొచ్చేందుకు కేంద్రం సిద్ధమైన సంగతి తెలిసిందే. ఈ బిల్లుపై ఆందోళన వ్యక్తం చేస్తూ ఆల్ ఇండియా గేమింగ్ ఫెడరేషన్ కేంద్ర హోం మంత్రి అమిత్ షాకు లేఖ రాసింది. ఆన్‌లైన్ బెట్టింగ్‌లను అరికట్టేందుకు కేంద్రం తీసుకొచ్చే బిల్లు కారణంగా తమ రంగానికి తీవ్ర నష్టం కలుగుతుందని ఎఐజిఎఫ్ ఆందోళన వ్యక్తం చేసింది.

ఇది అమల్లోకి వస్తే తమ పరిశ్రమకు భారీ నష్టం జరుగుతుందని, కోట్ల మంది చట్టబద్ధమైన గేమర్‌లు అక్రమంగా నెట్‌వర్క్‌లను నడిపేవారి వైపు వెళ్లేలా చేస్తుందని ఆవేదన వ్యక్తం చేసింది. అంతేగాక ఈ రంగంలోని అనేక మంది ఉద్యో గులపై కూడా దీని ప్రభావం ఉంటుందని హెచ్చ రించింది. ఈ సందర్భంగా దీన్ని పూర్తిగా నిషేధం విధించేకంటే దానిపై నియంత్రణ చర్యలు తీసుకోవాలని కేంద్రానికి సూచించింది. ఆటగాళ్లను రక్షించడంతో పాటు వారు బాధ్యతా యుతంగా ఆడేలా చర్యలు తీసుకోవాలని కోరింది. కొత్త ఆవిష్కరణలను ప్రోత్సహించా లని, పరిశ్రమను పూర్తిగా చీకట్లోకి నెట్టేయొద్దని అభ్యర్థించింది. ఈ ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్స్ వాడకం ఇటీవల విపరీతంగా పెరిగిపోయింది. దీనికి బానిసైన కొందరు అప్పుల ఊబిలో కూరుకుపోయి ప్రాణాల మీదకు తెచ్చుకుంటు న్నారు. వీటిని ప్రమోట్ చేసిన ప్రముఖులు ప్రస్తుతం దర్యాప్తు సంస్థల నుంచి విచారణ ఎదుర్కొంటున్నారు.

ఈ క్రమంలోనే ఆన్‌లైన్ బెట్టింగ్‌ను నేరంగా పరిగణిస్తూ 'ఆన్‌లైన్ గేమింగ్ బిల్లు'ను తీసుకువచ్చేందుకు కేంద్రం సిద్ధమైంది. ప్రధాని మోడీ నేతృత్వంలో జరిగిన మంత్రివర్గ సమావేశంలో దీనికి ఆమోదం లభించిందని అధి కార వర్గాలు తెలిపాయి. నేడు దీన్ని లోక్‌సభలో ప్రవేశపెట్టే అవకాశం ఉంది.

# సంక్షిప్తంగా..

## అఫ్ఘాన్ బస్సులో మంటలు, 71 మంది మృతి


**కాబూల్, ఆగస్టు 20:** అఫ్ఘానిస్థాన్‌లో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఇరాన్ నుంచి తరలిపోతున్న వలసదారుల బస్సుకు మంటలు అంటుకున్నాయి. ఈ ఘటనలో 71 మంది ప్రాణాలు కోల్పోయారు. అధికారులు తెలిపిన వివరాలు ప్రకారం.. పశ్చిమ హెరాత్ ప్రావిన్స్‌లో ఈ ప్రమాదం జరిగింది. ఇరాన్ నుంచి ఇటీవల బహిష్కరణకు గురైన అఫ్ఘాన్ వలసదారులతో వెళ్తున్న బస్సు, మోటార్‌సైకిల్ ఢీకొన్నాయి. దీంతో బస్సులో మంటలు చెలరేగాయి. వెంటనే అగ్నిమాపక సిబ్బందితో సహా స్థానికులు మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నించారు. ఈ ఘటనలో 17 మంది చిన్నారులతో సహా 71 మంది ప్రాణాలు కోల్పోయారు. మరికొంతమంది గాయపడ్డారు. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించి.. చికిత్స అందిస్తున్నాం. మోటార్‌బైక్‌పై ఉన్న ఇద్దరు వ్యక్తులు కూడా మృతి చెందారు. నిర్లక్ష్యం, అతివేగం కారణంగానే ఈ ప్రమాదం జరిగిందని ప్రాథమిక దర్యాప్తులో తేలింది. దీనిపై పూర్తి స్థాయి విచారణ కొనసాగుతోంది. కాగా.. అఫ్ఘాన్ శరణార్థులపై ఉక్కుపాదం మోపుతున్న ఇరాన్, పాకిస్థాన్ భార డిపోర్టేషన్ చేపట్టిన సంగతి తెలిసిందే. ఈ యేడాది ప్రారంభం నుంచి దాదాపు 1.5 మిలియన్ల మందికిపైగా అఫ్ఘాన్‌న్లు ఇరాన్, పాకిస్థాన్ నుంచి బలవంతంగా స్వదేశానికి తిరిగివచ్చారు.

## అగ్ని 5 బాలిస్టిక్ క్షిపణి పరీక్ష విజయవంతం



**భువనేశ్వర్, ఆగస్టు 20:** భారత్ 'అగ్ని 5' బాలిస్టిక్ క్షిపణిని విజయవంతంగా పరీక్షించింది. ఒడిశా తీరం డాక్టర్ ఎపిజె అబ్దుల్ కలాం ద్వీపం నుంచి ఈ క్షిపణిని పరీక్షించింది. ఇది అణు సామర్థ్యం ఉన్న స్వదేశీ క్షిపణి. ఇది రక్షణ రంగంలో దేశానికి ఉన్న బలమైన సామర్థ్యాన్ని మరోసారి నిరూపించింది. ఈ పరీక్షను డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ (డిఆర్‌డిఒ) నిర్వహించింది. 'అగ్ని 5' ఇంటర్మీడియట్ రేంజ్ బాలిస్టిక్ క్షిపణి 5,000 కిలోమీటర్ల వరకు లక్ష్యాలను ఛేదించగలదు. ఒకేసారి బహుళ లక్ష్యాలను ఛేదించగల సామర్థ్యం దీని సొంతం. శ్రేణి: 'అగ్ని 5' ఇంటర్మీడియట్ రేంజ్ బాలిస్టిక్ క్షిపణి, ఇది 5,000 కిలోమీటర్ల వరకు లక్ష్యాలను ఛేదించగలదు. టెక్నాలజీ: ఈ కిపణి మూడు దశల ఘన ఇంధన ఇంజిన్‌ను కలిగి ఉంది. లక్ష్యాలను ఛేదించే సామర్థ్యం: 'అగ్ని 5' ఒకేసారి బహుళ లక్ష్యాలను ఛేదించగల సామర్థ్యం దీని సొంతం.

## ఢిల్లీలో కుప్పకూలిన భవనం.. ముగ్గురు దుర్మరణం



**న్యూఢిల్లీ, ఆగస్టు 20:** భవనం కుప్పకూలిన ఘటనలో ముగ్గురు దుర్మరణం పాలయ్యారు. దేశ రాజధాని ఢిల్లీలోని దర్యాగంజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం ఉదయం ఈ ఘటన చోటుచేసుకుంది. ఘటనపై సమాచారం అందిన వెంటనే ఢిల్లీ స్థానిక అధికారులు, ఢిల్లీ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ సిబ్బంది రంగంలోకి దిగి సహాయక చర్యలు చేపట్టారు. ప్రమాదంలో మరణించిన ముగ్గురి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం లోక్‌నాయక్ జయప్రకాష్ నారాయణ్ ఆస్పత్రికి తరలించారు. కాగా ఘటనా స్థలంలో భవన శిథిలాల తొలగింపు కొనసాగుతోందని పోలీసులు చెప్పారు. ఘటనకు కారణాలపై నిర్ధారణకు వచ్చిన తర్వాత బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు.

## ఢిల్లీలో పాఠశాలలకు బాంబు బెదరింపులు

**హైదరాబాద్, ఆగస్టు 20 ప్రభాతవార్త:** దేశ రాజధాని ఢిల్లీలో పలు పాఠశాలలకు మరోసారి బాంబు బెదిరింపులు వచ్చాయి. దాదాపు 50కి పైగా పాఠశాలలకు కొందరు దుండగులు ఈ మెయిల్స్ ద్వారా బెదిరింపులకు పాల్పడ్డారు. వెంటనే అప్రమత్తమైన పోలీసులు సోదాలు నిర్వహించారు. టెర్రరైజర్స్ 111గా పేర్కొనే ఒక గ్రూపు పలు పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు, ఉపాధ్యాయులకు బెదిరింపు మెయిల్స్ పంపించినట్లు పోలీసులు పేర్కొన్నారు. స్కూళ్లలోని కంప్యూటర్లు, కెమెరాలు అన్నీ ప్రస్తుతం తమ అధీనంలో ఉన్నాయన్నారు. 25,000 బిలియన్ డాలర్లు తమకు ఇవ్వాలని డిమాండ్ చేసినట్లు తెలిపారు. లేదంటే 48 గంటల్లో బాంబు పేల్చేస్తామని బెదిరించినట్లు వెల్లడించారు. మెయిల్స్ విషయాన్ని పోలీసులకు చెప్తే బాంబు పేల్చేయడంతో పాటు స్కూళ్లకు సంబంధించిన డేటాను లీక్ చేస్తామని హెచ్చరించారన్నారు. ఇదే గ్రూప్ ఇటీవల 5వేల బిలియన్ డాలర్ల కోసం ఇలాంటి బెదిరింపులకు పాల్పడినట్లు అధికారులు పేర్కొన్నారు.

# ఆత్మస్థైర్యంతో క్యాన్సర్‌ను జయించవచ్చు

## - మిస్ వరల్డ్ ఓపల్ సుచాత చువాంగ్ శ్రీ

**విజయవాడ,ఆగస్టు20,ప్రభాతవార్తప్రతినిధి:** అవగాహనతో,ఆత్మస్థైర్యంతో క్యాన్సర్‌ను జయించవచ్చునని మిస్ వరల్డ్ ఓపల్ సుచాత చువాంగ్ శ్రీ అన్నారు. 16 ఏళ్లకే తాను బ్రెస్ట్ క్యాన్సర్ బారిన పడ్డానని ఓపల్ సుచాత చువాంగ్ శ్రీ తెలిపారు. అవగాహనతో తొలి దశలోనే వైద్యం తీసుకున్నానని దానితో బ్రెస్ట్ క్యాన్సర్‌ను జయించానని ఉద్ఘాటించారు. మహిళల్లో ఎక్కువగా బ్రెస్ట్ క్యాన్సర్ మరణాలు సంభవిస్తున్నాయన్నారు. తొలి దశలోనే గుర్తిస్తే ఈ వ్యాధి నుంచి బయటపడొచ్చని తెలిపారు. కృష్ణాజిల్లా గుడ్లవల్లేరు మండలం దోసపాడులో ప్రపంచ సుందరీమణులు సందడి చేస్తున్నారు. తెలుగు సంప్రదాయ వస్త్రధారణలో గ్రామంలో మిస్ వరల్డ్ ఓపల్ సుచాత చువాంగ్ శ్రీ, మిస్ ఆసియా కృష్ణా గ్రావిడెజ్ పర్యటించారు. దోసపాడు మహాక్షేత్రంలోని శ్రీ వేంకటేశ్వర స్వామిని సుందరీమణులు దర్శించుకున్నారు. మంగళ హారతులు ఇచ్చి కుంకుమ బొట్టు పెడుతూ గ్రామస్తులు సుందరీమణులకు స్వాగతం పలికారు. దేవస్థాన ప్రాంగణంలో భారతీయ సాంప్రదాయ కూచిపూడి, భరతనాట్య ప్రదర్శనలు చూసి సుందరీమణులు మురిసిపోయారు.కృష్ణా జిల్లా దోసపాడు గ్రామంలో సుధారెడ్డి ఫౌండేషన్ - మెయిల్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో బ్రెస్ట్ క్యాన్సర్ స్క్రీనింగ్ సెంటర్‌ను మిస్ వరల్డ్ ఓపల్ సుచాత చువాంగ్ శ్రీ, మిస్ ఆసియా కృష్ణా గ్రావిడెజ్, సుధారెడ్డి ఫౌండేషన్ అధినేత సుధారెడ్డి ప్రారంభించారు. ముఖ్యఅతిథులుగా మిస్ వరల్డ్ ఓపల్ సుచాత చువాంగ్ శ్రీ, మిస్ ఆసియా కృష్ణా గ్రావిడెజ్ హాజరయ్యారు. పేద మహిళలకు ఆరోగ్యాన్ని సంరక్షించే కార్యక్రమంలో పాల్గొనడం సంతోషంగా ఉందని తెలిపారు. మిస్ వరల్డ్ గ్లోబల్ అంబాసిడర్ సుధారెడ్డి చేస్తున్న సేవా కార్యక్రమాలు తమలాంటి వారికి ఆదర్శనీయమని కొనియాడారు. గ్రామీణ మహిళలు తప్పనిసరిగా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఓపల్ సుచాత చువాంగ్ శ్రీ సూచించారు. బ్రెస్ట్ క్యాన్సర్ ఎక్కువగా గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలకు వస్తుందని సుధారెడ్డి ద్వారా తెలుసుకున్నానని అన్నారు. ఇలాంటి కార్యక్రమాల్లో పాల్గొనడం సంతోషంగా ఉందని వెల్లడించారు. తొలి దశలోనే బ్రెస్ట్ క్యాన్సర్ వ్యాధిని గుర్తించి తగ్గించుకోవచ్చని ఓపల్ సుచాత చువాంగ్ శ్రీ పేర్కొన్నారు. మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే సమాజం అభివృద్ధి: కృష్ణా గ్రావిడెజ్ :మహిళలు ఆరోగ్యంగా, బలంగా ఉంటేనే సమాజం అభివృద్ధి చెందుతుందని మిస్ ఆసియా కృష్ణా గ్రావిడెజ్ తెలిపారు. క్యాన్సర్ మహమ్మారిని తరిమికొట్టేందుకు ముందుండి ఇలాంటి అవగాహన కార్యక్రమాలు చేపడతామని కృష్ణా గ్రావిడెజ్ చెప్పుకొచ్చారు. ఇటువంటి మంచి కార్యక్రమాల్లో పాల్గొనటం సంతోషంగా ఉందని తెలిపారు. మహిళల్లో ఎక్కువగా వస్తే బ్రెస్ట్ క్యాన్సర్‌పై అవగాహనతో పాటు తొలి దశలోనే చికిత్స అవసరమని చెప్పుకొచ్చారు. శిలి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహిళలకు మెడికల్ సపోర్ట్ ఉండటం చాలా గ్రేట్ అని కృష్ణా గ్రావిడెజ్ పేర్కొన్నారు. సుధారెడ్డి ఫౌండేషన్ - మెయిల్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో మహిళలకు ఉచిత క్యాన్సర్ పరీక్షలు నిర్వహిస్తున్నామని సుధారెడ్డి ఫౌండేషన్ అధినేత సుధారెడ్డి తెలిపారు.

# దుర్గమ్మ ఆలయంలో ఘనంగా దసరా ఉత్సవాలు

## మంత్రి ఆనం రామనారాయణరెడ్డి



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

**ఇంద్రకీలాద్రి, ఆగస్టు 20, ప్రభాతవార్త** దుర్గమ్మవారి ఆలయంలో ఈ ఏడాది దసరా ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తామని దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అన్నారు. బుధవారం ఆయన జిల్లా కలెక్టర్ లక్ష్మిషా ఇతర ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మాట్లాడుతూ సెప్టెంబర్ 22 నుండి అక్టోబర్ 2 వరకు జరిగే దసరా ఉత్సవాల్లో సామన్యభక్తులకు సంతృప్తికర దర్శనం, సౌకర్యాల కల్పన ధ్యేయంగా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఉత్సవ నిర్వహణలో ఆధ్యాత్మిక శోభతో వుండాలని అధికారులకు ఆదేశాలిచ్చారు. భక్తులకు తాగునీరు, అన్న ప్రసాదం సమృద్ధిగా అందించాలన్నారు. ప్రకాశంబ్యారేజ్, దేవస్థానం ప్రాంగణమంతా వెలుగులతో నింపడానికి విద్యుదీపాలంకరణ చేయాలన్నారు. కృష్ణమ్మవారికి హారతులు వైభవంగా జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఉత్సవాలకు ముందస్తుగా ఏర్పాట్లు పూర్తి చేస్తామన్నారు. ఈ ఉత్సవాల్లో దాతల సహకారం తీసుకోవాలన్నారు. విజయవాడ ఖ్యాతిని పెంచేలా ఉత్సవ నిర్వహణ చేయాలని సిఎం ఆదేశాల మేరకు పనిచేస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ ధ్యాన్‌చంద్, దేవదాయ శాఖ కమీషనర్ రామచంద్ర మోహన్, ఇఓ వికె శీ నా నాయక్, పలు శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. - దుర్గమ్మవారి నిత్యాన్నదాన పథకానికి విరాళం : దుర్గమ్మవారి ఆలయంలో నిర్వహించే నిత్యాన్నదాన పథకానికి రు.1,00,116ల విరాళాన్ని విజయవాడకు చెందిన ఆర్ మురళి శ్రీనివాస్, భార్య నాగసౌజన్య, కుమారుడు ప్రణవ్ అర్జున్ పేరిట బుధవారం అందించారు. దాతలకు దుర్గమ్మవారి దర్శన ఏర్పాట్లు చేసిన అధికారులు, అనంతరం వారికి దుర్గమ్మవారి ప్రసాదం, శేషవస్త్రం, మెమొంటోలు అందించారు. వేదపండితులు వేదాశీర్వచనం పలికారు.



దాతలకు అమ్మవారి చిత్రపటం అందచేస్తున్న సిబ్బంది

# నూతన విద్యా విధానంతో దేశాభివృద్ధి

## ఎస్వీయూ విసి అప్పారావు



**తిరుపతి విద్య ఆగస్టు 20 ప్రభాత వార్త:** కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన విద్యావిధానంతో సత్వర దేశాభివృద్ధి సాధ్యమని ఎస్వీయూ వీసీ అప్పారావు పేర్కొన్నారు. ఏబీఆర్ఎస్ఎం,వాయిస్ ఆఫ్ తిరుపతి అకడమీషియన్స్ సంయుక్త ఆధ్వర్యంలో ఎన్ఐపీ2020 విధానాన్ని ప్రవేశపెట్టి 5 సంవత్సరాలు పూర్తైన సందర్భంగా ఖఎన్ ఈ పి 20 20 ఎట్ ది రేట్ ఫైవ్ ఇయర్స్,పాలసీ ,ప్రాక్టీస్, అండ్ ప్రోగ్రెస్ఖఅనే అంశంపై సదస్సును బుధవారం ఎస్వీయూ సెనేట్ హాల్లో నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడుతూ నూతన విద్యావిధానాన్ని కేంద్ర 2020లో ప్రారంభించిందని,గత ఐదేళ్లుగా కేజీ టూ పీజీ వరకు ఎన్ఆపీని అమలు పరుస్తున్నారని తెలిపారు. అనంతర ముఖ్యవక్తగా విచ్చేసిన ఏబీఆర్ఎస్ఎం జాతీయ సహ సంఘటనా కార్యదర్శి గుంతా లక్ష్మణ్ మాట్లాడుతూ చైనా, జపాన్, జర్మనీ వంటి దేశాలు ఎంతో అభివృద్ధి చెందుతున్నాయని, కానీ ప్రాథమిక స్థాయి నుంచి ఉన్నత విద్య దాకా అంతా మాతృభాషలోనే జరుగుతుందని తెలిపారు.భారతీయ విద్యార్థులు జ్ఞానాన్ని అనుసరించే వారు కాకుండా జ్ఞానాన్ని తయారు చేసే వారుగా ఎదగాలని దీనికి జాతీయ విద్యా విధానంలో ఎన్నో అవకాశాలు ఉన్నాయని తెలియజేశారు.ప్రస్తుతం దేశంలో 26 కోట్ల మంది విద్యార్థులు ఉన్నారని 1500 విశ్వవిద్యాలయాలు,

46 వేల కళాశాలలు, కొన్ని లక్షల పాఠశాలలు ఉన్నాయని వీటన్నింటిలో మౌలిక వసతుల మెరుగు కోసం బడ్జెట్లో కేటాయిస్తున్న జీడీపీ కనీసం 6శాతం పెంచాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఏబీఆర్ఎస్ఎం రాష్ట్ర అధ్యక్షులు వైవీ రామిరెడ్డి,ఉపాధ్యక్షురాలు ప్రొఫెసర్ సి వాణి, కన్వీనర్ ప్రొఫెసర్ ఎం రాజశేఖర్, అదనపు ప్రధాన కార్యదర్శి డాక్టర్ జి రాజశేఖర్, డాక్టర్ రమేష్ బాబు, డాక్టర్ ఎన్ బాలసుబ్రమణ్యం, ప్రొఫెసర్ రంజని, డాక్టర్ శ్రీలత, డాక్టర్ సంధ్య హైదరాబాద్ వర్సిటీ మాజీ వీసీ ప్రొఫెసర్ అప్పారావు, వాయిస్ ఆఫ్ తిరుపతి అకడమిషయన్స్, పెద్ద సంఖ్యలో అధ్యాపకులు, 300మంది విద్యావేత్తలు పాల్గొన్నారు.

# సీమలో రైల్వే జిఎం విస్తృత తనిఖీలు



సీమలో భద్రతా తనిఖీలు నిర్వహిస్తున్న రైల్వే జీఎం

**గుంతకల్లు రైల్వే, ఆగస్టు 20,ప్రభాతవార్త** దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాత్సవ బుధవారం రాయలసీమ గుంతకల్లు రైల్వే డివిజన్‌లో విస్తృతంగా భద్రతా తనిఖీలను నిర్వహించారు. నిర్ణీత కార్యక్రమం ప్రకారం సికింద్రాబాద్ నుంచి ప్రత్యేక రైలులో గుంతకల్లు డివిజన్ డోన్,గుత్తి మీదుగా తిరుపతి వెళ్లిన ఆయన తన పర్యటనను తిరుపతి నుంచి ప్రారం భించారు. అమృత్ భారత్ పథకంలో భాగంగా తిరుపతి దక్షిణం వైపు నిర్మిస్తున్న స్టేషన్ పనులను రాజంపేట,కడప రైల్వే స్టేషన్లలో మార్గమధ్యలో రైలు మార్గాలను విండో భద్రతా తనిఖీలు నిర్వహించారు. అనంతరం సాయంత్రం గుంతకల్లుకు చేరుకుని డివిజనల్ సమీక్షా సమావేశంలో పాల్గొన్నారు. కార్యక్రమాల్లో జోనల్ ఉన్నతాధికారులు కె సూర్య నారాయణ,సాయిప్రసాద్,గుంతకల్లు డివిజన్ నుంచి డిఆర్ఎం చంద్రశేఖర్ గుప్తా,అదనపు డిఆర్ఎం సుధాకర్,సిఎంఎస్ డాక్టర్ జీవి గోపాల్ రెడ్డి,రామక్రిష్ణ,మనోజ్, జిబిఎస్ శ్రీనివాస్,శ్రావణ్ కుమార్,డి సూర్యనారాయణ,చంద్రశేఖర్,సుదర్శన్‌రెడ్డి, వీరయ్య, మంగాచార్యులు, హెచ్ఎల్ఎన్ ప్రసాద్,వై సందీప్,ఆకాశ్ కుమార్,జైశ్వాల్,అనిల్ కుమార్,కె శ్రీనివాస్,లక్ష్మణ్,ఆయా విభాగాలకు చెందిన సంబంధిత ఉన్నతాధికారులు, సీనియర్ సబార్డినేట్లు,సిబ్బంది పాల్గొన్నారు.

# కేంద్రంలో మోడీ అబద్ధాలతో పాలన సాగిస్తున్నారు: డాక్టర్ చింతామోహాన్




**తిరుపతి,ఆగస్టు 20ప్రభాతవార్తప్రతినిధి:** కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం,ప్రధాని మోదీ అబద్దాలతో పాలనసాగిస్తున్నారని మాజీకేంద్రమంత్రి, సీనియర్‌కాంగ్రెస్ నేత డాక్టర్ చింతామోహన్ ధ్వజమెత్తారు. ప్రతి కుటుంబానికి 15లక్షలు రూపాయులు ఇస్తామని, ఏడాదికి 2కోట్ల ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చి అది నెరవేర్చలేదన్నారు. అసలు 11ఏళ్ళలో 22కోట్ల ఉద్యోగాలు ఎక్కడ?అని ప్రశ్నించారు. ఇంటికి 15లక్షలు రూపాయలు ఇస్తామని 15 పైసలు కూడా ఇవ్వలేదని దుయ్యబట్టారు. బుధవారం స్వర్గీయ మాజీప్రధాని రాజీవ్‌గాంధీ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత పాఠశాలలు మేసివేస్తోందన్నారు. సిఎం చంద్రబాబు నియంతలా పరిపాలన చేస్తున్నాడని విమర్శించారు. ఎస్సీలు కుప్పం నుండి ఇచ్చాపురం వరకు పాదయాత్ర చేపడితే ఆపేసిన ఘనత చంద్రబాబుదేనన్నారు.

# ఆయుష్ లైసెన్సుల రెన్యువల్‌కు ప్రత్యేక మేళాలు

**విజయవాడ,ఆగస్టు20,ప్రభాతవార్తప్రతినిధి:** ఆయుర్వేద, హోమియో, యునాని మందుల తయారీ యూనిట్లు, దుకాణాల నిర్వహణ రెన్యువల్స్ కోసం ఆయుష్ శాఖ తొలిసారిగా ప్రత్యేక మేళాలను రాష్ట్రంలో నిర్వహించడం ప్రారంభించింది. ఈనెల 25నుండి మలి విడత మేళాలను నిర్వహించనున్నట్లు ఆయుష్ శాఖ డైరెక్టర్ కె.దినేష్ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయుష్ శాఖ అడిషనల్ డైరెక్టర్లు, డ్రగ్ ఇన్ స్పెక్టర్లు, సహాయక సిబ్బంది ఆయుష్ మేళాకు హాజరవుతారని ఆయన పేర్కొన్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి, కృష్ణా జిల్లాలకు చెందిన తయారీ యూనిట్లు, దుకాణాల యజమానులు, విక్రేతలు ఏలూరులోని ఆయుష్ రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ కార్యాలయంలో ఈనెల 25, 26 తేదీల్లో, ఉమ్మడి గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాలకు చెందిన వారు ఆయుష్ రీజనల్ డిప్యూటీ డైరెక్టర్, ఓల్డ్ రిమ్స్ హాస్పిటల్, గవర్నమెంట్ ఆఫీసర్స్ కాంప్లెక్స్, ప్రకాశం భవన్ ఎదురుగా, ఒంగోలు చిరునామాలో సెప్టెంబర్ 1, 2 తేదీల్లో, ఉమ్మడి కర్నూలు, వైయస్సార్ కడప, అనంతపురం, చిత్తూరు జిల్లాల వారు ఆయుష్ రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ కార్యాలయం, ఓల్డ్ రిమ్స్ , 8రోడ్స్ దగ్గర, కడప చిరునామాలో సెప్టెంబర్ 8, 9 తేదీల్లో హాజరుకావాలని ఆయుష్ శాఖ డైరెక్టర్ కోరారు. లైసెన్స్‌లు రెన్యువల్ చేయడంతో పాటు వారివారి సమస్యల పరిష్కారం కోసం ఈ మేళాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.


# రూ.2కోట్ల విలువైన ఎర్రచందనం పట్టివేత

## - అంతర్‌రాష్ట్ర స్మగ్లర్ అరెస్టు

**తిరుపతి,ఆగస్టు 20ప్రభాతవార్తప్రతినిధి:** శేషాచలం అటవీప్రాంతం పరిధిలో తిరుపతి అటవీశాఖ టాస్క్‌ఫోర్స్ అధికారులు 2కోట్ల రూపాయలు విలువైన ఎర్రచందనం దుంగలను, లారీని పట్టుకున్నారు. అక్రమంగా రవాణి చేస్తున్న హర్యానాకు చెందిన స్మగ్లర్‌ను అరెస్టుచేసినట్లు టాస్క్‌ఫోర్స్ ఎస్పీ పి.శ్రీనివాస్ తెలిపారు. టాస్క్‌ఫోర్స్ అధినేత ఎల్.సుబ్బ రాయుడు ప్రత్యేక కార్యాచరణతో ఎస్పీ శ్రీనివాస్ ఆదేశాలతో డిఎస్పీ ఎండి షరీఫ్ ఆధ్వర్యంలో ఆర్ఐ సాయిగిరధర్,ఆర్ఎస్ఐ కెఎస్‌కె లింగాధర్ సిబ్బందితో అందిన సమాచారం మేరకు విజయవాడ చెన్నై మార్గంలో కావలి ప్రాంతంలో కావలి పోలీసుల సహకారంతో ఎర్రచందనం అక్రమంగా రవాణాచేస్తున్న లారీని పట్టుకున్నారు. లారీనుండి ఒకడు పరావగా హర్యానాకుచెందిన వ్యక్తిని పట్టుకున్నారు. లారీని,2కోట్ల విలువైన 83 ఎర్రచందనం దుంగలను అటవీశాఖ కార్యాలయానికి తరలించామన్నారు. ఎర్రచం దనం అక్రమరవాణ చేస్తూ పట్టుబడిన ముగ్గురు స్మగ్లర్లకు ఐదేళ్ళజైలుశిక్ష, 6లక్షల రూపాయలు జరిమానా విధిస్తూ ఆర్ఎస్ఎస్ అదనపు జిల్లా జడ్జి జస్టీస్ నరసింహమూర్తి బుధవారం తీర్పునిచ్చారు. గతంలో ఎర్రచందనం తరలిస్తూ పట్టుబడ్డారు. వీరిపై కోర్టులో కేసు విచారణ సాగడంతో తమిళనాడు తిరువళ్ళూరుకు చెందిన పి.మురుగన్; ఎస్.సురేష్, ఎం,చిన్నపయ్యన్‌పై నేరం రుజువుకావడంతో న్యాయమూర్తి శిక్ష; జరిమానా విధించారు.

# పోర్టు ఆధారిత పరిశ్రమలతోనే అభివృద్ధి

## - భూములు ఇచ్చిన కుటుంబాలకు అండగా ఉంటాం - స్థానిక యువతకు ఇండో సోల్ పరిశ్రమలో - ఉద్యోగ నియామక పత్రాలు అందజేసిన కలెక్టర్ ఒ.ఆనంద్



**గుడ్లూరు (నెల్లూరు), ఆగస్టు 20, ప్రభాతవార్త :** పోర్టు ఆధారిత పరిశ్రమల రాకతో రామాయపట్నం పరిసర ప్రాంతాల రూపురేఖలు పూర్తిగా మారిపోతాయని, అందులో భాగంగానే భూములిచ్చిన రైతుల కుటుంబాలకు అండగా ఉంటూ, స్థానిక యువత ఉద్యోగాల కల్పనకు ప్రభుత్వం కృషి చేస్తుందని జిల్లా కలెక్టర్ ఒ.ఆనంద్ అన్నారు. బుధవారం ఉదయం గుడ్లూరు మండలం చేవూరు గ్రామంలో ఇండోసోల్ సోలార్ పరిశ్రమలో భూములు కోల్పోయిన కుటుంబాలకు , స్థానిక యువతకు 73 మందికి ఉద్యోగ నియామక పత్రాల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, జిల్లా కలెక్టర్ ఆనంద్, సబ్ కలెక్టర్ హిమవంశి, ఇండోసోల్ సిఓఓ బాలచందర్ కృష్ణన్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా కలెక్టర్ ఆనంద్ మాట్లాడుతూ రామాయపట్నం పోర్టు ఆధారిత పరిశ్రమలకు భూములిచ్చిన రైతు కుటుంబాల్లోని యువతీ యువకులకు పరిశ్రమల్లో ఉద్యోగాలు కల్పించి వారికి తోడుగా ఉన్నామని చెప్పడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశంగా చెప్పారు. గ్రామాల్లోని నిరుద్యోగ యువతకు శిక్షణ ఇచ్చి ఉద్యోగావకాశాలు కల్పించేందుకు సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. ఇండోసోల్, బిపిసిఎల్ కంపెనీల ఏర్పాటుతో పెద్దఎత్తున స్థానికులకు ఉద్యోగాలు లభిస్తాయన్నారు. ప్రస్తుతం ఇండోసోల్ కంపెనీలో స్థానికులకు 73 మందికి ఉద్యోగాలు కల్పిస్తున్నారని, ప్రతినెలా కూడా యువతకు శిక్షణ ఇచ్చి ఉద్యోగాలు కల్పించేలా కంపెనీ ప్రతినిధులతో మాట్లాడినట్లు చెప్పారు. కేవలం భూములు తీసుకున్న కుటుంబాల వారే కాకుండా ఇతరులకు కూడా వారి అర్హత మేరకు శిక్షణ ఇచ్చి ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించ నున్నట్లు చెప్పారు. ఉద్యోగాలు పొందిన వారందరూ కూడా తమ గ్రామాల్లోని మిగిలిన యువతకు అవగాహన కల్పించి వారంతా కూడా శిక్షణ పొంది ఉద్యోగాలకు వచ్చేలా ప్రోత్స హించాలని పిలుపునిచ్చారు. రామాయపట్నం పోర్టు ఆధారంగా అనేక పరిశ్రమలు ఏర్పాటు కానున్నాయని, దీంతో ఈ ప్రాంతం అన్ని రకాలుగా అభివృద్ధి సాధిస్తుందని కలెక్టర్ ఆశాభావం వ్యక్తం చేశారు. భూములు ఇచ్చిన కుటుంబాలకు ప్రభుత్వం తరపున ఎప్పుడూ తామంతా అండగా నిలుస్తామని ఈ సందర్భంగా కలెక్టర్ పేర్కొన్నారు. 2047 స్వ ర్ణాంధ్ర సాధనే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిర్దిష్టమైన ప్రణాళికతో ముందుకుసాగు తున్నారన్నారు. సీఎం అపార అనుభవం, దూర దృష్టితో రాష్ట్రంలో భారీగా పెట్టుబడులతో పరిశ్ర మలు ఏర్పాటుకు పెద్దపీట వేస్తున్నట్లు చెప్పారు. లోకేష్ బాబు పాదయాత్ర సమయంలో ఇక్కడి ప్రజలు పనులు లేక దూరప్రాంతాలకు వలసలు వెళ్లిపోతున్న విషయాన్ని, ప్రజల గమనించి ప్రకాశం మారుస్తామని ఇచ్చినట్లు గుర్తుచేశారు.

# కానిస్టేబుల్‌గా ఎంపికైన అభ్యర్థులకు మచిలీపట్నంలో సర్టిఫికెట్ వెరిఫికేషన్

**గన్నవరం(కృష్ణా), అగస్టు 20, ప్రభాతవార్త :** కృష్ణాజిల్లా, ఎన్‌టిఆర్ జిల్లాల్లో కానిస్టేబుల్‌గా ఎంపికయిన అభ్యర్ధులకు కృష్ణాజిల్లా కేంద్రమైన మచిలీపట్నంలో సర్టిఫికెట్ వెరిఫికేషన్ నిర్వహిస్తున్నట్లు జిల్లాఎస్పీ గంగాధరరావు తెలిపారు. రెండుజిల్లాలకు కలిపి మచిలీ పట్నంలోని జిల్లాపోలీస్ కార్యాలయంలో సర్టిఫికెట్ వెరిఫికేషన్ జరుపుతున్నామని, ఈనెల 22, 23 తేదీల్లో కృష్ణాజిల్లా అభ్యర్థులకు, 25,26 తేదీల్లో ఎన్‌టిఆర్‌జిల్లా అభ్యర్ధుల సర్టిఫికెట్‌ల పరిశీలన చేస్తామన్నారు. బుధవారం ఎస్పీ కార్యాలయంలో జరిగిన విలేకర్ల సమావేశంలో ఎస్పీ గంగాధరరావు మాట్లాడుతూ వెరిఫికేషన్‌కు వచ్చే అభ్యర్దులు వారి వద్ద ఉన్న స్టేజ్-1, స్టేజ్-2, స్టేజ్-3 ధరఖాస్తులతోపాటు, ఫార్మెట్‌లో ఉన్న విధంగా సర్టిఫికెట్‌లు, 3సెట్ల జిరాక్స్ కాపీలపై అటెస్టేషన్ చేయించుకుని వాటితోపాటు 3 పాస్‌పోర్ట్‌సైజ్ ఫోటోలను తీసుకు రావాలన్నారు. సర్టిఫికెట్ వెరిఫికేషన్ పోలీసులు సూచించిన తేదీలలో ఎంపికయిన అభ్యర్దులు తప్పనిసరిగా రావాలని, వెరిఫికేషన్‌కు రాని అభ్య ర్ధులను అనర్హులుగా ప్రకటిస్తామని తెలిపారు. పూర్తివివరాలకు సెల్- 9398 128969 సంప్రదించాలని జిల్లాఎస్పీ సూచించారు.

# పోలీసుల అదుపులో ఆరుగురు గంజాయి నిందితులు

## - 10 కెజిల గంజాయి స్వాధీనం - సోలాపూర్ నుండి పుట్టపర్తికి దిగుమతి

**కదిరి, ఆగస్టు 20 ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం గంజాయి నివారణకు కఠిన చర్యలు తీసుకున్నప్పటికీ క్షేత్రస్థాయిలో మాత్రం విచ్చల విడిగా గంజాయి సరఫరా చేస్తూ యువత దానికి బానిసై పక్కదోవ పడుతున్నారు. ఒకవైపు పోలీసులు వివిధ శాఖల అధికారులు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నప్పటికీ అందుకు భిన్నంగా కొందరు విచ్చల విడిగా గంజాయిని సేవిస్తున్నారు. మరోవైపు సోలార్ నుంచి పుట్టపర్తికి బిక్షగాళ్ల రూపంలో గంజాయి తీసుకొచ్చి కదిరి ప్రాంత వ్యక్తులకు అందజేసి తిరుగు ప్రయాణం అవుతున్నట్లు తెలుస్తోంది. దిగుమతి అయిన గంజాయిని కదిరికి ద్విచక్ర వాహనాలు, కార్లలో సరఫరా చేస్తున్నట్లు ఆరోపణలు గుప్పుమంటున్నాయి.

# కత్తి చూపి బెదిరింపు కేసులో నిందితులు అరెస్టు



**కోవూరు (నెల్లూరు), ఆగస్టు 20, ప్రభాతవార్త :** కోవూరులోని పడుగుపాడు పంచాయతీకి సంబంధించి ఒక బిల్డర్‌ను కత్తి చూపి బెదిరించిన కేసులో ప్రధాన నిందితురాలు నిడిగుంట అరుణ, ఆమెకు సహకరించిన పల్లం వేణు, అంకెం రాజా, శీరం ఎలీషలను బుధవారం తెల్లవారుజామున పోలీసులు అద్దంకి టోల్‌ప్లాజా వద్ద అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల సమాచారం మేరకు పడుగుపాడు ప్రాంతానికి చెందిన మునగ వెంకట మురళికృష్ణ మోహన్ వృత్తిరీత్యా బిల్డర్ 2010 సంవత్సరంలో పడుగుపాడు ప్రాంతంలో సాయి ఎన్‌క్లేవ్ పేరుతో 15 ప్లాట్లతో కూడిన ఒక అపార్ట్‌మెంట్ ను నిర్మించారు. అందులో 14 ప్లాట్లు అమ్ముడు కాగా 503 ప్లాట్‌ను తన దగ్గరే ఉంచుకున్నాడు. 2020 సంవత్సరంలో అదే ప్రాంతానికి చెందిన నిడిగుంట అరుణకు ఆ ప్లాట్‌ను 7500 రూపాయల అద్దెకు ఇవ్వడం జరిగింది. అనంతరం కొద్దిరోజులు అయిన తర్వాత అరుణ ఆ ప్లాట్ తనకే అమ్మాలని అడ్వాన్స్‌గా 3 లక్షలు చెల్లించి మిగిలిన 25 లక్షలను 2023 ఫిబ్రవరి 11వ తేది చెల్లించే విధగా అగ్రిమెంట్ కుదుర్చుకున్నారు. అయితే అప్పటి నుంచి ఆమె అద్దె చెల్లించకుండా డబ్బు కట్టకుండా వెంకట మురళికృష్ణ మోహన్‌ను ఇబ్బంది పెడుతూ వచ్చింది. ఈ మేరకు అతను ఆమెపై కోర్టులో కేసు కూడా వేశాడు. ఈ పరిస్థితుల్లో 2024 నవంబర్ నెల 1వ తేది నిడిగుంట అరుణ తన అనుచరులైన పల్లం వేణు, అంకెం రాజా, శీరం ఎలీషలతో కలిసి వెంకట మురళికృష్ణ మోహన్‌ను బెదిరించి ప్లాట్‌కు సంబంధించి 5 లక్షల రూపాయలు చెల్లించినట్లు ఒక ఒప్పంద పత్రాన్ని రాయించుకుని అతను సంతకం చేయకపోతే చంపేస్తానని వారు బెదిరించారు. ఈ మేరకు వెంకట మురళికృష్ణ మోహన్ కోవూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

# విజయవాడలో ఆరంభమైన యువ ఆంధ్ర ఛాంపియన్‌షిప్ -2025 పోటీలు

## టోర్నమెంట్‌లో తలపడనున్న 8 జట్లు..

**విజయవాడ , ఆగస్టు20,ప్రభాతవార్తప్రతినిధి:** విజయవాడ చెన్నుపాటి రామకోటయ్య ఇండోర్ స్టేడియంలో యువ ఆంధ్ర ఛాంపియన్‌షిప్-2025 ఘనంగా ప్రారంభమైంది. రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ...కబడ్డీ వంటి స్వదేశీ ఆటలకు ప్రోత్సాహం అందించడం, యువ ప్రతిభను వెలికితీయడం ఈ ఛాంపియన్‌షిప్ ప్రధాన ఉద్దేశ్యమన్నారు.భవిష్యత్తులో తెలుగు కబడ్డీ లీగ్‌కి చేరే క్రీడాకారులకు ఇది ఒక మంచి వేదిక" అని తెలిపారు. కబడ్డీనే కాదు, ఏ ఆటైనా,క్రీడైనా ప్రభుత్వం వారిని అంతర్జాతీయ స్థాయికి చేరుకునే దిశలో ప్రోత్సహిస్తుందన్నారు.ఈ టోర్నమెంట్‌లో 8 జట్లు పోటీపడుతున్నాయి.

# అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే వ్యవహారంలో పార్టీ అధిష్ఠానం సీరియస్

## దగ్గుబాటిపై పార్టీ అధిష్టాన వర్గానికి ఫిర్యాదులు

**అనంతపురం, ఆగస్టు 20 (ప్రభాతవార్త బ్యూరో)** అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుబాటి వెంకట ప్రసాద్ పై తెలుగుదేశం పార్టీ అధిష్టాన వర్గం సీరియస్ అయింది. అనంతపురం నియోజకవర్గంలో గత కొన్ని నెలలుగా జరుగుతున్న వివాదాలు, తాజాగా జూనియర్ ఎన్టీఆర్ ను, ఆయన తల్లిని దుర్భాషలాడుతూ అనంతపురం ఎమ్మెల్యే కు సంబంధించి ఆడియో వైరల్ అయిన సంఘటనపై తెలుగుదేశం పార్టీ అధిష్టానవర్గం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నట్లు తెలియ వచ్చింది. ఒకవైపు జూనియర్ ఎన్టీఆర్ అభిమానులు నిరసనలకు దిగుతుండడం మరోవైపు అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే వ్యవహార శైలి పార్టీ కార్యకర్తల్లో చర్చనీయాంశం కావడం నేతలకు తలనొప్పిగా మారింది. ఈ నేపథ్యంలో బుధవారం పార్టీ ముఖ్యులు కలవాలని ఆదేశించడంతో అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుబాటి వెంకటప్రసాద్, అనంతపురం మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్ చౌదరి వేరువేరుగా సీఎం చంద్రబాబు నాయుడు, ఇతర పార్టీ పెద్దలను కలిసినట్లు సమాచారం.. జూనియర్ ఎన్టీఆర్ సంబంధించి ఆడియో వైరల్ పైన, అనంతపురం అసెంబ్లీ నియోజకవర్గంలో నెలకొన్న వివిధ సంఘటన పైన సీఎం చంద్రబాబు నాయుడు ప్రత్యేకంగా ఎమ్మెల్యే దగ్గుబాటిపై సీరియస్ అయినట్లు తెలియ వచ్చింది. ఇదే సమయంలో మంగళవారం రోజు టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు ను అనంతపురం మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ చౌదరి ప్రత్యేకంగా కలిసి అనంతపురం ఎమ్మెల్యే దగ్గుబాటి ప్రసాద్ వ్యవహార శైలిపై ఫిర్యాదు చేసినట్లు తెలియ వచ్చింది.. ఎమ్మెల్యే కొందరిని బెదిరించారని, మూడు, నాలుగు ఆడియో రికార్డులు కూడా అందజేసినట్లు తెలియ వచ్చింది.

# ధవళేశ్వరం వద్ద పెరుగుతున్న వరద ఉధృతి

## ప్రజలు అప్రమత్తంగా ఉండాలి :కలెక్టర్ ప్రశాంతి

**ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా బ్యూరో ఆగస్టు 20 (ప్రభాతవార్త):** ఎగువ రాష్ట్రల్లో కురుస్తున్న భారీ వర్షాలకు గోదావరి నదికి వరద ఉధృతంగా వచ్చి చేరుతుందని తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు.బుధవారం సాయంత్రం 8 గంటల నాటికి భద్రాచలం వద్ద నీటిమట్టం 47.4 అడుగులు ఉందని పేర్కొన్నారు. ధవళేశ్వరం వద్ద రాత్రి 8 గంటలకు ఇన్, ఔట్ ఫ్లో 8.28 లక్షల క్యూసెక్కులు ఉందని, రేపటిలోపు మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేసే అవకాశం ఉందన్నారు.ప్రభావితం చూపే తూర్పుగోదావరి, అంబేద్కర్ కోనసీమ, కాకినాడ, ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాల్లోని మండల అధికారులను అప్రమత్తం చేసినట్లు తెలిపారు.ఎప్పటికప్పుడు వరద ప్రవాహాన్ని పర్యవేక్షి స్తూ అధికారులకు తీసుకోవాల్సిన చర్యలపై సూచనలు

## బాధ్యతగా పనిచేయండి : గుంతకల్లులో రైల్వే జిఎం

**గుంతకల్లు రైల్వే, ఆగస్టు 20,ప్రభాతవార్త** వృత్తి పట్ల నిబద్ధత,బాధ్యత,అంకితభావంతో పనిచేసి నిర్దేశిత లక్ష్యసాధనకు కృషి చేయాలని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాత్సవ రైల్వే యంత్రాంగాన్ని కోరారు. రాయలసీమలోని గుంతకల్లు రైల్వే డివిజన్‌లో బుధవారం తిరుపతి-రేణిగుంట-కడప-గుంతకల్లు సెక్షన్‌లో విస్తృత భద్రతా తనిఖీలు చేశారు. అనంతరం ఆయన గుంత కల్లుకు చేరుకుని సమీక్షా సమావేశం నిర్వహించారు. వివిధ విభాగాల పనితీరును సమీక్షించారు. డివిజన్ పరిధిలో అమృత్ భారత్ పథకంలో భాగంగా చేపట్టిన స్టేషన్లలో జరుగుతున్న పునర్నిర్మాణ పనులను మౌలిక సదుపాయాల కల్పన, ప్రయాణికుల, ట్రాఫిక్ సౌకర్యాల కల్పన తదితర అంశాలను సమీక్షించారు. అనంతరం అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నిర్మించిన డివిజనల్ కంట్రోల్ కార్యాలయాన్ని సందర్శించారు. కంట్రోల్ కార్యాలయం పనితీరు విధానాన్ని అడిగి తెలుసుకున్నారు.

## గ్రామీణాభివృద్ధికి ఉపాధి హామీ పథకం పరిధిలో పూర్తి స్థాయిలో పనులు - సీఎం చంద్రబాబునాయుడు

**విజయవాడ,ఆగస్టు20,ప్రభాతవార్తప్రతినిధి:** గ్రామీణాభివృద్ధికి ఉపాధి హామీ పథకం పరిధిలో పూర్తి స్థాయిలో పనుల చేపడతామని ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు తెలిపారు. సచివాలయంలో బుధవారం నిర్వహించిన నరేగా పనులు,పెండింగ్ బిల్లుల చెల్లింపు తదితరఅంశాలపై నిర్వహించిన సమావేశంలో సీఎం చంద్రబాబు చర్చించారు.గత ప్రభుత్వ హయాంలో నిలిపివేసిన నరేగా బిల్లులన్నింటిని చెల్లిస్తున్నామన్నారు.2014- 19 మధ్య కాలంలో జరిగిన ఉపాధి హామీ పథకం(నరేగా) పనులకు బిల్లుల చెల్లింపు విషయంలో కూటమి ప్రభుత్వం చేసిన ప్రయత్నాలు సత్ఫలితాలను ఇస్తున్నాయి. వైసీపీ ప్రభుత్వం కుట్ర పూరితంగా నాటి తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో జరిగిన నరేగా పనులకు బిల్లులు చెల్లించలేదు. బిల్లులు ఇవ్వకుండా వర్కులను క్లోజ్ చేసింది. 2024లో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం దీనిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టింది. కేంద్ర ప్రభుత్వ పెద్దలతో సీఎం చంద్రబాబు ఈ విషయంపై పలు మార్లు చర్చించి నిధుల చెల్లింపులకు ఉన్న అడ్డంకులను తొలగించారు. ఇందులో భాగంగా వైసీపీ ప్రభుత్వం క్లోజ్ చేసిన 3,54,177 పనులు ప్రస్తుతం ఆన్ గోయింగ్ వర్కులుగా మార్పుచేశారు. కేంద్రం ఇచ్చిన ఈ వెసులుబాటుతో పనులు చేసిన వారికి బిల్లులు చెల్లింపు చేయడం ద్వారా న్యాయం చేసే అవకాశం ఏర్పడింది. ఈ ప్రక్రియపై సీఎం చంద్రబాబు సమీక్షా సమావేశంలో అధికారులకు మార్గనిర్దేశనం చేశారు. మొత్తం రూ.179.38 కోట్ల బిల్లుల చెల్లింపులకు సంబంధించి 5.54 లక్షల పనులను ఆన్ గోయింగ్ వర్కులుగా నమోదు చేశారు. దీనికి సంబంధించి కసరత్తు పూర్తి చేసిన పంచాయతీ రాజ్ శాఖ రూ.179 కోట్లకు గాను రూ.145 కోట్లను ప్రస్తుతం అప్‌లోడ్ చేసింది. ఈమొత్తానికి సంబంధించి ఆర్థిక శాఖ ఎన్ఓసికి నిధులు విడుదల చేసింది. పనులు చేసిన చిన్న కాంట్రాక్టర్లు, గ్రామస్తుల అకౌంట్లలో 23వ తేదీన ఈ మొత్తం నిధులు జమకానున్నాయి. మిగిలిన మొత్తానికి సంబంధించి పలు సాంకేతిక కారణాలతో చెల్లింపు ప్రక్రియ నిలిచింది. అవసరమైన ఎస్టిమేషన్ లేకపోవడం, ఖర్చు చూపకపోవడం, ఆ పనిచేసిన ప్రాంతాలు పట్టణ ప్రాంతంలో విలీనం కావడం వంటి కారణాలతో ఆయా పనుల బిల్లుల చెల్లింపు ప్రక్రియ పెండింగ్‌లో ఉందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు.

## చెంచు గిరిజనుల అభివృద్ధికి రూ.10కోట్లు నిధులు మంజూరు

### ఆత్మకూరు పట్టణంలో నన్నారి కేంద్రం ప్రారంభం

**ఆత్మకూరు,ఆగస్టు20,ప్రభాతవార్త:** నల్లమలలో నివసించే చెంచు, గిరిజనుల అభివృద్ధికి ఐటిడిఏ శాఖ ద్వారా రూ.10కోట్ల నిధులు మంజూరు చేయడం జరిగిందని ఆంధ్రప్రదేశ్ గిరిజన, శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి, శ్రీశైలం నియోజకవర్గం ఎంఎల్ఏ బుడ్డా రాజశేఖరరెడ్డిలు అన్నారు. బుధవారం ఆత్మకూరు పట్టణంలోని వెంగళరెడ్డి నగర్ కాలనీలో నన్నారి కేంద్రాన్ని ప్రారంభించారు. ముందుగా మంత్రిని మర్యాద పూర్వకంగా నియోజకవర్గం ఎంఎల్ఏ బుడ్డా రాజశేఖరరెడ్డి, జిల్లా కలెక్టర్ రాజకుమారి ఘనియా ఆహ్వానించారు. శిలాఫలకం ప్రారంభించి నన్నారి తయారీ విధానం చెంచు గిరిజనులతో మంత్రి అడిగి తెలుసుకున్నారు. నల్లమల అడవిలో నివశించే చెంచు గిరిజనుల స్థితిగతులపై చెంచు గిరిజనులతో ముఖాముఖిగా మాట్లాడారు. అక్కడే చేతివృత్తులతో తయారైన చేసిన సంచులు, ఇతర వస్తువుల కేంద్రం ప్రారంభించారు. గిరిజనులకు మంచినీటి మౌలిక సదుపాయాలు కల్పించేందుకు నూతన వాటర్ ప్లాంట్ ప్రారంభోత్సవం చేశారు. అనంతరం ప్రభుత్వ చేసిన విలేకరుల సమావేశంలో రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్‌డిఏ ప్రభుత్వ అధికారంలోకి వచ్చాక మహిళలకు పెద్దపీట వేసిన ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు దక్కిందన్నారు. గిరిజనుల అభివృద్ధి కోసం నంద్యాల జిల్లా శ్రీశైలం నియోజకవర్గ పరిధిలోని 1500ల మంది కుటుంబాలకు జీవనోపాధి కల్పించే విధంగా ప్రధానమంత్రి జనమదన్ యోజన పథకం క్రింద రూ.25లక్షలతో తయారు కేంద్రం ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం కృషి చేసిందని అన్నారు. చెంచు గిరిజనులు తన ఉపాధి కోసం అడవి ప్రాంతంలో నన్నారి గడ్డలు సేకరించి మూడు రోజుల పాటు తయారు చేసే ఈ విదానాన్ని కేవలం ఒకరోజులోనే తయారు చేసే విదంగా అవకాశం కల్పించారు.

## ఉద్యోగుల సమస్యల సానుకూల పరిష్కారానికి అన్నివిధాలా ప్రయత్నం చేస్తాం - ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్

**విజయవాడ,ఆగస్టు20,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో పనిచేస్తున్న వివిధ ప్రభుత్వ ఉద్యోగులు,పెన్షనర్ల సమస్యల సానుకూల పరిష్కారానికి అవసరమైన ప్రయత్నం చేయడం జరుగుతుందని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ స్పష్టం చేశారు.రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వారి ఆదేశాల మేరకు రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించిన పలు అంశాలపై చర్చించేందుకు బుధవారం రాష్ట్ర సచివాలయంలో సిఎస్ అధ్యక్షతన జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశం జరిగింది.ఈసమావేశంలో వివిధ ఉద్యోగ సంఘాల ప్రతినిధులు ఉద్యోగులకు సంబంధించి పెండిగ్ డిఏలు,పిఆర్సి బకాయిలు,ఆర్జిత సెలవుల నగదు చెల్లింపు బకాయిలు తదితర అంశాలను సిఎస్ దృష్టికి తెచ్చారు.అనంతరం సిఎస్ మాట్లాడుతూ ఈప్రభుత్వం వచ్చాక మొదటి సారి జరిగిన ఈ జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశంలో ఉద్యోగ సంఘాల ప్రతినిధులు తెలిపిన అన్ని అంశాలను నమోదు చేయడం జరిగిందని వాటన్నిటిని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్ళి సకాలంలో పరిష్కారం అయ్యే విధంగా ప్రయత్నం చేయడం జరుగుతుందని సిఎస్ విజయానంద్ ఉద్యోగ సంఘాలకు చెప్పారు. సర్వీసెస్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్.ఎస్.రావత్,వైద్య ఆరోగ్య ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబు,రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయలక్ష్మి,టిఆర్ అండ్ బి ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ దండే, పిఆర్ అండ్ ఆర్డి ముఖ్య కార్యదర్శి శశిభూషణ్ కుమార్,ఆర్థిక,ప్రణాళిక శాఖల ముఖ్య కార్యదర్శి పియూష్ కుమార్,విద్యాశాఖ కార్యదర్శి కె.శశిధర్,వ్యవసాయ శాఖ డైరెక్టర్ డిల్లీ రావు,కళాశాల విద్యా డైరెక్టర్ భరత్ గుప్త,ఆర్థిక శాఖ సంయుక్త కార్యదర్శి గౌతమ్ అల్లాడ తదితర అధికారులు పాల్గొన్నారు.అలాగే ఉద్యోగ సంఘాల నుండి ఏపి ఎన్జిజిఓ అధ్యక్షులు విద్యాసాగర్,ఏపి సచివాలయ ఉద్యోగుల సంఘం జనరల్ సెక్రటరీ మోహన్,రాష్ట్ర టీచర్స్ యూనియన్ అధ్యక్షులు శ్రీనివాస్ ఉన్నారు.

## ఆక్వా రంగానికి అన్ని విధాల అండగా నిలుస్తాం - మంత్రి నారా లోకేష్


### -సంక్షోభాన్ని అవకాశంగా మలుచుకుందాం..

**విజయవాడ,ఆగస్టు20,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో ఆక్వా రంగానికి అన్ని విధాల అండగా నిలుస్తామని, సంక్షోభాన్ని అవకాశంగా మలుచుకుందామని మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. అమెరికా ప్రతీకార సుంకాల నేపథ్యంలో రాష్ట్రంలో ఆక్వా రంగం ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించేందుకు ఉండవల్లి నివాసంలో మంత్రి లోకేష్, వ్యవసాయ, మత్స్య శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు నేతృత్వంలో ఆక్వా కల్చర్ అడ్వైజరీ కమిటీ సమావేశమైంది. ఈ భేటీలో ఆక్వా ఎగుమతి దారులు, ప్రాసెసింగ్ యూనిట్ల యజమానులు, రైతులు, ఫీడ్ కంపెనీ, హేచరీస్ యజమానులు, అధికారులు పాల్గొన్నారు. సమస్యల పరిష్కారం కోసం సలహాలు, సూచనలు అందించారు. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో వేలాది మంది ఆక్వారంగంపై ఆధారపడి ఉన్నారు. ఈ రంగం యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తోంది. ఇప్పటికే ఆక్వా ఎగుమతులపై అమెరికా 25శాతం సుంకాలను విధించింది. మరో 25 శాతం సుంకాలు పెంచే ప్రమాదం కూడా పొంచి ఉంది. ఈ నేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, ఆక్వా ఇండస్ట్రీ కలిసి సమస్యల పరిష్కారం కోసం కృషిచేద్దాం. జీవిఎల్ ఢిల్లీ పర్యటనలోనూ ఆక్వా రంగం ఎదుర్కొంటున్న సమస్యలను కేంద్ర పెద్దలకు వివరించడం జరిగింది. రష్యా, యూరోపియన్ యూనియన్ మార్కెట్ పై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. ఉత్పత్తి వ్యయం తగ్గించడంతో పాటు పవర్ టారిఫ్ లపైనా చర్చించాల్సిన అవసరం ఉంది. సంక్షోభాన్ని అవకాశంగా మలుచుకుందామని, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గారు కూడా ఈ అంశంపై ప్రత్యేక దృష్టిసారించారని అన్నారు.వ్యవసాయ, మత్స్యశాఖ మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ.. కేవలం విదేశీ ఎగుమతులపైనే ఆధారపడకుండా దేశీయంగా రొయ్య వినియోగం పెంచేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రత్యామ్నాయంగా ఇతర దేశాల మార్కెట్ పైనా దృష్టిసారించాల్సిన అవసరమన్నారు.

# స్థానికసంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ విజయదుందుభి మోగించాలి

### ఆర్మూర్‌కు ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలకు త్వరలో సిఎం శంకుస్థాపన: మహేష్‌కుమార్

**హైదరాబాద్ ఆగస్టు 20,ప్రభాతవార్త:** కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణలో చేపడుతున్న అభివృద్ధి సంక్షేమంను ప్రజలకు వివరించి వారి మద్దతు కూడగట్టుకొని స్థానిక సంస్థల ఎన్నికలలో విజయదుందిభి మ్రోగించాలని వందకు వంద సర్పంచ్‌లు,ఎంటిపిసిలు,జడ్పీటిసిలు, ఎంపిపిలు, జడ్పీచైర్మన్లు కైవసం చేసుకోవాలని టిపిసిసి అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్ పిలుపునిచ్చారు. బుధవారం గాంధీభవన్‌లో ఆర్మూర్ ఇంచార్జ్ వినయ్ రెడ్డి పార్టీ ముఖ్య కార్యకర్తలతో టిపిసిసి చీఫ్ సమావేశమై స్థానిక సంస్థల ఎన్నికలతో ప్రతి బూత్ లెవల్ లో పార్టీని పటిష్ఠంగా ముందుకు తీసుకొని పొయే అవకాశం ఉంటుందని దాని కోసం కృషిచేయాలని ఆయన మార్గనిర్ధేశనం చేశారు. ఆర్మూర్ నియోజక వర్గంలో స్థానిక సంస్థల అన్నింటనిగెలవాలని అందుకు క్షేత్రస్థాయి లో పనిచేయాలని ప్రజలకు చేరువగా ఉంటూ వారి సమస్యలను పరిష్కరించాలని ఆయనకోరారు. కార్యకర్తలు, నాయకులు కలిసికట్టుగా కష్టపడి పని చేసి సర్పంచ్, ఎంపిటిసి, జడ్పీటీసీ, జిల్లా పరిషత్, మండల పరిషత్ లు అన్ని కాంగ్రెస్ పార్టీ గెలిచే విధంగా పకడ్బందీగా ప్రణాళికతో ముందుకు పోవాలని అన్నారు. ఆర్మూర్ నియోజక వర్గాన్ని నా స్వంత నియోజక వర్గంగా చూసుకుంటా అని చెప్పారు. కార్యకర్తలకు, నాయకులకు ఎలాంటి సమస్యలు వచ్చినా కలిసికట్టుగా పని చేసుకొని పరిష్కరించుకుందామని చెప్పారు. సమస్యలు ఉంటే ఇంచార్జ్ మంత్రి దృష్టికి తీసుకెళితే నేనే వెంట ఉండి పని చేసి పెడతా అని అన్నారు. ఆర్మూర్‌కు ప్రభుత్వం నుంచి ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల మంజూరు అయిందని త్వరలోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా శంకుస్థాపన చేయనున్నామని అన్నారు. 42 శాతం బిసి రిజర్వేషన్లు విద్య, ఉద్యోగ,రాజకీయ రంగాలలో అమలు అయ్యేందుకు ప్రభుత్వం అన్ని రకాలుగా కృషి చేసిందని అన్నారు. బీజేపీ కేంద్రంలో అటు బిల్లు అమలు కాకుండా ఇటు ఆర్డినెన్స్ అమలు కాకుండా అడ్డు పడుతుందని బిజెపి, బిఆర్ ఎస్ రెండు పార్టీలు కుమ్మక్కు అయ్యి బిసి రిజర్వేషన్లు అమలు కాకుండా అడ్డుపడుతున్నాయని ఇది ప్రజలు గమనించాలని ఆయన అన్నారు.కులాల వాటా ప్రకారం రిజర్వేషన్లు అమలు చేయాలని రాహుల్ గాంధీ గారు మొట్టమొదట ఉద్యమాన్ని లేవనెత్తారని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంత్రివర్గం ఎంతో కృతనిశ్చయంతో బిసి రిజర్వేషన్లు అమలు చేసేందుకు అన్ని రకాలుగా చర్యలు తీసుకున్నారని అందుకోసం వారికి ధన్యవాదాలు తెలుపుతున్నామని అన్నారు. దేశంలో ఎక్కడ లేని విధంగా అనేక సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తున్నామని వీటిని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని అన్నారు. రేషన్ కార్డులు, సన్న బియ్యం, ఇందిరమ్మ ఇళ్లు, 200 యూనిట్ల కరెంట్ ఫ్రీ, ఆర్టీసీ లలో మహిళలకు ఉచిత రవాణా, 500 రూపాయలకు గ్యాస్, 2 లక్షల రూపాయల వ్యవసాయ రుణాల మాఫీ, ఎకరాకు 12 వేల రైతు భరోసా, రెసిడెన్షియల్ స్కూల్స్, స్పోర్ట్స్ పాలసీ, ఫోర్త్ సిటీ లాంటి అనేక విప్లవాత్మక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టామని ఇవన్నీ కార్యకర్తలు, నాయకులు ప్రజల్లోకి విస్తృతంగా ప్రచార కార్యక్రమాలు చేపట్టాలని ఆయన సూచించారు. ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీల అమలులో ఏ ప్రభుత్వం చేయనంత వేగంగా పకడ్బందీగా చేస్తున్న అంశాలలో ప్రచారం చేసి స్థానిక సంస్థల ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించేలా చూడాలని అన్నారు.



# రాజీవ్‌కు ఘనంగా నివాళులు

### ఎన్ఎస్‌యుఐ రక్తదాన శిబిరంప్రారంభించిన టిపిసిసి చీఫ్

**హైదరాబాద్,ఆగస్టు 20,ప్రభాతవార్త:** రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా బుధవారం గాంధీభవన్‌లో మాజీప్రధాన మంత్రి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, ఎమ్మెల్యే దానం నాగేందర్, కార్పొరేషన్ చైర్మన్ ఫహీం ఖురేషి, మాజీ ఎంపీ వి హనుమంతరావు.తదితరులు పాల్గొని రాజీవ్ చేసిన కృషి కారణంగానే దేశంలో సాంకేతిక విప్లవం అభివృద్ధి చెందినందని అన్నారు. టపిసిసి చీప్ మహేష్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ దేశంలో కంప్యూటర్ యుగంలోకినడిపారని,నవోదయ విద్యాలయం భావనతో విద్యలో మెరుగైనపద్ధతులు తీసుకొచ్చారని కొనియాడారు. ఎన్ఎస్‌యుఐ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరంను టిపిసిసి చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్ ప్రారంభించారు.

# మద్యం షాపుల టెండర్లకు ఆహ్వానం

### దరఖాస్తు ఫీజు రూ.3 లక్షలు

**హైదరాబాద్,ఆగస్టు20, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. మద్యం దుకాణాలకు టెండర్లను ఆహ్వానించింది. డిసెంబర్ 1, 2025 నుంచి నవంబర్ 30, 2027 వరకు లైసెన్స్ కాలం ఉంటుందని, ఈ సారి దరఖాస్తు ఫీజు రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షలకు పెంచుతూ నోటిఫికేషన్ విడుదల చేశారు. మద్యం దుకాణాల కేటాయింపుల్లో గౌడకులస్తులకు 15 శాతం,ఎస్సీ సామాజిక వర్గాలకు 10 శాతం, ఎస్టీలకు 5 శాతం దుకాణాలను కేటాయించనున్నారు.తెలంగాణ ప్రభుత్వం కొత్త మద్యం పాలసీని ప్రకటించింది.2025-2027 సంవత్సరానికి రాష్ట్రవ్యాప్తంగా మద్యం దుకాణాల లైసెన్సుల కోసం ఎక్సైజ్‌శాఖ ఒక నోటిఫికేషన్‌ను విడుదల చేసింది.తెలంగాణలోని 2620 మద్యం షాపుల కు లైసెన్స్ కొరకు ఎక్సైజ్ శాఖ దరఖాస్తులను ఆహ్వానిస్తూ నోటిఫికేషన్ విడుదల చేసింది. ప్రస్తుతం ఉన్న దుకాణాల గడువు నవంబర్ 30వ తేదీతో ముగియనుంది. ఈ కొత్త లైసెన్సుల గడువు డిసెంబర్ 1, 2025 నుంచి నవంబర్ 30, 2027 వరకు ఉంటుంది. ఈసారి దరఖాస్తు రుసుమును రెండు లక్షల నుంచి మూడు లక్షల రూపాయలకు పెంచారు. దుకాణాల లైసెన్సులను వార్షిక ఎక్సైజ్ పన్ను ఆధారంగా లాటరీ ద్వారా కేటాయించనున్నారు.ఈ మద్యం పాలసీలో రాష్ట్ర ప్రభుత్వం సామాజిక న్యాయానికి ప్రాధాన్యత ఇచ్చింది. గౌడ సామాజిక వర్గానికి 15 శాతం, ఎస్సీలకు 10 శాతం, ఎస్టీలకు 5 శాతం దుకాణాలను రిజర్వ్ చేశారు. ఇలా మొత్తం 30 శాతం రిజర్వేషన్లకు కేటాయించారు. వీటితో పాటు.. భాగస్వామ్య సంస్థలు, కంపెనీలు కూడా దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం కల్పించారు. అంతేకాకుండా ఒకే దరఖాస్తుదారుడు ఒక దుకాణానికి కంటే ఎక్కువ దరఖాస్తులు సమర్పించేందుకు అవకాశం కల్పించారు.మొత్తం ఆరు స్లాబులుగా ఈ లైసెన్సుల ఫీజులను నిర్ణయించారు. ఇది 2011 జనాభా లెక్కల ఆధారంగా రూపొందించబడింది. ఐదు వేల లోపు జనాభా ఉన్న ప్రాంతాల్లో వార్షిక ఎక్సైజ్ పన్ను రూ. 50 లక్షలుగా, 5,000 నుండి 50,000 మధ్య జనాభా ఉన్నచోట రూ. 55 లక్షలుగా, 50,000 నుంచి ఒక లక్ష వరకు ఉన్న ప్రాంతాలకు రూ. 60 లక్షలుగా, ఒక లక్ష నుంచి ఐదు లక్షల మధ్య జనాభా ఉన్న ప్రదేశాల్లో రూ. 65 లక్షలుగా నిర్ణయించారు. ఐదు లక్షల నుంచి 20 లక్షల వరకు జనాభా ఉంటే రూ. 85 లక్షలు, ఇక 20 లక్షల పైన జనాభా ఉన్న నగరాల్లో వార్షిక ఫీజు రూ. కోటి పది లక్షలుగా ఖరారు చేశారు.లాటరీ ద్వారా దుకాణాలను పొందినవారు వార్షిక లైసెన్స్ రుసుమును ఆరు సమానవాయిదాల్లో చెల్లించాల్సి ఉంటుంది. 25 నెలల లైసెన్స్ కాలానికి గాను, పావు వంతు (25 శాతం)కు సమానమైన బ్యాంక్ గ్యారెంటీని ప్రభుత్వానికి సమర్పించాలి. జీహెచ్ఎంసీ, నగర పంచాయతీ పరిధిలో మద్యం దుకాణాలను ఉదయం 10 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు, గ్రామీణ ప్రాంతాల్లో ఉదయం 10 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు మాత్రమే తెరవడానికి అనుమతి ఉందని అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు.

# ఐ సెట్ కౌన్సెలింగ్‌కి 2065 మంది దరఖాస్తు

### 28 వరకు స్లాట్ బుకింగ్‌కి: సాంకేతిక విద్య శాఖ కమిషనర్ శ్రీదేవసేన

**హైదరాబాద్, ప్రభాతవార్త, ఆగస్టు 20:** రాష్ట్రంలోని ఎంబిఏ, ఎంసిఏ సీట్ల భర్తీ కోసం నిర్వహించిన ఐ సెట్-2025 కౌన్సెలింగ్ బుధవారం నుంచి ప్రారంభం కాగా.. మొదటి రోజు 2065 మంది ప్రాసెసింగ్ ఫీజు చెల్లించి స్లాట్ బుక్ చేసుకున్నట్టు సాంకేతిక విద్య శాఖ కమిషనర్ శ్రీదేవసేన ప్రకటనలో తెలిపారు. ఈ నెల 28 వరకు ప్రాసెసింగ్ ఫీజు చెల్లించి స్లాట్ బుక్ చేసుకోవడానికి అవకాశం కల్పించారు. ఈ నెల 22 నుంచి 29 వరకు సర్టిఫికెట్ వెరిఫికేషన్‌ను నిర్వహించడానికి షెడ్యూల్‌ను జారీ చేశారు. అయితే ఈ నెల 27 ఆదివారం కావడంతో ఆ రోజు సర్టిఫికెట్ వెరిఫికేషన్ ఉండదని ప్రకటించారు. ఈ నెల 25 నుంచి 30 వరకు వెబ్ ఆప్షన్లు ఇవ్వడానికి అవకాశమిచ్చారు. వెబ్ ఆప్షన్లు ఇచ్చిన వారికి సెప్టెంబర్ 2న సీట్ల కేటాయింపు చేయనున్నారు.

# ప్రజాస్వామ్యయుతంగా వ్యవహరిస్తున్నా ఎందుకు హైకోర్టుకు వెళ్లడం?

### పిసిఘోష్ నివేదికపై ఎందుకు కెసిఆర్, హరీష్ భయపడాలి: ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

**హైదరాబాద్,ఆగస్టు 20,ప్రభాతవార్త:** మా ప్రభుత్వం అత్యంత ప్రజాస్వామ్యయుతంగా వ్యవహరిస్తోందని,పిసిఘోష్ నివేదిక అంశంపై కెసిఆర్ హరీష్ రావు హైకోర్టుకు ఎందుకు వెళ్లారని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రశ్నించారు. బుధవారం ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సిఎల్‌పిలో విలేఖరులతో మాట్లాడుతూ కాళేశ్వరం అవినీతి పైన పిసి ఘోష్ ఇచ్చిన కమిషన్ రిపోర్ట్ సారాంశం ప్రజలకు తెలియకుండా రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం వద్దకు వెళ్లారని అన్నారు.నివేదిక అసెంబ్లీలో పెట్టకముందే హైకోర్టును ఆశ్రయించడం వల్ల ప్రజలకు నీళ్ళు ఏవో పాలు ఏవో తెలియకుండా పోతుందని అన్నారు. అసెంబ్లీ ముందు నివేదిక ను ఉంచుతామని ఇప్పటికే క్యాబినెట్ తేల్చి చెప్పిందని ఆయన గుర్తుచేశారు. అసెంబ్లీలో సమగ్రంగా చర్చించి నతర్వాత నివేదిక పైన ప్రభుత్వం చర్యలు చేపడుతుందని ఆయన అన్నారు. కాళేశ్వరం కమిషన్ ను చూసి కెసిఆర్, హరీష్ రావు ఎందుకు భయపడుతున్నారని ఆయన ప్రశ్నించారు. కాళేశ్వరం కమిషన్ పైనహైకోర్టును ఆశ్రయించడంతోనే కెసిఆర్ హరీష్ రావు తాము తప్పు చేశామని ఒప్పుకున్నట్లైందని భాష్యం చెప్పారు. కాళేశ్వరం కమిషన్ కూడా స్వయంగా కోర్టు లాంటిదే.. కమిషన్ ఛైర్మన్ కూడా స్వయంగా మాజీ న్యాయమూర్తి అని ఆయన అన్నారు.కాళేశ్వరం కమిషన్ లేవనెత్తిన అంశాలపైన సమాధానం చెప్పే దమ్ము లేక తప్పించుకోవడానికే కోర్టుకు వెళ్లారని విమర్శించారు. కాళేశ్వరంలో జరిగిన అనేక అవకతవకలను కమిషన్ స్పష్టం చేసిందని ఆయన తెలిపారు. దాదాపు ఆరు నెలల పాటు అనేక మందిని విచారించిన తర్వాతే కమిషన్ రిపోర్ట్ ఇచ్చింది.ఇంజనీర్ల ను కాదని కెసిఆర్ సొంతంగా నిర్ణయాలు తీసుకున్నారని ఇంజనీర్ల అఫిడవిట్ ఆధారంగా కమిషన్ తేల్చిందని ఆయన చెప్పారు. హరీష్ రావు, ఈటెల రాజేందర్ కూడా అడ్డగోలుగా వ్యవహరించిందని కమిషన్ స్పష్టం చేసిందని శ్రీనివాస్ ఆరోపించారు. తమ తప్పులను కమిషన్ ఎత్తి చూపడంతో కెసిఆర్ , హరీష్ రావు ఆత్మరక్షణలో పడ్డారని ఆయన అన్నారు. యూరియా కేటాయింపులు ఎవరి పరిధిలో ఉంటాయో కెటిఆర్‌కు తెలియదా అని ఆది ప్రశ్నించారు. తెలంగాణ ప్రభుత్వం 9.80 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం ఉందని కేంద్రానికి ఇండెంట్ పెట్టిందని ఈ ఆగస్టు వరకు 8.30 మెట్రిక్ టన్నులు రావాలి, కాని 5.40 వేల మెట్రిక్ టన్నులు మాత్రమే వచ్చిందని వివరించారు. యూరియా కేటాయింపు పైన కేంద్రం తీరు పైనప్రతిపక్షనేత కెసిఆర్ ఎందుకు స్పందించడంలేదు అని ఆయన ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం కుళ్ళు పైనే కెటిఆర్ విమర్శలు చేస్తున్నారని అన్నారు. రైతులపైన కెటిఆర్ కపట ప్రేమ చూపిస్తున్నారని దుయ్య బట్టారు.మా ఎంపీలు పార్లమెంట్‌లో కేంద్రాన్ని నిలదీస్తున్నారు.కెటిఆర్ కెసిఆర్ థర్డ్‌క్లాస్ ఆలోచనలు చేశారు కాబట్టే ప్రజలు ఓడించారని అన్నారు. ఉప రాష్ట్రపతి అభ్యర్థి పైన ఇండియా కూటమి రాజకీయపరమైన నిర్ణయం తీసుకుంది. గతంలో దళితుడిని ముఖ్యమంత్రిని చేస్తానని కెసిఆర్ చెప్పి మోసం చేశారు.కంచె ఐలయ్యకు మాపార్టీ ఎంతో గౌరవం ఇచ్చిందని ఆయన తెలిపారు.

# అర్చకులు ఇతర కార్యక్రమాలకు వెళ్లకూడదనే ఉత్తర్వులు సరికాదు

### తెలంగాణ అర్చక సమాఖ్య అధ్యక్షుడు గట్టు శ్రీ నివాసచార్యులు

**హైదరాబాద్,ఆగస్టు20, ప్రభాతవార్త:** దేవాలయ అర్చకులు ఇతర కార్యక్రమాలకు వెళ్ళకూడదు అని దేవాదాయశాఖ ఇచ్చిన ఉత్తర్వులు సరికాదని తెలంగాణ అర్చక సమాఖ్య అధ్యక్షుడు గట్టు శ్రీ నివాసచార్యులు ఒక ప్రకటనలో విమర్శించారు. దేవాలయాల్లో అర్చక విధులు నిర్వహిస్తున్నవారు బయట ఈ ఇతర వివాహాది కార్యక్రమాలకు కానీ ఆశీర్వచనాలకు ఇతర దైవిక కార్యక్రమాలకు వెళ్లకూడదు అనేటువంటి ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు.ఇది కేవలం ఆలయాలలో అర్చకత్వం నిర్వహిస్తున్నటువంటి అర్చకులకే కాదు తెలంగాణ రాష్ట్రంలో ఉన్నటువంటి హిందూ మత ప్రచారం పై జరుగుతున్నటువంటి ఒక దౌర్జన్యం అని కూడా అనుకోవచ్చునే అభిప్రాయం వ్యక్తం చేశారు.ఆలయాల అభివృద్ధి దిశగా తీసుకు వెళుతున్న ఈ సమయంలో ఇటువంటి ఉత్తర్వులు మంచిది కాదని ఆయన హితవు పలికారు.ఈ అంశంపై ఉన్నతాధికారులు పునరాలోచించాలని విజ్ఞప్తి చేశారు.



# బాలుర ఆశ్రమ పాఠశాలలో నిద్రించిన మంత్రి జూపల్లి

**హైదరాబాద్,ఆగస్టు20, ప్రభాతవార్త:** కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని జైనూర్ మండలం మార్లవాయి గ్రామంలోని ప్రభుత్వ బాలుర ఆశ్రమ పాఠశాల వసతి గృహంలో నిద్రించిన మంత్రి జూపల్లి కృష్ణారావు..ఉదయం విద్యార్థులతో కలిసి అల్పాహారం చేశారు. అంతకుముందు కిచెన్ ను పరిశీలించారు. తర్వాత విద్యార్థులతో కాసేపు ముచ్చటించారు ప్రభుత్వం అందజేస్తున్న మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందుతుందా అని ప్రశ్నించారు. విద్యార్థులను పలు విషయ పరిజ్ఞానానికి సంబంధించిన ప్రశ్నలను అడిగారు.ప్రభుత్వం అందజేస్తున్న మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందుతుందా అని ప్రశ్నించారు. విద్యార్థులను పలు విషయ పరిజ్ఞానానికి సంబంధించిన ప్రశ్నలను అడిగారు.ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను వినియోగించుకుని ఉన్నతస్థాయికి ఎదగాలని సూచించారు.

అనంతరం ఉపాధ్యాయుల రిజిస్ట్రార్ ను పరిశీలించి. వారితో ముఖాముఖి మాట్లాడారు. సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందిస్తున్నారా? వార్డెన్ల పర్యవేక్షణ ఎలా ఉంది? విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు ఏమైనా ఉన్నాయా? ఎలాంటి సౌకర్యాలు కల్పించాలనే అంశాలపై చర్చించారు.విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందేలా చూడటంతోపాటు వసతి గృహాల్లో సౌకర్యాలను మెరుగుపరిచి వారిని ఉన్నతంగా తీర్చిదిద్దేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం మంత్రి జూపల్లి మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ హాస్టళ్లలో పేద విద్యార్థులే వసతి పొందుతున్నారు. అందులో రెక్కాడితేగాని డొక్కాడని కుటుంబాల నుంచి వచ్చినవారే అధికంగా ఉంటున్నారు.వీరందరికీ హాస్టళ్ల లో నాణ్యమైన భోజనంతో పాటు మౌలిక వసతులు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఇప్పటికే కల్పిస్తున్న వసతులను తనిఖీచేసేందుకు విద్యార్థులతో కలసి వసతి గృహంలో బస చేశాను. విద్యార్థులతో ఇంటరాక్ట్ అయ్యాను. బేసిక్ ప్రశ్నలకు సమాధానాలు చెప్పలేకపోయారు.మన విద్యా విధానం, బోధన పద్ధతులు మార్చాల్సిన అవసరం ఉంది. నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని మంత్రి వివరించారు.

# ప్రతిపక్షాలను ఇబ్బంది పెట్టడానికే కేంద్రం బిల్లు

### అసెంబ్లీలో పిసిఘోష్ నివేదికపై చర్చిస్తాం, ఆ తరువాత కోర్టుకు వెళ్లు కెసిఆర్: షబ్బీర్‌అలీ



**హైదరాబాద్,ఆగస్టు 20,ప్రభాతవార్త:** ప్రతి పక్షాలను ఇబ్బందులు పెట్టడానికే జైలుకు వెళ్లిన ముఖ్యమంత్రులను తప్పపించాలని కేంద్రం బిల్లు పెడుతుందని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలి ఆరోపించారు. గాంధీభవన్‌లో ముఖాముఖి కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రజల నుంచి విన్న పాలు స్వీకరించి అనంతరం విలేఖరులతో మాట్లాడారు. ఈసందర్భంగా ప్రభుత్వ సలహా దారు షబ్బీర్ అలీ మాట్లాడుతూ కాళేశ్వరం కమిషన్ రిపోర్ట్ ఇంకా పబ్లిక్ లో పెట్టక ముందే కెసిఆర్ కోర్టుకు పోతుండు అంటేనే కెసిఆర్ తప్పిదాలు ఉన్నట్లే భావించాలని ప్రజలకు తెలిపారు. కమిషన్ పై అసెంబ్లీలో బిల్లు పెట్టి చర్చి స్తామని తర్వాత కెసిఆర్‌ను ఎక్కడికైనా పొమ్మను కాళేశ్వరం పై జస్టిస్ గోష్ 15 నెలలు విచారణ చేశారు. అందులో అన్ని తప్పులు ఉన్నట్లు గోష్ కమిటీ చెప్పిందని ఆయన వివరించారు 60 సంవత్సరాల నుండి వర్గీకరణకోసం పోరాటం చేస్తున్న మాదిగల కోసం శమీమ్ అక్తర్ తో కమిషన్ వేసి వర్గీకరణ చేసినం ఎవరి వాటా వారికి కల్పించినం అని ఆయన చెప్పారు. క్యాస్ట్ సెన్సు చేయడం తో 46.25 శాతం రాష్ట్రంలో బిసిలు ఉన్నారని తేలిందని ఆయన చెప్పారు. రాహుల్ గాంధీ ఆలోచనలు రాష్ట్రంలో సిఎం రేవంత్ రెడ్డి క్యాస్ట్ సెన్సు చేశారని ఆయన అన్నారు. అన్ని రాష్ట్రాలు కూడా తెలంగాణ లాగ కులగణన చేయాలని అడుగుతున్నారని చెప్పారు. బిసి రిజర్వేషన్ లో ముస్లిం లను తీసివేస్తే సపోర్ట్ చేస్తాం అని బిజెపి అంటుందని,గుజరాత్ లో ఉంది అన్ని రాష్ట్రాలలో ఉందిదమ్ముంటే బిజెపి రాష్ట్రాలలో ముస్లిం ల రిజర్వేషన్ తీసివేయండని సవాల్ విసిరారు. మీ బిజెపి పార్టీ జాతీయ పార్టీనా కదా?మత పరమైన రిజర్వేషన్ అని బిజెపి నేతలు అంటున్నారు అని ఆయన అన్నారు.స్వాతంత్రం రాకముందు నుండే ముస్లింలకు రిజర్వేషన్ ఉందని ఆయన చెప్పారు. వృత్తి పరంగానే రిజర్వేషన్ ఇస్తున్నాం మతపరంగా కాదు అని ఆయన చెప్పారు. ముస్లింలలోబీద వారు ఉన్నారు.ముస్లింలు బతకొదా అని రాజశేఖర్ రెడ్డి వచ్చాక 4శాతం ఉపాధి,ఉద్యోగాల లో రిజర్వేషన్ ఇచ్చారని ఆయన చెప్పారు. రేవంత్ రెడ్డి ఇంటి ఇంటి సర్వే చేసి ముస్లిం లు బీదవారు ఉన్నారని గుర్తించారని చెప్పారు. ముఖాముఖిలో వచ్చిన అభ్యర్థనలలో ఇందిరమ్మ ఇండ్లు కావాలని పెద్ద ఎత్తున దరఖాస్తులు వచ్చాయి అని ఆయన చెప్పారు. భూమి ఉన్న వారికి మొదటి దపా భూమి లేని వారికి రెండో దపా ఇందిరమ్మ ఇండ్లు ఇస్తున్నామని తెలిపారు.

# నా పుస్తకం- నా కథ పేరుతో కార్యక్రమం: పాఠశాల విద్య డైరెక్టర్ నవీన్ నికోలస్

**హైదరాబాద్, ప్రభాతవార్త, ఆగస్టు 20:** తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు పఠశాసక్తిని పెంపొందించడం కోసం పాఠశాల విద్య శాఖ చర్యలు ప్రారంభించింది. ఇందకు సంబంధించి సమగ్ర శిక్ష స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్ అయిన పాఠశాల విద్య డైరెక్టర్ నవీన్ నికోలస్ బుధవారం తన కార్యాలయంలో ఇందుకు సంబంధించి రూపొందించిన రీడింగ్ క్యాంపెయిన్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్య జాయింట్ డైరెక్టర్(జెడి-బోధన)రాజీవ్, రూమ్ టు రీడ్ రాష్ట్ర లీడ్ నరసింహాచారి పాల్గొన్నారు. తెలంగాణలో అక్షరాస్యతను బలోపేతం చేయడానికి రీడింగ్ క్యాంపెయిన్ ప్రారంభించాలని భావించిన పాఠశాల విద్య శాఖ అధికారులు రూమ్ టు రీడ్ ఇండియా ట్రస్ట్ సహకారంతో రాష్ట్రంలోని అన్ని పాఠశాలల్లో విద్యార్థుల్లో పఠనాశక్తిని చదవడం అనే నైపుణ్యాన్ని బలోపేతం చేసే లక్ష్యంతో "నా పుస్తకం-నా కథ" అనే థీమ్ తో. రీడింగ్ క్యాంపెయిన్‌ను అధికారికంగా ప్రారంభించింది. ఈ ప్రచారాన్ని బుధవారం రాష్ట్ర ప్రాజెక్ట్ డైరెక్టర్ కార్యాలయంలో ప్రారంభించారు. రాష్ట్ర విద్యా పరిశోధన, శిక్షణ మండలి (ఎస్‌సిఈఆర్‌టి) భాగస్వామ్యంతో నిర్వహించిన లైబ్రరీ పాయింట్ ఉపాధ్యాయుల రాష్ట్ర వ్యాప్త శిక్షణతో సహా పాఠశాల విద్యశాఖ చేపట్టిన ప్రయత్నాలకు కొనసాగింపుగా ఈ ప్రచారాన్ని ప్రారంభించడం జరిగిందని డైరెక్టర్ తెలిపారు.

# 29న రానున్న 'త్రిబాణధారి బార్బరిక్'

**ఓ సినిమాను** తెరకెక్కించడం కంటే సరైన రిలీజ్ టైం, కావాల్సినన్ని థియేటర్లను బ్లాక్ చేసుకుని ప్రేక్షకుల ముందుకు తీసుకు వెళ్లడమే గొప్ప విషయం. సరైన రిలీజ్ డేట్ దొరికి.. అనుకునన్ని థియేటర్లు లభిస్తే.. భారీ రిలీజ్ దక్కితే ఆ చిత్రానికి విజయావకాశాలు ఎక్కువగా ఉంటాయి. అందుకే మంచి రిలీజ్ డేట్ కోసం చూసినచి 'త్రిబాణధారి బార్బరిక్' టీం మూవీని ఆగస్ట్ 29న భారీ ఎత్తున విడుదల చేయనుంది. స్టార్ డైరెక్టర్ మారుతి సమర్పణలో వానర సెల్యూలాయిడ్ బ్యానర్ మీద విజయ్ పాల్ రెడ్డి అడిదెల నిర్మించిన'త్రిబాణధారి బార్బరిక్' చిత్రంపై భారీ అంచనాలు నెలకొన్న సంగతి తెలిసిందే. మోహన్ శ్రీవత్స దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో పాన్ ఇండియన్ యాక్టర్ సత్య రాజ్ ప్రధాన పాత్రను పోషించగా.. వశిష్ట ఎన్ సింహా, సత్యం రాజేష్, ఉదయభాను, క్రాంతి కిరణ్, సాంచీ రాయ్ వంటి వారు కీలక పాత్రల్ని పోషించారు. ఇప్పటి వరకు రిలీజ్ చేసిన పాటలు, టీజర్ ఇలా అన్నీ అందరినీ ఆకట్టుకున్నాయి. ఇక ట్రైలర్ ఒక్కసారిగా అంచనాలు పెంచేసింది. విజువల్స్, ఆర్ ఆర్ ఇలా అన్నీ కూడా ఆకట్టుకున్నాయి. మోహన్ శ్రీవత్స మేకింగ్, ఇన్ఫ్యూజన్ బ్యాండ్ సంగీతం ఇప్పటికే అందరిలోనూ ఆసక్తి పెంచేసింది. నిర్మాత విజయ్ పాల్ రెడ్డి మొదటి ప్రాజెక్ట్ అయినా కూడా ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా భారీ ఎత్తున నిర్మించారు. ఇక ఆదిత్య మ్యూజిక్ ద్వారా విడుదల అయిన పాటలు అయితే శ్రోతల్ని ఎంతో ఆకట్టుకున్నాయి. మరీ ముఖ్యంగా ఈ చిత్రానికి కుశేందర్ రమేష్ రెడ్డి అందించిన విజువల్స్ అందరినీ ఆశ్చర్య పరిచేలా ఉన్నాయి. బార్బరిక్ కాన్సెప్ట్ ఇప్పటికే సోషల్ మీడియాలో హాట్ టాపిక్ అయిన సంగతి తెలిసిందే. ఇప్పటికే డిఫరెంట్ ప్రమోషన్స్ చేస్తూ సినిమాను జనాల్లోకి తీసుకెళ్తున్నారు. 'త్రిబాణధారి బార్బరిక్' మూవీ ఆగస్ట్ 22న విడుదల కావాల్సి ఉంది. కానీ సరైన రిలీజ్ డేట్, కావాల్సినన్నీ థియేటర్లు లభించడం కోసం ఆగస్ట్ 29కి వాయిదా వేశారు. ఇక ఈ



'త్రిబాణధారి బార్బరిక్' మూవీ ఆగస్ట్ 29న గ్రాండ్‌గా ఆడియెన్స్ ముందుకు రాబోతోంది.

# 'చాయ్ వాలా' చిత్రం అందరికీ నచ్చుతుంది

## టీజర్ లాంచ్ ఈవెంట్‌లో నిర్మాత రాజ్ కందుకూరి..



**యంగ్, ప్రామిసింగ్** యాక్టర్ శివ కందుకూరి హీరోగా 'చాయ్ వాలా' అనే చిత్రాన్ని హర్షిక ప్రొడక్షన్స్ బ్యానర్ మీద రాధా విజయ లక్ష్మి, వెంకట్ ఆర్. పాపుడిప్పు భారీ ఎత్తున నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి ప్రమోద్ హర్ష రచన, దర్శకత్వం వహించారు. రీసెంట్‌గా రిలీజ్ చేసిన ఫస్ట్ లుక్ పోస్టర్ అందరినీ ఆకట్టుకుంది. ఇక బుధవారం (ఆగస్ట్ 20) నాడు ఈ మూవీ టీజర్‌ను రిలీజ్ చేశారు. 'నా చాయ్ విలువ రూ. 15.. అంతకన్న ఒక్క రూపాయి ఎక్కువ తీసుకున్నా.. నా విలువ పడిపోతుంది' అంటూ రాజీవ్ కనకాల చెప్పిన డైలాగ్‌తో టీజర్ అద్భుతంగా ఆరంభమైంది. ఈ సందర్భంగా ప్రముఖ నిర్మాత రాజ్ కందుకూరి మాట్లాడుతూ.. .. 'చాయ్ వాలా' టైటిల్‌ను నిర్మాత వెంకట్ గారే నిర్ణయించారు. అందరికీ కనెక్ట్ అయ్యే టైటిల్ ఇది. 'చాయ్ వాలా' చిత్రాన్ని చూసిన తరువాత ఎమోషన్‌తో బయటకు వెళ్తారు. రాజీవ్ కనకాల గొప్ప యాక్టర్. రెండేళ్ల క్రితం కథ చెప్పినప్పుడే రాజీవ్ కనకాల తండ్రి పాత్రను పోషించిస్తారని డైరెక్టర్ ప్రమోద్ చెప్పారు. ఇమ్రాన్ రైటింగ్ చాలా అద్భుతంగా ఉంటుంది. తేజు అశ్వినికి తెలుగులో చక్కటి భవిష్యత్తు ఉంటుంది. ప్రమోద్ రాసిన మంచి కథకు, మంచి నటీనటులు కలిసి వచ్చారు. శివ స్నేహితుడిగా ఇందులో కసిరెడ్డి చాలా చక్కగా నటించారు. క్రాంతి గారు చక్కటి విజువల్స్ ఇచ్చారు. త్వరలోనే ఈ చిత్రం థియేటర్లోకి రానుంది. ప్రమోద్ హర్ష అనే వ్యక్తి మంచి దర్శకుడిగా నిలబడతారు.. శివకు మంచి పేరు వస్తుంది.. నిర్మాత వెంకట్ గారు ఇలాంటి మంచి చిత్రాలెన్నో నిర్మించాలి. 'చాయ్ వాలా' చిత్రం ఎమోషనల్‌గా అందరికీ కనెక్ట్ అవుతుంది. ఈ మూవీ అందరినీ ఆకట్టుకునేలా ఉంటుంది అని అన్నారు. శివ కందుకూరి మాట్లాడుతూ.. .. 'చాయ్ వాలా' టీంతో నాకు మంచి బంధం ఏర్పడింది. ప్రమోద్ చెప్పిన కథ నాకు చాలా నచ్చింది. మా నిర్మాత ఈ కథను మాకంటే ఎక్కువగా నమ్మారు. ఈ ప్రయాణంలో ప్రమోద్ నాకు మంచి స్నేహితుడిగా మారిపోయారు. రైటర్ ఇమ్రాన్, డీఓపీ క్రాంతి, ఆర్ట్ సుప్రియ ఇలా మంచి టీంతో ప్రమోద్ మూవీని తెరకెక్కించారు. ఈ చిత్రాన్ని చూసి వచ్చిన తరువాత తండ్రితో కాసేపు మాట్లాడతారు. థియేటర్ నుంచి ఓ మంచి ఎమోషన్‌తోనే బయటకు వస్తారని మాత్రం కచ్చితంగా చెప్పగలను. రాజీవ్ కనకాల గారితో పని చేసిన క్షణాల్ని నా జీవితాంతం గుర్తు పెట్టుకుంటాను. ఆయ న్నుంచి నేను ఎంతో నేర్చుకున్నాను. తేజుతో కలిసి నటించడం ఆనందంగా ఉంది. ఆమె చాలా మల్టీ టాలెంటెడ్. మా 'చాయ్ వాలా' చిత్రం త్వరలోనే థియేటర్లోకి రానుంది. అందరినీ ఆకట్టుకునేలా మా మూవీ ఉంటుంది' అని అన్నారు. దర్శకుడు ప్రమోద్ హర్ష మాట్లాడుతూ.. .. 'శివకే ఈ కథను చెప్పాను. కథకు తగ్గట్టుగా ఫేస్‌లోనే ఓ సెన్సిబిలిటీ, ఓ జాలీ కనిపించాలి. అందుకే శివకి 'చాయ్ వాలా' కథను చెప్పాను. నేను రాసుకున్న పాత్రలు, కథ నుంచే'చాయ్ వాలా' టైటిల్‌ను తీసుకున్నాను. ప్రతీ మనిషి జీవితంలో జరిగే సంఘటనలే మా చిత్రంలో ఉంటుంది. ప్రతీ ఒక్కరికీ కనెక్ట్ అయ్యేలా మా సినిమా ఉంటుంది అని అన్నారు. నిర్మాత వెంకట్ ఆర్. పాపుడిప్పు మాట్లాడుతూ ఈ మూవీ లోని కొన్ని సీన్లను ఆల్రెడీ చూశాను. ఇదొక సెన్సిబుల్ లవ్ స్టోరీ. అందరినీ ఆకట్టుకునేలా ఈ మూవీని తీశార'ని అన్నారు. తేజు అశ్విని మాట్లాడుతూ.. .. 'తెలుగులో నాకు 'చాయ్ వాలా' మొదటి చిత్రం. రాజీవ్ కనకాల వంటి సీనియర్ ఆర్టిస్ట్‌తో పని చేయడం ఆనందంగా ఉంది. శివ గారు అద్భుతమైన కో ఆర్టిస్ట్. క్రాంతి గారు మా అందరినీ అందంగా చూపించారు. సెట్‌లో మా అందరినీ రాజ్ కందుకూరి గారు ఎంకరేజ్ చేస్తుండేవారు. 'చాయ్ వాలా' అందరికీ నచ్చుతుంది' అని న్నారు. రాజీవ్ కనకాల మాట్లాడుతూ.. ..'నిర్మాత వెంకట్ రెడ్డి 'చాయ్ వాలా' కోసం ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా నిర్మించారు. 'చాయ్ వాలా' కథ నాకు చాలా నచ్చింది.ప్రమోద్ ఏడాదికి కనీసం రెండు చిత్రాలైనా చేయాలి. ప్రతీ సీన్‌ను ఎంతో వివరించి నటీనటుల నుంచి నటనను రాబట్టుకునేవాడు. రాజ్ కందుకూరి గారు ఈ సినిమా మీద మా అందరి కంటే ఎక్కువ నమ్మకంగా ఉండేవారు. కసిరెడ్డి అద్భుతమైన నటుడు. మా డీఓపీ క్రాంతి ఎంతో వేగంగా పని చేసేవారు. రచయిత ఇమ్రాన్ గారు కూడా సెట్స్‌కి వచ్చి సపోర్ట్ చేస్తుండేవారు. సుప్రియ గారి ఆర్ట్ వర్క్ కూడా అద్భుతంగా ఉంటుంది. తేజు అశ్వినితో నాకు కొన్ని సీన్లే ఉంటాయి. తేజు చాలా చక్కగా నటించారు. శివ కందుకూరి బోలెడంత ఆకలితో ఉన్న ఆర్టిస్ట్. నా పక్కన ఎక్కడా తగ్గకుండా ఉండాలని ఎంతో తపన పడి నటించేవాడు. ఆ ఆకలితో ఉన్న శివ కందుకూరి ఎంతో ఎత్తుకు వెళ్లాలని కోరుకుంటున్నాను. 'చాయ్ వాలా' అందరికీ నచ్చుతుందని ఆశిస్తున్నాను' అని అన్నారు. నటుడు రాజ్ కుమార్ కసిరెడ్డి మాట్లాడుతూ.. .. ప్రమోద్ నాకు నాలుగేళ్లుగా తెలుసు. ఈ కథ ప్రతీ ఒక్కరికీ కనెక్ట్ అవుతుంది. అందరినీ ఆకట్టుకునేలా ఈ మూవీని తెరకెక్కించారు. రాజీవ్ కనకాల గారు పండించిన ఎమోషన్, ఆయన పాత్ర ప్రతీ ఒక్కరికీ కనెక్ట్ అవుతుంది. శివతో నటించడం చాలా ఆనందంగా ఉంది. శివతో మళ్లీ మళ్లీ నటించాలని ఉంది. తేజు అశ్వినీ గారు అద్భుతంగా నటించారు. రాజ్ కందుకూరి గారే మాలాంటి కొత్త వాళ్లందరినీ మొదటగా అభినందించారు. కొత్త వారిని ఎంకరేజ్ చేసేందుకు ఆయన ఎప్పుడూ ముందుంటారు. 'చాయ్ వాలా' చిత్రం అందరినీ ఆకట్టుకుంటుంది' అని అన్నారు.



# సుకృతి వేణిని అభినందించిన సిఎం రేవంత్ రెడ్డి

**ఇటీవల** ప్రకటించిన జాతీయ అవార్డ్స్ లో 'గాంధీ తాత చెట్టు' చిత్రానికి గాను ఉత్తమ బాలనటిగా అవార్డుకు ఎంపికైన ప్రముఖ దర్శకుడు సుకుమార్ కూతురు సుకృతి వేణిని ముఖ్యమంత్రి రేవంతి రెడ్డి అభినందించారు. మంగళవారం జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో ఉత్తమ బాలనటిగా పురస్కారానికి ఎంపికైన సుకృతి వేణితో పాటు ప్రముఖ దర్శకుడు సుకుమార్, చిత్ర సమర్పకురాలు, సుకుమార్ సతీమణి తబితా సుకుమార్ 'గాంధీ తాత చెట్టు' చిత్ర నిర్మాతలు వై.రవిశంకర్, శేష సింధురావులు సిఎం రేవంత్ రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సుకృతివేణితో పాటు నిర్మాతలను ఈ సందర్భంగా సత్కరించారు. 71 జాతీయ అవార్డ్స్‌లో 'గాంధీ తాత చెట్టు' చిత్రానికిగాను సుకృతివేణి ఆ చిత్రంలో ఉత్తమ నటనకు ఉత్తమ బాలనటిగా పురస్కారం దక్కించుకున్నారు. పద్మావతి మల్లాది దర్శకత్వంలో మైత్రీ మూవీ మేకర్స్, గోపీ టాకీస్, సుకుమార్ రైటింగ్స్ బ్యానర్స్‌పై శ్రీమతి తబితా సుకుమార్ సమర్పణలో నవీన్ ఎర్నేనీ, వై.రవిశంకర్, శేష సింధురావులు ఈ చిత్రాన్ని నిర్మించారు. అందరి హృదయాలను హత్తుకున్న చిత్రంగా 'గాంధీ తాత చెట్టు' ప్రశంసలు అందుకున్న సంగతి తెలిసిందే.

# క్రేజీ కింగ్స్ స్టూడియోస్ ఎల్‌ఎల్‌పి బేనర్‌లో నూతన చిత్రం ప్రారంభం



**రోహిత్ వర్మ** కథానాయకుడిగా రియా సుమన్ నాయికగా నటిస్తోన్న నూతన చిత్రం మంగళవారం హైదరాబాద్ రామానాయుడు స్టూడియోలో పూజా కార్యక్రమాలతో ఘనంగా ప్రారంభమైంది. క్రేజీ కింగ్స్ స్టూడియోస్ ఎల్.ఎల్.పి. బేనర్ లో నజీర్ జమాల్ నిర్మిస్తుండగా, గోవిందరెడ్డి చంద్ర దర్శకత్వం వహిస్తున్నారు. హీరో హీరోయిన్లపై తీసిన ముహూర్తపు సన్నివేశానికి విజయ్ కనకమేడల క్లాప్ కొట్టగా, సీనియర్ దర్శకుడు రామ్ ప్రసాద్ కెమెరా స్విచాన్ చేశారు. మరో దర్శకుడు మల్లిఖార్జున గౌరవ దర్శకత్వం వహించారు. ఈ కార్యక్రమంలో రాజీవ్ కనకాల, ప్రగతి, వర్మ తదితరులు పాల్గొన్నారు. అనంతరం చిత్రం గురించి నిర్మాత నజీర్ జమాల్ మాట్లాడుతూ.. తెలుగులో నాకిది మొదటి సినిమా. కథ విన్న తర్వాత బాగా నచ్చి సినిమా చేయడానికి ముందుకు వచ్చాను. రోహిత్ హీరోగా నటిస్తున్నాడు. ఇందులో పాటలు అద్భుతంగా వుంటాయి. దర్శకుడు కథకు అనుగుణంగా నటీనటుల ఎంపిక చేయడం జరిగింది. కథానాయకుడు రోహిత్ వర్మ మాట్లాడుతూ.. దర్శకుడు అద్భుతమైన కథ చెప్పారు. ఈ సినిమాతో తెలుగులోకి రావడం చాలా ఆనందంగా వుంది. సినిమాకి సీనియర్ సాంకేతిక సిబ్బంది పనిచేస్తున్నారు. తెలుగు ప్రేక్షకులకు మంచి సినిమా ఇవ్వాలని నా మనసులో కోరిక వుండేది. ఈ చిత్రంలో అది కుదిరింది. చిత్రం కోసం తెలుగు బాగా నేర్చుకుంటున్నాను. అందరూ మెచ్చే సినిమా అవుతుందని నమ్మకం ఉంది. హీరోయిన్ రియా సుమన్ మాట్లాడుతూ.. ఈ సినిమాలో పనిచేయడం ఆనందంగా వుంది. మంచి పాత్రను పోషిస్తున్నాను. ఇందుకు దర్శక నిర్మాతలకు ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. అలాగే ఈ సినిమాకు మంచి టైటిల్ పెట్టబోతున్నారు. వినాయకచవితికి తెలియజేయనున్నారు. తొలుత మోంటేజ్ సాంగ్‌లో రేపటినుంచి షూటింగ్ ప్రారంభిస్తున్నాం. చక్కటి సాహిత్య, సంగీతం ఈ కథకు బాగా కుదిరింది. నటుడు నిఖిల్ దేవేదుల మాట్లాడుతూ.. ఈ రోజు మంచి ముహూర్తంతో ప్రారంభించి నందుకు ఆనందంగా వుంది. చక్కటి పాత్రను పోషిస్తున్నాను. అందరూ ఆశీస్సులు కావాలి.నటి అక్షర మాట్లాడుతూ.. సినిమాలో భాగమైనందుకు ఆనదంగా వుంది. అందరూ చూడతగ్గ సినిమా ఇది అన్నారు. దర్శకుడు గోవిందరెడ్డి చంద్ర మాట్లాడుతూ.. క్రేజీ కింగ్ ప్రొడక్షన్‌లో క్రేజీ కథతో రాబోతున్నాం. ఛోటాకె. ప్రసాద్, మణిశర్మ వంటి సీనియర్స్ ఈ సినిమాకు పనిచేస్తున్నారు. కథ అందరికీ కనెక్ట్ అయ్యేవిధంగా వుంటుంది. రోహిత్ హిందీలో చేశాడు. తెలుగులో మొదటి సినిమా. రియా కథ నచ్చి బాగా సపోర్ట్ చేసింది. ఇది పక్కా కమర్షియల్ సినిమా అవుతుందనే నమ్మకముంది. పూర్తి వివరాలు వినాయకచవితికి తెలియజేస్తాం అన్నారు.

## పాయల్ రాజ్‌పుత్



# 'కాంతార చాప్టర్-1' నుంచి గుల్షన్ దేవయ్య ఫస్ట్ లుక్ విడుదల



**మోస్ట్ ఎవైటెడ్** బిగ్గెస్ట్ పాన్ ఇండియా మూవీ కాంతార చాప్టర్ 1 నిర్మాతలు బాలీవుడ్ నటుడు గుల్షన్ దేవయ్య ఫస్ట్ లుక్‌ను లాంచ్ చేశారు. రిషబ్ శెట్టి బ్లాక్‌బస్టర్ కాంతారకు ప్రతిష్టాత్మక ప్రీక్వెల్‌లో కులశేఖర పాత్రలో నటిస్తున్నాడు గుల్షన్ దేవయ్య. ఈ అనౌన్స్ మెంట్ ఫ్రాంచైజీ అభిమానులలో ఉత్సాహాన్ని నింపింది. ఈ చిత్రం ప్రపంచ వ్యాప్తంగా ప్రేక్షకులను అలరించడానికి సిద్ధమవు తోంది. రిషబ్ శెట్టి రచన, దర్శకత్వం వహించి తానే మళ్లీ సెంట్రల్ క్యారెక్టర్‌గా నటిస్తున్న 'కాంతార చాప్టర్-1' మొదటి పార్ట్‌లో ఉన్న యూనివర్స్‌ని ఇంకా విస్తరించబోతోంది. తొలి సినిమా రా, ఫోక్‌లోర్, ఆధ్యాత్మికత, భావోద్వేగా లతో రూటెడ్ స్టోరీటెల్లింగ్‌కి కొత్త నిర్వచనం ఇచ్చింది. ఈ ప్రీక్వెల్ మాత్రం మూలాలను ఇంకా లోతుగా ఎక్స్‌ప్లోర్ చేస్తూ, మరింత ఇంటెన్సిటీ, భావోద్వేగం జోడించబోతోంది. ఈ సినిమా విజువల్ విజువల్ వండర్‌గా ఉండబోతోంది. సినిమాటోగ్రఫీని అర్వింద్ ఎస్. కాశ్యప్ అందిస్తుండగా, ఫస్ట్ పార్ట్‌లో ప్రేక్షకులను మంత్ర ముగ్ధులను చేసిన బి. అజనీష్ లోక్నాథ్ మ్యూజిక్ ఇస్తున్నారు. హోంబాలే ఫిలిమ్స్ విజయ్ కిరగందూర్ నెక్స్ట్ లెవల్ లో నిర్మిస్తున్నారు. కులశేఖర పాత్రలో గుల్షన్ దేవయ్య ఫస్ట్ లుక్ బయటికి రావడంతో సినిమా మీద మరింత హైప్ పెరిగింది. ఈ మోస్ట్ లవ్డ్ యూనివర్స్‌లో అతని రోల్ ఎలాంటి మలుపులు తీసుకొస్తుందో అన్న ఆసక్తి పెరుగుతోంది. ఈ చిత్రం కన్నడతో పాటు తెలుగు, హిందీ, తమిళం, మలయాళం, బెంగాలీ, ఇంగ్లీష్ లో అక్టోబర్ 2, 2025న గ్రాండ్‌గా వరల్డ్‌వైడ్ రిలీజ్ కానుంది.

# నీలి నీలి ఆకాశం పాటకు సీక్వెల్ పాట



**నీలి నీలి ఆకాశం** క్రియేషన్స్, ప్రశ్విత ఎంటర్‌టైన్‌మెంట్, ఎన్‌వీఎల్ క్రియేషన్స్ బ్యానర్స్‌పై అంచల్ గౌడ, పాయల్ చెంగప్ప, రోషిణి, యష్ణ, రోహన్ సూర్య, మొయిన్ ముఖ్య తారాగణం తో '30 రోజుల్లో ప్రేమించడం ఎలా' సినిమాతో మంచి విజయాన్ని అందుకున్న డైరెక్టర్ మున్నా ధులిపూడి దర్శకత్వంలో వస్తున్న మరో ఎంటర్టైనర్ చిత్రం 'బ్యాడ్ గాళ్' కానీ చాలా మంచోళ్లు అనేది ట్యాగ్ లైన్. శశిధర్ నల్లా, ఎమ్మాడి సోమ నర్సయ్య, రామిశెట్టి రాంబాబు, రావుల రమేష్ ఈ చిత్రానికి నిర్మాతలు. ఆస్కార్ విన్నర్ లిరిసిస్ట్ చంద్రబోస్ సాహిత్యం అందిస్తుండగా మెలోడీ కింగ్ అనూప్ రూబెన్స్ తన చక్కని బాణీలతో ఈ చిత్రానికి సంగీతం అందించారు. ఇటీవలే ఈ చిత్రానికి సంబంధించిన మోషన్ పోస్టర్ 5 మిలియన్ వ్యూస్‌తో సోషల్ మీడియా లో ట్రెండింగ్‌లో నడుస్తోంది. ఇప్పుడు మరో మెలోడీ పాటను తెలుగు ప్రేక్షకులకు త్వరలో అందించబోతున్నారు. 'ఇలా చూసుకుంటానే' అనే పాటకి చంద్రబోస్ సాహిత్యం అందించగా సిద్ శ్రీరామ్ పాడారు. ఈ పాటకు సంబంధించి విడుదల అయిన ప్రీ టీజర్ దూసుకుపోతుంది, ఈ ప్రీ టీజర్ లో చంద్ర బోస్ గారు కూడా యాక్టింగ్ అద్భుతంగా చేశారు. ఈ చిత్ర దర్శకుడు మున్నా ధూళిపూడి మాట్లాడుతూ ఇప్పుడు 'ఇలా చూసుకుంటానే' అనే పాట 'బ్యాడ్ గాళ్స్' చిత్రం ద్వారా త్వరలో విడుదల చేస్తున్నాం. చంద్ర బోస్ గారు అందించిన లిరిక్స్, సంగీత దర్శకుడు అనూప్ రూబెన్స్ స్వర పరిచిన పాట మరియు సిద్ శ్రీరామ్ పాడిన పాట 'నీలి నీలి ఆకాశం' పాట కంటే గొప్పగా వచ్చింది. త్వరలో విడుదల చేస్తాం. 'బ్యాడ్ గాళ్స్' అనేది పూర్తి ఎంటర్టైనర్ చిత్రం. జాతి రత్నాలు, మ్యాడ్ లాంటి హిలేరియస్ చిత్రాలు అమ్మాయిలు చేస్తే ఎలా ఉంటుందో అలాంటి చిత్రం మా 'బ్యాడ్ గాళ్స్' అని తెలిపారు.

తారాగణం: అంచల్ గౌడ, పాయల్ చెంగప్ప, రోషిణి, యష్ణ, రోహన్ సూర్య, మొయిన్

సాంకేతిక బృందం: దర్శకుడు: మున్నా ధులిపూడి, బ్యానర్స్: ప్రశ్విత ఎంటర్‌టైన్‌మెంట్, నీలి నీలి ఆకాశం క్రియేషన్స్, ఎన్‌వీఎల్ క్రియేషన్స్,

నిర్మాతలు: శశిధర్ నల్లా, ఎమ్మాడి సోమ నర్సయ్య, రామిశెట్టి రాంబాబు, రావుల రమేష్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: కె ఎమ్ కుమార్, సంగీతం: అనూప్ రూబెన్స్, లిరిక్స్: ఆస్కార్ చంద్ర బోస్, సాహిత్యం: చంద్రబోస్, సినిమాటోగ్రాఫర్: ఆర్లి గణేష్, ఎడిటర్: బొంతల నాగేశ్వరరెడ్డి

# 'నేనెవరు' టైటిల్ లోగో లాంచ్



**ఇటీవల కాలంలో** చాలా సెలెక్టివ్‌గా సినిమాలు చేస్తున్న నటకిరీటి డా: రాజేంద్ర ప్రసాద్, 'నువ్వేకావాలి, ప్రేమించు' వంటి సూపర్ హిట్ ఫిల్మ్స్ ఫేమ్ సాయికిరణ్, జోగిని శ్యామల ముఖ్యపాత్రల్లో యువ ప్రతిభాశాలి చిరంజీవి తన్నీరు దర్శకత్వంలో తెరకెక్కుతున్న సందేశభరిత వినోదాత్మక చిత్రం 'నేనెవరు?' జై చిరంజీవ మూవీ మేకర్స్ పతాకంపై సరికొండ మల్లిఖార్జున్ సమర్పణలో అండేకర్ జగదీష్ బాబు సకినాన భూలక్ష్మి సంయుక్తంగా నిర్మించిన ఈ చిత్రంతో వైజాగ్ సత్యానంద్ శిష్యులు అభిలాష్, సాయిచెర్రి హీరోలుగా పరిచయమవుతున్నారు.

దీపిక, సోనాక్షి, జబర్దస్త్ రాజమౌళి.... ఇతర పాత్రల్లో నటించిన ఈ చిత్రం షూటింగ్ ముగించుకుని, ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుపుకుంటోంది!! త్వరలో విడుదల తేది ప్రకటించుకోనున్న ఈ చిత్రం టైటిల్ లోగోను తెలుగు నిర్మాతల మండలి అధ్యక్షులు ప్రముఖ నిర్మాత కె.ఎల్.దామోదర్ ప్రసాద్, ప్రముఖ దర్శకులు రేలంగి నరసింహారావు, వి.సముద్ర ఆవిష్కరించి చిత్ర యూనిట్ కి అభినందనలు తెలిపారు. హైదరాబాద్ లోని, తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ప్రివ్యూ థియేటర్‌లో జరిగిన ఈ వేడుకలో చిత్రబృందం పాల్గొని, ఈ సినిమా తామందరికీ పేరు తెచ్చిపెడుతుందని పేర్కొన్నారు! ఈ చిత్రానికి పి.ఆర్.ఒ: ధీరజ్ అప్పాజీ, మాటలు: శ్రీనివాస్, పాటలు: ఎస్.ఎస్.వీరు, మ్యూజిక్: చిన్నికృష్ణ, ఎడిటర్: నందమూరి హరి తారకరామారావు, సినిమాటోగ్రఫీ: నాయుడు ప్రసాద్ కొల్లి, సమర్పణ: సరికొండ మల్లిఖార్జున్, నిర్మాతలు: అండేకర్ జగదీష్ బాబు సకినాన భూలక్ష్మి, రచన దర్శకత్వం: చిరంజీవి తన్నీరు!!



# అడవులతో పర్యావరణానికి మేలు

విలువైన జీవ వైవిధ్యానికి నెలవైన అడవులవి. పేదలైన వాటి యజమానులకు డబ్బు ఆశ చూపి అక్కడి చెట్లను కొట్టేస్తుంటారు వ్యాపారులు. పశ్చిమ కనుమల్లోని ఆ విశిష్ట అడవులతో పర్యావరణానికి మేలని భావించారు అర్చనా జగదీష్ గాడ్బోలే. భావించడమే కాదు, వేల ఎకరాలను కాపాడుతున్నారు. దానికోసం ఆమె ఏం చేస్తున్నారంటే...

వృక్ష పరిశోధకురాలైన అర్చన మొదట్లో 'బొటానికల్ సర్వే ఆఫ్ ఇండియా'లో శాస్త్రవేత్తగా పనిచేసేవారు. అరుదైన మొక్కల్ని గుర్తించి వాటికి పేర్లు పెట్టడం ఆమె విధులు. కానీ వృక్ష సంపదను, పర్యావరణాన్నీ పరిరక్షించాలన్న ఆమె లక్ష్యం అక్కడ నెరవేరలేదు. దాంతో ఉద్యోగం వదిలి 1995లో పుణె కేంద్రంగా 'అప్లైడ్ ఎన్విరాన్మెంటల్ రిసర్చ్ ఫౌండేషన్(ఏఈఆర్ఎఫ్)'ను స్థాపించారు. ఆమె లక్ష్యం ప్రస్తుతం పర్యావరణ పరిరక్షణ నచ్చే దిశగా పనిచేస్తున్న జయంత్ శర్నాయిక్ తోడొచ్చారు. జీవవైవిధ్యాన్ని కాపాడటానికి వివిధ మార్గాల్లో ప్రయత్నిస్తుంది ఆ సంస్థ. ఆ ప్రాజెక్టునే మహారాష్ట్రలో విస్తరించిన పశ్చిమ కనుమల్లోని ప్రైవేటు అడవుల్లో భారీగా చెట్లను నరికేస్తున్నట్టు పేర్కొన్నారు. తమ ఆర్థిక అవసరాల కోసం ఎంతో విలువైన చెట్లను వర్తకులకు అమ్మేవారు యజమానులు. దీన్ని ఆపడానికి ఓ వినూత్న పరిష్కారాన్ని చూపే అర్చన, అడవుల్లో చెట్లను కొట్టుకుంటే రైతులకు డబ్బులిస్తామని చెప్పారు. మొదట్లో వీరి మాటల్ని ఎవరూ నమ్మలేదు. అనేక కార్యక్రమాలు, సమావేశాలు నిర్వహించడంతో ఇది ఆచరణలోకి వచ్చింది. 2007లో 100 ఎకరాలతో చట్టబద్ధంగా మొదటి ఒప్పందం కుదుర్చుకున్నారు.



దీని ప్రకారం భూ యాజమాన్య హక్కులు రైతులకే ఉంటాయి. అయిదేళ్లపాటు రైతులు చెట్లు కొట్టరు. బదులుగా ఏడాదికి కొంత మొత్తం వాళ్లకి చెల్లిస్తారు. రత్నగిరి, పుణె, రాయగఢ్, సింధుదుర్గ్ జిల్లాల్లో ప్రధానంగా ఏఈఆర్ఎఫ్ రైతులతో పనిచేస్తోంది. పవిత్ర తోటలు.. ఈ అడవులను పవిత్ర తోటలుగా పిలుస్తారు స్థానికులు. వీటిలో ఆలయాలు ఉంటాయి. ఒక్కో కుటుంబానికి 5-10, 50-100 ఎకరాలు ఉంటాయి. చెట్ల నుంచి వచ్చే పండ్లు, కాయలు, బెరడు... లాంటి వాటిని మాత్రం రైతులు తీసుకొని అమ్ముకోవచ్చు. మొదట్లో దీనికి నిధులు సమకూర్చడం కష్టమయ్యేది. క్రౌడ్ ఫండింగ్, స్పాన్సర్ ఏ ఫారెస్ట్... కార్యక్రమాలు చేపట్టి విజయవంతమయ్యాం. ఇప్పుడు మాకు మద్దతు తెలిపేవారు చాలామంది ఉన్నారు. గ్రామస్థుల నమ్మకాన్ని పొందడం ఇక్కడ కీలకం. ఏ చిన్న కష్టం వచ్చినా రైతులూ, గిరిజనులూ అడవులవైపే చూస్తారు. అందుకే మేమూ ఆర్థిక ప్రయోజనం చూపించాం. చెట్లను కొట్టుకుంటూ పోతే చివరకు ఆదాయమే ఉండదన్న సంగతి గుర్తుచేశాం అని చెబుతారు. ఈ అటవీ ఉత్పత్తుల్లో ఔషధ లక్షణాలు ఉన్నవాటికి ఏఈఆర్ఎఫ్ మార్కెట్‌నీ చూపుతోంది. మహారాష్ట్రలో 25 లక్షల ఎకరాలు ప్రైవేటు అడవులు ఉన్నాయి. ఏఈఆర్ఎఫ్ ద్వారా 13వేల ఎకరాల అడవులను సంరక్షిస్తున్నారు. బదులుగా కోట్ల రూపాయలు ఇస్తున్నారు. రైతులు ఒప్పందాన్ని ప్రతి అయిదేళ్లకూ సమీక్షించి పునరుద్ధరిస్తారు. ఈ అడవుల వల్ల లక్షల టన్నుల కార్బన్ డయాక్సైడ్ పర్యావరణంలో కలవకుండా ఆగుతోంది. ఇక్కడ విభిన్న వృక్షాలే కాదు, పక్షులు, జంతువులు ఉన్నాయి. వీటితోపాటు పశ్చిమ తీరంలోని కొన్ని ప్రైవేట్ మడ అడవులు, మహారాష్ట్రలో గోండియా, ఛత్తీస్ గఢ్‌లో కేంకర్ లాంటి ప్రాంతాల్లో అడవులు సంరక్షిస్తోంది. రఫోర్డ్ స్మాల్ గ్రాంట్స్ ఫౌండేషన్, ఎల్అండ్‌టీ, యాపిల్, ప్రజ్ ఇండస్ట్రీస్, ఇన్నోవేటివ్ ఇండస్ట్రీస్, పక్కా హెర్బ్స్ సహా పలు కార్పొరేట్ సంస్థలు వీరికి నిధులు అందిస్తున్నాయి. 'జీవవైవిధ్యం లేని పర్యావరణంతో లాభంలేదు. కలిసి కట్టుగా పనిచేస్తే ఎలాంటి పర్యావరణ సమస్యలకైనా పరిష్కారం చూపించవచ్చు. □

# కళ్లు కళగా ఉండాలంటే..



సరిపడినంత నిద్ర లేకపోవడం, థైరాయిడ్, ఉప్పు అధికంగా ఉన్న ఆహారపదార్థాలు తీసుకోవడం.. ఇలాంటి కారణాల వల్ల కళ్ల చుట్టూ వాపు, కళ్ల కింద నల్లటి వలయాలు, కళ్లు అలసిపోయి నట్లుగా కనిపించడం.. వంటి సమస్యలు తలెత్తుతాయి. ఇవి కంటి అందాన్ని దెబ్బతీస్తాయి కూడా! మరి, ఈ సమస్యలకు చెక్ పెట్టాలంటే ఈ చిన్న చిట్కాలు పాటించాలని నిపుణులు అంటున్నారు.

**కీరాదోసతో కూల్గా..** ముందుగా కీరాదోసను పలుచని చక్రాల్లా కోసుకొని కాసేపు ఫ్రిజ్‌లో ఉంచాలి. తర్వాత వాటిని తీసి కళ్ల మీద పెట్టుకొని పది నిమిషాలు రిలాక్స్ అయితే చాలు. కళ్ల చుట్టూ ఉన్న వాపు తగ్గి మోము కాంతులీనుతుంది. కీరాదోసకు బదులుగా యాపిల్ కూడా ఉపయోగించవచ్చు. ఫ్రిజ్లో భద్రపరచిన యాపిల్ తీసుకొని పలుచని ముక్కల్లా కోసి నేరుగా కళ్ల మీద పెట్టుకుంటే సరి. అందులో ఉండే ఇన్ఫ్లమేటరీ గుణాల కారణంగా కళ్ల చుట్టూ ఉన్న వాపు ఇట్టే తగ్గిపోతుంది.

**బంగాళదుంప రసంతో...** ఒక బంగాళాదుంప తీసుకొని తొక్కేసి ముక్కలుగా కోసి మెత్తగా చేసుకోవాలి. దాని నుంచి రసం వేరు చేసి అందులో దూది ముంచి కళ్ల కింద అప్లై చేసుకోవాలి. 20 నిమిషాలు అరనిచ్చి ఆ తర్వాత గోరువెచ్చని నీటితో శుభ్రం చేసుకోవాలి. ఈ విధంగా చేయడం వల్ల కళ్లకు రక్తప్రసరణ సక్రమంగా జరిగి వాపు తగ్గుతుంది. రోజూ రాత్రి పడుకొనే ముందు ఈ చిట్కా పాటిస్తే కళ్ల కింద నల్లటి వలయాలు కూడా తగ్గుముఖం పడతాయి.

**రోజ్ వాటర్..** రోజ్‌వాటర్‌లో ముంచిన దూదిని కళ్లపై పెట్టుకొని పలుచని వస్త్రంతో కప్పేయాలి. పావుగంట తర్వాత కళ్లను చల్లని నీటితో శుభ్రం చేసుకోవాలి. ఫలితంగా వాపు తగ్గి, అలసిన కళ్లు తిరిగి సాధారణ స్థితికి చేరుకుంటాయి.

**బేబీ ఆయిల్ తో..** గోరువెచ్చని నీటిలో కొన్ని చుక్కల బేబీ ఆయిల్ వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమంలో ముంచి దూదిని కళ్లపై ఉంచి 15 నుంచి 20 నిమిషాల పాటు విశ్రాంతి తీసుకోవాలి. బేబీ ఆయిల్ ఉండే విటమిన్ 'ఇ' వల్ల ఉబ్బిన కళ్లు తిరిగి సాధారణ స్థితికి చేరుకుంటాయి. □

# సొరకాయ చపాతీలు



పాలక్ చపాతీ, ఆలూ చపాతీ, మేతీ చపాతీ ఇలా చాలా రకాలుగా రుచుల చపాతీలను చేసుకోవచ్చు. కానీ చపాతీలు చేయాలంటే.. మెత్తగా వస్తాయో రావోనని చాలామందికి భయం. పిండి సరిగ్గా కలపక పోయినా, ఇంగ్రీడియంట్స్ సమపాళ్లలో పడకపోయినా, చపాతీలు మన మాట వినవు. మరి సొరకాయ చపాతీ ఎపుడైనా ట్రై చేశారా? మెత్తగా దూదుల్లాంటి సొరకాయ చపాతీ ఎలా చేయాలో చూద్దాం.

**కావలసినవి :** సొరకాయ తురుము-రెండు కప్పులు, పచ్చిమిర్చి తరుగు-టీ స్పూన్, గోధుమపిండి-రెండున్నర కప్పులు, గరం మసాలా- అర టీ స్పూన్, ఉప్పు-చిటికెడు, ఇంగువ-చిటికెడు, నూనె-రెండు టేబుల్ స్పూన్‌లు.


**తయారీ:** వెడల్పుగా ఉన్న పాత్రలో గోధుమపిండి, సొరకాయ తురుము, తరిగిన పచ్చిమిర్చి, గరం మసాలా పొడి, ఉప్పు, ఇంగువ వేసి కలపాలి. మొదట తేమ సరిపోదనిపించినప్పటికీ సొరకాయలో నీరు వదిలేకొద్దీ సరిపోతుంది. పది నిమిషాల సేపు పక్కన ఉంచితే నీరు బయటకు వస్తుంది. నీరు వదిలిన తర్వాత పిండిని కలిపి చూసుకుని అప్పటికీ పొడిగా అనిపిస్తే కొద్దిగా నీటిని చిలకరించుకుని మిశ్రమం మొత్తాన్ని చపాతీ పిండిలా చేసుకుని వస్త్రాన్ని కప్పి పావు గంట సేపు పక్కన ఉంచాలి. పిండిని పెద్ద నిమ్మకాయంత గోళీలు చేసుకుని చపాతీల్లా వత్తుకుని పెనం వేడి చేసి నూనె వేస్తూ చపాతీని రెండు వైపులా కాల్చాలి. □


## చెలిచిట్కా


తలకే కాకుండా శరీరానికి కూడా నూనెను పట్టించి మర్దన చేయడం వలన శరీరానికి చక్కని వ్యాయామం లభించి దేహపుష్టి కలుగుతుంది. □


# కురులకు ముత్యాల సిరులు
















ఓవైపు పేరంటాలు, మరో పెళ్లి పిలుపులు. హడావుడంతా మనదే దుస్తులు, నగలు... వీటితో సిద్ధమైనట్టేనా? పూర్తి లుక్ ఆకర్షించాలంటే కురులకీ గ్లామర్ హంగులద్దాలి. వేడుకైనా సంప్రదాయ దుస్తుల్లో సిద్ధమైనా ఆధునిక అమ్మాయినే అనిపించుకోవాలన్నది నేటి అమ్మాయిల తత్వం. అందుకే పట్టు చీర, ఓణీ కట్టినా, లెహెంగాలో సిద్ధమైనా కురుల విషయంలో మాత్రం ఆధునికతకే ప్రాధాన్యమిస్తారు. కాస్త చిన్న, మధ్యస్థ పొడవుంటే హెయిర్ లీవ్‌కి మించిన ఉత్తమ మార్గం మరొకటి ఉంటుందా చెప్పండి? అలాగని ఓ పఫ్, రెండు క్లిప్పులతో వదిలేస్తే బాగుంటుంది? అందుకే కురులనీ ఆకర్షించేలా ఎన్నో ఆప్షన్లు. ఈ పెరల్ క్లిప్స్ అలాంటివే నల్లని కురులపై తెల్లగా మెరుస్తూ భలే అందంగా ఉన్నాయ్ కదూ? వాటి ఆకర్షణ మరింత పెంచుతూ కుందన్లు, రంగుల రాళ్లు, గవ్వలు వగైరా మరింత జత కుదిరాయి. చూడటానికి భారీతనం తెస్తూ చక్కగా ఉన్నావు కానీ... ఇవి దగ్గరుంటే సిద్ధమవడమూ చిటికేసినంత సేపే! కర్ల్స్, మెస్సీ, స్ట్రెయిట్... ఏరకంగా స్టైలింగ్ చేసుకుంటూ హెయిర్ లీవ్ చేసి సరే! చివర్లో వీటిని తగిలిస్తే చాలు. కురులకే కాదు... మీకూ స్టైలిష్ లుక్‌ని ఇస్తాయి. ప్రత్యేకంగా కనిపించేలా చేస్తుంది. త్వరలో వేడుక ఉందా? స్పెషల్‌గా కనిపించడం తప్పనిసరా? అయితే ఇంకేం ఈ పెరల్ యాక్సెసరీలను తెచ్చేసుకోండి. చిటికెలో సిద్ధమైపోండి

# తాజాదనం ఎక్కువసేపు..

ఎంత మదిదోచే పెర్‌ఫ్యూమ్ అయినా.. కాసేపటికే దాని ప్రభావం తగ్గిపోతుంది. అలా కాకుండా ఎక్కువసేపు పరిమళాలు వెదజల్లుతూ.. మిమ్మల్ని ఉత్సాహంగా ఉంచాలంటే..

దగ్గరగా ఉంటాయి. అందుకే మెడ దగ్గర స్ప్రే చేస్తే పరిమళం చక్కగా వ్యాపిస్తుంది. ఎక్కువ సేపు ఆ తాజాదనం నిలిచి ఉంటుంది. కానీ రాళ్లు పొదిగిన ఆభరణాలపై పడితే వాటి నాణ్యత దెబ్బతినే అవకాశం ఉంది.

**చెవుల వెనుక :** ఇక్కడ చర్మం చలా సున్నితంగా ఉంటుంది. సువాసన నిలిచి ఉండాలన్నా, వ్యాపించాలన్నా పరిమళాన్ని అక్కడ స్ప్రే చేయాలి. పార్టీలు, వేడుకలప్పుడు.. ఆత్మీయులతో కాస్త దగ్గరగా మసులు తుంటాం కాబట్టి ఈ విధంగా ప్రయత్నించి చూడండి. అలాగని అతిగా ఉపయోగించొద్దు. చర్మానికి హాని కలగొచ్చు. తలనొప్పి వంటి సమస్యలూ ఎదురవుతాయి.


**మెడ చుట్టూ :...** ఇక్కడ రక్తనాళాలు చర్మ ఉపరితలానికి

**మణి కట్టు :** చర్మం సున్నితంగా ఉంటుందిక్కడ. ఇక్కడ పెర్‌ఫ్యూమ్ రాసి, రుద్దితే.. చేతి కదలికల వల్ల సువాసన వ్యాపిస్తుంది. రోజంతా తాజాగా ఉన్న భావన కలుగుతుంది.

**మోకాళ్ల వెనుక :** ఈ ప్రాంతంలో వెచ్చగా ఉంటుంది. ఇక్కడ పెర్‌ఫ్యూమ్ రాసి, రుద్దితే.. చేతి కదలికల వల్ల సువాసన వ్యాపిస్తుంది. రోజంతా తాజాగా ఉన్న భావన కలుగుతుంది.

**మోకాళ్ల వెనక :** ఈ ప్రాంతంలో వెచ్చగా ఉంటుంది. ఇక్కడ స్ప్రే చేస్తే సుమాసన చుట్టుపక్కలకు సులభంగా వ్యాపిస్తుంది. □

# వ్యథ
# ఒత్తిడి వల్ల అతిమూత్రం



ఎన్.బి.సుధాకర్‌రెడ్డి
సైకాలజిస్టు

**ప్రశ్న:** నా వయస్సు 40 ఏళ్లు. ఒక ప్రైవేటు సంస్థలో కీలకమైన బాధ్యత నిర్వహిస్తున్నాను. దీనివల్ల కొంత మానసిక ఒత్తిడి ఉంటుంది. చెడు అలవాట్లు ఏవీ లేనప్పటికి రోజు నాలుగైదు సార్లు కాఫీ తాగుతుంటాను. పని ఒత్తిడి వల్ల ఒక్కోసారి వేళ తప్పి భోజనం చేస్తుంటాను. దీనివల్ల కొంతవరకు జీవనశైలి గాడి తప్పిందని చెప్పవచ్చు. గత మూడునెలల నుంచి మూత్ర విసర్జన సమస్య తలెత్తింది. పగలు ఎన్నిసార్లు మూత్ర విసర్జన చేసినా సమస్య అనిపించదు. కానీ రాత్రులో నాలుగైదు సార్లు మూత్ర విసర్జన కోసం లేవాల్సి వస్తోంది. దీని వల్ల నిద్ర సరిపోవడం లేదు. రాత్రి 11 గంటలకు పడుకుని ఉదయం ఐదు గంటలకు నిద్రలేవవలసి వస్తోంది. అయితే మూత్ర విసర్జన సమస్య వల్ల నిద్ర చాలడం లేదు. దీని వల్ల పగలు అలసట, విసుగు, కోపం వస్తున్నాయి. ఒక్కో సారి నీరసంగా ఉంటోంది. ఈ లక్షణాలను బట్టి మధుమేహ సమస్య తల ఎత్తి ఉంటుందని మిత్రులు చెప్పారు. డాక్టరును కలిసి పరీక్షలు చేస్తే షుగర్ లెవెల్స్ సక్రమంగా ఉన్నట్టు తేలింది దీనితో ఇతర ఆరోగ్య పరీక్షలు చేశారు. శారీరకంగా ఎలాంటి లోపాలు లేవని చెప్పారు. మానసిక ఒత్తిడి, నిద్రలేమి, అతిగా టీ కాఫీలు, మద్యం సేవించడం కూడ కారణం కావచ్చని డాక్టరు చెప్పారు. ఆయన చెప్పిన లక్షణాలు లేదా కారణాలలో మూడు ఉన్నాయని చెప్పాను. ఎక్కువగా ఎసి రూములో ఉండటం కూడ ఒక కారణం కావచ్చని మరీ తక్కువగా కాకుండా చూసుకోమని సలహా ఇచ్చారు. అలాగే సైకాలజిస్టును కలసి కౌన్సెలింగ్ తీసుకోమన్నారు. ఒత్తిడి నిర్వహణ పద్ధతులు పాటించమన్నారు. నాలో ఒత్తిడి తగ్గడానికి, నిద్రబాగా పట్టడానికి, మూత్రవిసర్జన సమస్య తగ్గడానికి తగిన సలహాలు ఇవ్వండి. - ఒక సోదరి, కడప.



**జవాబు :** అమ్మా సహజంగా ఎక్కువ సార్లు మూత్ర విసర్జన చేయాల్సి వస్తోంది అనగానే అందరికి గుర్తుకు వచ్చేది మధుమేహమే. అయితే ఇతర కొన్ని శారీరక సమస్యలు ఇందుకు కారణం కావచ్చు. అలాగే ఇతర జబ్బుల కోసం వాడే మందుల వల్ల సమస్య తల ఎత్తవచ్చు. అయితే డాక్టరు పరీక్షలు చేసి శారీరక సమస్యలు ఏవీ లేవని చెప్పడం వల్ల మానసిక కోణంలో ఆలోచించాలి. అలాగే అలవాట్లు లేదా జీవన శైలిని పరిశీలించాలి. మీ సమస్యకు మానసిక ఒత్తిడి, అలవాట్లు కారణంగా భావించవచ్చు. ఒత్తిడి వల్ల అతి మూత్ర సమస్య తలెత్తే అవకాశం ఉంది. అలాగే భయం ఆందోళన వల్ల కూడ మూత్ర విసర్జన జరిగే అవకాశం ఉంది. టీ, కాఫీలు ఎక్కువగా తాగడం వల్ల అందులోని కెఫిన్‌వల్ల కూడ సమస్య రావచ్చు. రోజుకు కనీసం ఎనిమిది గంటలు నిద్ర అవసరం ఉంటుంది. కొందరికి గంట తగ్గినా పరవాలేదు. మీరు రోజు ఆరు గంటలే నిద్రపోతున్నారు. మూత్ర సమస్యవల్ల ఆ సమయం కూడ తగ్గపోతున్నది. దీని వల్ల శరీరం మరింత ఒత్తిడికి గురి అవుతుంది. దీనితో నీరసం, నిస్సత్తువ, చిరాకు, కోపం తలెత్తుతుంది. కాబట్టి మీరు సాయంత్రం నాలుగు లేదా ఐదు గంటల తరువాత టీ, కాఫీలు తాగడం మానేయండి. సాయంత్రం తప్పని సరిగా వాకింగ్ లేదా చిన్న వ్యాయామాలు చేయడం అలవాటు చేసుకోండి. రాత్రి సమయాలలో నీరు తక్కువగా తాగండి. ఎసి గదిలో పడుకునే టట్టు అయితే మరీ తక్కువ కాకుండా సాధారణ ఉష్ణోగ్రత కంటే కొద్ది తక్కువగా పెట్టుకోండి. నిద్ర పోయే సమయం పెంచుకోండి సమయ పాలన పనుల్లో ప్రాధాన్యత క్రమం పాటించండి. ధ్యానం లేదా ఇతర ఉపశమన మార్గాలు పాటించండి. అవసరం అయితే కొద్ది రోజులు మందులు వాడండి. □

# ఒకసారి శరణు వేడిన చాలు!



**నల్ల మస్తాన్ గారు** గుంటూరుకు వచ్చిన తొలి దినాలలో ఒక రోజు ఉరుములు, మెరుపులతో కుంభవృష్టిగా వాన కురవసాగింది. విశేషమేమిటంటే ధ్యానం చేస్తున్న మస్తాన్ గారి ఇంటిపై ఒక వర్షపుచుక్క కూడ పడకపోవటం. ఇంతలో పిడుగు పడి ఒక మేక పిల్ల. ఒక మనిషి మరణించారు. వర్షం తగ్గింది. మస్తాన్ గారు సమాధి నుండి లేవగానే మరణించిన మేకపిల్ల కనిపించింది. ఆయన దానివద్ద కూర్చొని, భగవధ్యానం చేసి, దాని చుట్టూ ముమ్మారు తిరిగి 'ఉఠో' అన్నారు. ఆ మేకపిల్ల లేచి మస్తాన్ గారి పాదాల సందునుండి దూరి వెళ్లిపోయింది. ఈ వార్త ఊరంతా వ్యాపించగా పిడుగుపాటుతో మరణించిన వ్యక్తి తల్లి వచ్చి, మస్తాన్ గారి పాదాలను పట్టుకుని వల, వల దుఃఖించింది. కరుణా సముద్రుడు ఆ తల్లి దుఃఖం చూడలేకపోయాడు. శవం వద్దకు పోయి దైవ ధ్యానం చేసి, శరీరాన్ని తాకాడు. వెంటనే విగత జీవికి ప్రాణం వచ్చింది. లేచి కూర్చున్నాడు. సంగతి గ్రహించి మస్తాన్ గారి పాదాలపై పడ్డాడు. మహనీయుల కరుణకు పాత్రమైన ఏ జీవి అయినా అదృష్టవంతులే, జంతువు కావచ్చు, మనిషి కావచ్చు. షిరిడీలోని ద్వారాకామాయిలో కొలువై ఉన్న సాయి ఇందుకు భిన్నుడు కాదు. అది 1917వ సంవత్సరం. వైశాఖ మాసం (మే నెల). ఎండలు మండిపోతాయని ప్రత్యేకంగా చెప్పనక్కర లేదు. ఒక పిచ్చి కుక్కచే కరవబడిన ఒక చిన్ని కుక్క వెంటబడ్డారు. దిక్కులేని వారికి దేవుడే దిక్కు అనే నానుడి జంతువులకు కూడా వర్తిస్తుంది. అది ద్వారకామాయిలోనికి పరుగు తీసింది. గ్రామస్తులందరు అది బయటకు వస్తే చంపటానికి బయట నిలబడి 'బాబా! ఆ కుక్క పిచ్చిది. వెలుపలకు తరమండి, దానిని చంపెదము అనగా, సాయిబాబా పిచ్చివారలారా! దూరంగా పొండు. దిక్కులేని ఈ చిన్న జీవిని చంపదలచినారా. అన్నాడు. ఆ జీవి రక్షణ పొందింది. అంతియే కాదు దాని పిచ్చి కూడా మటుమాయమైంది. సాయినాథుని పాదధూళితో పరమ పావనమైన ద్వారకామాయిని శరణు వేడిన వారికి ఆపదలు ఆమడ దూరం పోతాయి. సాయి రక్షణ పొందిన చాలు - భీతికి తావు ఉండదు.

- యం.పి.సాయినాథ్



ఆధ్యాత్మికం

### మహిళల ఛాంపియన్‌షిప్
# తొలి మ్యాచ్‌లో విజయం




**న్యూఢిల్లీ:** శాఫ్ అండర్ 17, మహిళల ఛాంపియన్‌షిప్ 2025లో ప్రారంభ మ్యాచ్‌లో భారత్ నేపాల్‌ను ఓడించింది. భూటాన్‌లోని థింపులోని చాంగ్లిమితాంగ్ స్టేడియంలో బుధవారం జరిగిన ఈ ఛాంపియన్‌షిప్‌లో భారత మహిళల జట్టు నేపాల్‌పై 7-0 తేడాతో విజయం సాధించి అద్భుతమైన ఆరంభాన్ని ఇచ్చింది. భారత్ తరపున అబిస్టా బస్నెట్ (16, 41), నీరా చాను లాంగ్‌జామ్ (25, 56), అనుష్క కుమారి (33, 62), జులన్ నోంగ్‌మైథెమ్ (45+1) గోల్స్ చేశారు. యువ టైగ్రెస్‌లు మొదటి అర్ధభాగాన్ని 5-0 ఆధిక్యంతో ముగించాయి. 16వ నిమిషంలో అభిస్తా బాస్నెట్ గోల్ చేయడం మ్యాచ్‌కు ఊపునిచ్చింది. కాగా 2023లో జరిగిన మ్యాచ్‌లో భారత్ నేపాల్‌ను 4-1 తేడాతో ఓడించింది. తాజా విజయం నేపాల్‌పై భారత్ అజేయ పరంపరను కొనసాగించింది. ఇక ఈ టోర్నమెంట్ ఫార్మాట్‌లో నాలుగు జట్లు భారతదేశం, నేపాల్, బంగ్లాదేశ్, ఆతిథ్య భూటాన్ డబుల్ రౌండ్‌రాబిన్ లీగ్‌లో ఒకదానితో ఒకటి ఆడతాయి. ఇది ఏడవ టోర్నమెంట్. ప్రతి జట్టు ఆరు మ్యాచ్‌లు ఆడుతుంది. ఈ నెల 31న జరిగే చివరి మ్యాచ్ తర్వాత పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో నిలిచిన జట్టు ఛాంపియన్‌గా నిలుస్తుంది. భారత్ ఈ నెల 22న బంగ్లాదేశ్‌తో తలపడనుంది.

### షూటింగ్ ఛాంపియన్‌షిప్‌లో
# సురుచి, సౌరభ్ జోడీకి కాంస్యం



**న్యూఢిల్లీ:** ఆసియా షూటింగ్ ఛాంపియన్‌షిప్-2025లో ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో భారత జంట సురుచి సింగ్ మరియు సౌరభ్ చౌదరి కాంస్య పతకాన్ని గెలుచుకున్నారు. కజకిస్తాన్‌లోని షిమ్‌కెంట్‌లో బుధవారం జరిగిన ఎయిర్ పిస్టల్ మిక్సెడ్ ఈవెంట్‌లో ఈ జంట 4 పాయింట్ల లోటు నుండి పుంజుకుని సత్తా చాటింది. మొదటి కాంస్య పతక మ్యాచ్‌లో చైనీస్ తైపీ జోడీ హెంగ్ యులియు మరియు హ్సి యాంగ్ చెన్‌హ్సి హ్‌లను 17-9 స్కోరుతో ఓడించింది. అర్హత రౌండ్‌లో, భారత జంట మొత్తం 578 (20+)తో 5వ స్థానంలో నిలిచింది. ఇందులో సురుచి 292తో టాప్ స్కోరర్‌గా నిలవగా, సౌరభ్ 286తో వెనుకబడి ఉన్నాడు. ఇక రెండో భారత జంట పాలక్ గులియా మరియు ఆదిత్య మల్రా పతక పోరులో పాల్గొనలేకపోయారు. అర్హత రౌండ్‌లో మొత్తం 575 (20+) పాయింట్లతో 10వ స్థానంలో నిలిచారు. కాగా సీనియర్ పోటీలో ఇది భారతదేశానికి నాల్గవ పతకం, 1 రజతం మరియు 3 కాంస్య పతకాలు సాధించింది. జూనియర్ ఎయిర్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో, భారత జంట వంశిక చౌదరి మరియు జోనాథన్ గవిట్ మొత్తం 578 (18+) పాయింట్లతో బంగారు పతక పోరులో తమ స్థానాన్ని బుక్ చేసుకున్నారు.




### యూరప్ స్మాష్‌లో క్వార్టర్ ఫైనల్స్‌కు
# మనుష్, దియా జోడీ
### శ్రీజ నిష్క్రమణ

**న్యూఢిల్లీ:** యూరప్ స్మాష్-2025లో భారత్ మిక్స్‌డ్ జోడీ మనుష్-దియా క్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకోగా, మహిళల సింగిల్స్‌లో భారత క్రీడాకారిణి, తెలంగాణకు చెందిన ఆకుల శ్రీజ టోర్నీ నుండి నిష్క్రమించింది. అలాగే మహిళల డబుల్స్‌లో దియా చిటాలే-యశస్విని ఘోర్పడే ద్వయం రెండో రౌండ్‌కు చేరుకున్నారు. స్వీడన్‌లోని మాల్మో అరీనాలో బుధవారం జరిగిన ఈవెంట్‌లో ఆరో సీడ్, భారత మిక్స్‌డ్ డబుల్స్ జోడీ మనుష్ షా-దియా చిటాలే క్వార్టర్ ఫైనల్‌కు చేరుకున్నారు.

ఈ జంట బలమైన సింగపూర్ జంట యూ ఎన్ కోయెన్ పాంగ్-జెంగ్ జియాన్‌లను 11-8, 11-7, 8-11, 12-10 తేడాతో నాలుగు గేమ్‌లలో ఓడించి, ఈ ఏడాది మూడవ డబ్ల్యూటిటి గ్రాండ్ స్మాష్ క్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకుంది. తదుపరి ఈ నెల 21వ తేదీన జరిగే క్వార్టర్ ఫైనల్స్‌లో రొమేనియన్ ద్వయం ఎడ్వర్డ్ ఐయోనెస్కు-బెర్నాడెట్ స్జోక్స్‌తో తలపడనున్నారు. మరోవైపు, మహిళల సింగిల్స్‌లో భారత క్రీడాకారిణి ఆకుల శ్రీజ రెండో రౌండ్‌లో ఏడో సీడ్ జు యులింగ్ (మకావో) చేతిలో 9-11, 8-11, 11-6, 2-11 తేడాతో ఓడిపోవడంతో ముగిసింది. ఇక మహిళల డబుల్స్ విభాగంలో దియా చిటాలే-యశస్విని ఘోడ్పాడేతో కలిసి తొలి రౌండ్ విజయాన్ని సాధించి, ఈజిప్టు ద్వయం హనా గోడా-దినా మెష్రెఫ్‌లను ఓడించింది. ఈ జంట 11-6, 11-7, 11-5 తేడాతో వరుస గేమ్‌ల విజయం సాధించి 16వ రౌండ్‌కు చేరుకుంది.

### అసియా కప్ టీంలో..
# బ్యాడ్‌లక్ హీరోస్
### ఒక్క మ్యాచ్‌కూ నో ఛాన్స్.. భారత్ జట్టులో స్టాండ్‌బై ఆటగాళ్లు



**న్యూఢిల్లీ:** ఆసియా కప్ 2025లో పాల్గొనేందుకు భారత క్రికెట్ నియంత్రణ మండలి తన 15 మంది సభ్యుల జట్టును ప్రకటించింది. ఈ టోర్నీ కోసం ఎంపిక చేసిన భారత్ జట్టులో అనుభవంతో పాటు, ఇప్పటి వరకూ ఈ టోర్నీలో బెర్త్ దక్కించుకోని యువకులకూ గొప్ప మిశ్రమంగా మారింది. ఈ జట్టును నడిపించే బాధ్యత సూర్యకుమార్ యాదవ్ చేతుల్లో ఉంటుంది. అతను కొంతకాలంగా ఈ ఫార్మాట్‌లో టీమ్ ఇండియాకు నాయకత్వం వహిస్తున్నాడు. అదే సమయంలో, శుభ్‌మాన్ గిల్ కూడా టీ20 జట్టులోకి తిరిగి వచ్చాడు. అతను వైస్ కెప్టెన్ బాధ్యతను కూడా వ్యవహరిస్తాడు. దీంతో పాటు, ఈ టోర్నమెంట్‌లో ఒక్క మ్యాచ్ కూడా ఆడలేని ఐదుగురు ఆటగాళ్లను కూడా బీసీసీఐ సెలక్టర్లు ఎంపిక చేశారు. 15 మంది సభ్యుల జట్టుతో పాటు, ఐదుగురు ఆటగాళ్లను స్టాండ్‌బైగా బీసీసీఐ ఎంపిక చేసింది. వీరిలో ప్రసిద్ధ్ కృష్ణ, వాషింగ్టన్ సుందర్, రియాన్ పరాగ్, ధ్రువ్ జురెల్, యశస్వి జైస్వాల్ ఉన్నారు. స్టాండ్‌బై ఆటగాళ్లను ప్రధాన జట్టులో చేర్చలేదు. కాబట్టి వారికి మ్యాచ్‌లు ఆడే అవకాశం లభించదు. అయితే, జట్టుకు అవసరమైతే, ఈ ఆటగాళ్లలో ఎవరినైనా ప్రధాన జట్టులోకి తీసుకోవచ్చు. అప్పుడు వారు ప్లేయింగ్ 11లో కూడా భాగం కావొచ్చు. స్టాండ్‌బై ఆటగాళ్ళు నేరుగా టోర్నమెంట్‌లో పాల్గొనరు. కానీ, వారు జట్టుకు బలమైన బ్యాకప్‌గా ఉంటారు.

ప్రధాన జట్టులోని ఒక ఆటగాడు గాయం లేదా ఇతర కారణాల వల్ల టోర్నమెంట్‌కు దూరంగా ఉంటే, ఈ స్టాండ్‌బై ఆటగాళ్లకు అవకాశం లభిస్తుంది. ఇటువంటి పరిస్థితిలో, అవసరమైతే జట్టుకు మ్యాచ్ విన్నర్లుగా నిరూపించగల ఆ ఐదుగురు ఆటగాళ్లను బిసిసిఐ స్టాండ్ బైలో ఉంచింది. ప్రసిద్ధ్ కృష్ణ తన ఫాస్ట్ బౌలింగ్‌తో, వాషింగ్టన్ సుందర్ తన ఆల్ రౌండ్ సామర్థ్యంతో, రియాన్ పరాగ్, యశస్వి జైస్వాల్ తమదూకుడు బ్యాటింగ్‌తో, ధ్రువ్‌జురెల్ తన వికెట్ కీపింగ్, బ్యాటింగ్‌తో ఎప్పుడైనా జట్టులో చేరడానికి సిద్ధంగా ఉంటారు.



# తొలి వన్డేలో దక్షిణాఫ్రికా విజయం
### 98 రన్స్ తేడాతో ఆస్ట్రేలియా చిత్తు

**న్యూఢిల్లీ:** తొలి వన్డేలో ఆస్ట్రేలియాపై దక్షిణాఫ్రికా విజయం సాధించింది. కైర్న్స్‌లో వన్డే ఇంటర్నేషనల్ సిరీస్ తొలి మ్యాచ్‌ను 98 పరుగుల తేడాతో కైవసం చేసుకుంది. టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన దక్షిణాఫ్రికా నిర్ణీత 50 ఓవర్లలో 8 వికెట్లు నష్టానికి 296 పరుగులు చేసింది. మార్క్‌రమ్ (81 బంతుల్లో 82, 9 ఫోర్లు) టాప్ స్కోరర్ కాగా, కెప్టెన్ తెంబా బవుమా (74 బంతుల్లో 65, 5 ఫోర్లు), మాథ్యూ బ్రీజ్కె (56 బంతుల్లో 57, 7 ఫోర్లు, 1 సిక్స్) అర్ధ శతకాలు సాధించారు. రికెల్టన్ (33, 3 ఫోర్లు), ముల్డర్ (26 బంతుల్లో 31 నాటౌట్, 2 ఫక్షర్లు, 1 సిక్స్) ఫర్వాలేదనిపించారు. ఆస్ట్రేలియా బౌలర్లలో ట్రావిస్ హెడ్ 9 ఓవర్లు వేసి 57 పరుగులిచ్చి 4 వికెట్లు తీశాడు. అనంతరం లక్ష్య ఛేదనలో ఆస్ట్రేలియా తడబడింది. కేశవ్ మహరాజ్ 5 వికెట్లుతో చెలరేగి ఆస్ట్రేలియా బ్యాటింగ్ ఆర్డర్‌ను కుదేల్ చేశాడు. దీంతో 40.5 ఓవర్లలో 198 పరుగులకే ఆలౌట్ అయింది. కెప్టెన్ మిచెల్ మార్ష్ (96 బంతుల్లో 88, 10 ఫోర్లు) మినహా టాపార్డర్ విఫలమైంది. లబుషేన్ (1), కామెరూన్ గ్రీన్ (3), జోష్ ఇన్‌గ్లిస్ (5), అలెక్స్ కేరీ (0), అరోన్ హార్డీ (4) సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యారు.

తొలి వికెట్‌కు హెడ్ (24 బంతుల్లో 27, 6 ఫోర్లు)తో కలిసి 60 పరుగులు జోడించిన మార్ష్ ఏడో వికెట్‌కు డ్వార్షుయ్ (52 బంతుల్లో 33, 3 ఫోర్లు) తో కలిసి 71 పరుగులు జోడించాడు. దక్షిణాఫ్రికా బౌలర్ కేశవ్ మహరాజ్ లబుష్షేన్ (1)తో పాటు, కామెరాన్ గ్రీన్ (3), జోష్ ఇంగ్లిస్ (5), అలెక్స్ క్యారీ (0) రూపంలో నలుగురు కీలక బ్యాటర్లను ఔట్ చేశాడు.

## వాణిజ్యం

### ఎగుమతుల్లో సత్తాచాటుతున్న
# తెలుగు రాష్ట్రాలు



**హైదరాబాద్,ఆగస్టు20, ప్రభాతవార్త:** కొంత కాలంగా ఎగుమతుల్లో తెలుగు రాష్ట్రాలు గణనీయమైన వృద్ధిని నమోదు చేస్తున్నాయి. గతంలో ఎక్కువగా ధాన్యం, ఎలక్ట్రానిక్స్, ఔషధాల ఎగుమతుల్లో ముందుండగా ఇటీవలి కాలంలో ఇంజినీరింగ్ ప్రొడక్ట్స్ ఉత్పత్తిలో ముందు వరుసలో ఉంటున్నాయి. ఇప్పుడు ఏపీ, తెలంగాణ వరుసగా 6,7 స్థానాల్లో నిలవగా.. త్వరలో టాప్ 5 లో చోటు దక్కించుకునే అవకాశాలు మెండుగా ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ఎగుమతుల్లో సత్తా చాటుతున్నాయి. కొంత కాలంగా చూస్తే ఆసక్తికర వృద్ధిని కనబరుస్తున్నాయని చెప్పొచ్చు. ఇక్కడ ప్రతి సంవత్సరం ఎగుమతులు పెరగడమే కాకుండా.. ఎగుమతుల శ్రేణి కూడా విస్తరిస్తూ వస్తోంది. ఇంకా తెలుగు రాష్ట్రాల నుంచి చాలా ఏళ్లుగా ఎక్కువగా ఎగుమతి అవుతున్నటువంటి వస్తువుల జాబితాలో వ్యవసాయ ఉత్పత్తుల్లో ముందుంటూ వచ్చాయి. ఇప్పుడు మాత్రం పరిస్థితి మారుతోంది. దానిని దాటేసి ఇంజినీరింగ్ ప్రొడక్ట్స్ ఎక్కువగా ఎగుమతి అవుతున్నాయి. దీనికి తోడు ఫార్మా ప్రొడక్ట్స్ (ఔషధాలు), కెమికల్స్, ఎలక్ట్రానిక్స్ వంటి ఎగుమతులు కూడా ఎగబాకుతూనే ఉన్నాయి. ఇటీవలి పరిస్థితుల్ని గమనిస్తే ఇంజినీరింగ్ ప్రొడక్ట్స్ విభాగంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలు సాధిస్తున్న ప్రగతి దేశానికే ఆదర్శంగా ఉంది. రాబోయే రోజుల్లో ఈ ఉత్పత్తులకు సంబంధించి ఇంకా మెరుగైన రికార్డులు నమోదవుతాయని, అందుకు తగిన పరిస్థితులు ఇక్కడ ఉన్నట్లు పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి. ఇక గత ఆర్థిక సంవత్సరం (2024-25) అత్యధికంగా ఎగుమతులు సాధించిన రాష్ట్రాల లిస్టులో ఆంధ్రప్రదేశ్ 6వ స్థానంలో ఉండగా తెలంగాణ ఏడవ స్థానంలో నిలిచింది. త్వరలోనే ఈ రెండు రాష్ట్రాలు టాప్5లోకి వచ్చే అవకాశం ఉందని కూడా అంచనా వేస్తున్నారు. మన దేశంలోనే తెలంగాణ రాష్ట్రం.. అంతరిక్ష, రక్షణ రంగ పరిజ్ఞానానికి వెన్నెముకగా నిలుస్తోందనే మాట వినిపిస్తోంది. రక్షణ ఉత్పత్తుల తయారీకి హైదరాబాద్ మూలకేంద్రంగా ఉంది. మిధాని, బీడీఎల్, దీఆర్డీఓ వంటి సంస్థలు ఉండటమే కాకుండా ప్రైవేట్ రంగంలో కూడా ఎన్నో సంస్థలు కీలక రక్షణ ఉత్పత్తుల్ని భారత సైన్యానికి అందిస్తున్నాయి. ఇంకా పెద్ద ఎత్తున విదేశాలకు ఎగుమతి కూడా చేపట్టాయి.



# స్వల్ప నష్టాల్లో సూచీలు, సెన్సెక్స్‌లు

**హైదరాబాద్,ఆగస్టు20, ప్రభాతవార్త:** అంతర్జాతీయ సంకేతాలకు అనుగుణంగా దేశీయ మార్కెట్లు బుధవారం నష్టాల్లో ట్రేడింగ్‌ను మొదలుపెట్టాయి. ఉదయం వేళల్లోనే సెన్సెక్స్ 108పాయింట్లు నష్టపోయి 81,536, నిఫ్టీ 33పాయింట్లు కుంగి 24,947వద్ద కొనసాగుతున్నాయి. అయితే గెలాక్సీ సర్ఫాక్ట, పిఎస్ గాడ్గిల్ జ్యువెలర్స్, మాక్స్ ఎస్టేట్, లాయిడ్స్ మెటల్స్ లాభాల్లో ఉండగా..నజరా టెక్నాలజీస్, డెల్టాకార్ప్, సిఎస్‌బి బ్యాంక్, పవర్ మైక్ ప్రాజెక్ట్స్ నష్టాల్లో ఉన్నాయి. నాలుగు రోజులుగా సూచీలు భారీగా పెరగడంతో ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణకు మొగ్గుచూపారు. ఈ క్రమంలో రూపాయి మారకం విలువ భారీగా పతనమై ట్రేడింగ్‌ను ప్రారంభించింది. నిన్నటితో రూ.86.95తో పోలిస్తే 21పైసలు తగ్గి రూ.87.16వద్ద ఉంది. ఇక ఆసియాలో ఫసిపిక్ మార్కెట్ ప్రధాన సూచీలు ఆస్ట్రేలియా ఎసిఎక్స్200, న్యూజిలాండ్ ఎన్‌జెడ్ఎక్స్ 50 మినహా మిగిలిన ప్రధాన సూచీలన్నీ కుంగాయి. చైనాకు చెందిన షాంఘై, జపాన్, నిక్కీ, హాంకాంగ్, హెచ్ఎస్ఐ, దక్షిణ కొరియా కోస్పి, తైవాన్ సూచీలు పతనమయ్యాయి.

### ఏంజెల్ వన్ అసెట్ మేనేజ్‌మెంట్
# 'గోల్డ్' పథకాలు

**హైదరాబాద్,ఆగస్టు20, ప్రభాతవార్త:** ఏంజెల్ వన్ అసెట్ మేనేజ్మెంట్ కంపెనీ రెండు సరికొత్త కొత్త గోల్డ్ పథకాలను ప్రారంభించింది. గోల్డ్ ఈటీఎఫ్ ఫండ్స్‌తో ఏర్పాటు చేసినట్లు ఎంఎంసి వెల్లడించింది. పథకాల సబ్‌స్క్రిప్షన్స్ బుధవారం మొదలైనట్లు వివరించింది. ఇందులో కనీస సిప్ పెట్టుబడి రూ. 250 ఉండగా, లాంగ్ సిప్ పెట్టుబడి రూ. 1000గా ఉంది. బంగారం ఆధారితంగా రిటర్న్లు అందించేలా గోల్డ్ ఈటీఎఫ్ ఫండ్స్ తీసుకొచ్చింది. అవే ఏంజెల్ వన్ గోల్డ్ ఈటీఎఫ్ ( ఏంజెల్ వన్ గోల్డ్ ఈటీఎఫ్ ఫండ్ ఆఫ్ ఫండ్ ఉన్నాయి. దేశీయ బులియన్ మార్కెట్లో బంగారం ధరలను ట్రాక్ చేస్తూ రిటర్న్లు అందించేలా ఈ ఫండ్స్ తీసుకొచ్చినట్లు ఏజెంల్ వన్ తెలిపింది. ధరల్లో పారదర్శకత, సులభంగా పెట్టుబడి పెట్టే అవకాశాన్ని తమ ఇన్వెస్టర్లకు కల్పిస్తున్నట్లు



వెల్లడించింది. సబ్‌స్క్రిప్షన్స్ సెప్టెంబర్ 3, 2025 వరకు కొనసాగుతుంది. ఎన్ఎఫ్ఓ ముగిసిన తర్వాత సైతం ఇదే పెట్టుబడితో యూనిట్లు కొనుగోలు చేయవచ్చని తెలిపింది. అలాగే డిమ్యాట్ అకౌంట్ లేకున్నప్పటికీ బంగారంపై పెట్టుబడులు పెట్టే అవకాశాన్ని ఈ ఫండ్స్ కల్పిస్తున్నట్లు వెల్లడించింది. అలాగే ఇందులో సిస్టమెటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ పెట్టుబడి ఉంటుంది. బంగారం ధరలు భారీగా పెరుగుతున్న క్రమంలో ఆయా లాభాలను అందుకునేలా ఈ రెండు ఫండ్స్ అవకాశం కల్పిస్తున్నారు. స్కీమ్‌లో ఎన్ఎస్ఈలో లిస్ట్ అవుతుంది. 99.5 శాతం ప్యూర్ గోల్డ్ ప్రకారం ట్రేడింగ్ నిర్వహిస్తుంది. దీంతో మేకింగ్ ఛార్జ్, స్టోరేజ్ రిస్క్ ఉండదని తెలిపింది. అలాగే ఏంజెల్ వన్ గోల్డ్ ఈటీఎఫ్ ఫండ్ ఆఫ్ ఫండ్ సిప్ పెట్టుబడి రోజుకు రూ.250, వారానికి, 15 రోజులకు, నెల రోజులకు రూ.500గా నిర్ణయించగా మూడు నెలలకు ఒకసారి రూ. 1500గా నిర్ణయించినట్లు ఏఎంసీ తెలిపింది.




# ఇన్ఫోసిస్ ఉద్యోగులకు 80% బోనస్ పెంపు

**హైదరాబాద్,ఆగస్టు20, ప్రభాతవార్త:** ప్రముఖ ఐటి కంపెనీ ఇన్ఫోసిస్ ఉద్యోగులకు భారీ వేతనాలు పెంచింది. ఏప్రిల్, మే, జూన్ త్రైమాసికానికి పనితీరు ఆధారిత బోనస్‌లను ప్రకటించింది. అర్హులైన ఉద్యోగులకు సగటున 80శాతం చొప్పున చెల్లించనుంది. ఆగస్టు నెల వేతనంతో మొత్తం ఇవ్వనున్నట్లు సంస్థ వెల్లడించింది. ఇందుకై ఇంటర్నల్‌గా మెస్సేజ్‌లను పంపిస్తుంది. అయితే క్యూ1లో మెరుగైన పనితీరు నేపథ్యంలో కంపెనీ ఈ స్థాయిలో బోనస్‌లను ప్రకటించడం విశేషం. పనితీరు ఆధారంగా చెల్లింపులు లెవల్ పీఎల్4 ఉద్యోగుల్లో అత్యుత్తమ పనితీరు కనబరిచిన వారికి అత్యధికంగా 89శాతం బోనస్ చెల్లిస్తారు. అంచనాలు అందుకున్న ఉద్యోగులకు 80శాతం చొప్పున చెల్లింపులు చేయనున్నారు. అలాగే లెవల్, పిఎల్5, లెవల్ పిఎల్6 ఉద్యోగులకు 78-87శాతం, 75-85 శాతం చొప్పున చెల్లిస్తారు. పీఎల్4, పిఎల్5, పిఎల్6 కేటగిరిల్లో దృష్టిసారించాల్సిన ఉద్యోగులకు కూడా 80 శాతం, 75, 70, శాతాల చొప్పున బోనస్ ఇవ్వనున్నట్లు ఇంటర్నల్ మెమోలో ఇన్ఫోసిస్ తెలిపింది.

వ్యక్తిగత బోనస్ లెటర్లను ఉద్యోగుల ఇ-డాకెట్స్‌లో అప్‌లోడ్ చేస్తామని వివరించిదంది. అయితే జులై 23న వెలువరించిన త్రైమాసిక ఫలితాల్లో సంస్థ అంచనాలను మించి రాణించింది. గతేడాదితో పోలిస్తే కంపెనీ నికర లాభం 8.7శాతం వృద్ధి చెంది రూ.6921 కోట్లుగా నమోదైంది. ఆదాయం సైతం 7.5శాతం వృద్ధితో రూ.42,279 కోట్లుగా పేర్కొంది. రెండు మెట్రిక్స్‌లోనూ అంచనాలను మించిన పనితీరు కంపెనీ సాధించింది.

# టిసిఎస్‌లో లేఆఫ్‌లపై ఆందోళనలు!

**హైదరాబాద్,ఆగస్టు20, ప్రభాతవార్త:** ప్రముఖ ఐటీ కంపెనీ టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్‌లో తలపెట్టిన లేఆఫ్‌లను యూనియన్ ఆఫ్ ఐటీ, ఐటీఈఎస్ ఎంప్లాయిస్ (యునైట్) తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. లేఆఫ్‌ల నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని, ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని కోరుతుంది. అయితే లేఆఫ్‌ల కారణంగా దాదాపు 30వేల మందిపై ప్రభావం పడుతుందని యూనియన్ ఆరోపించగా టిసిఎస్ స్పందించింది. కేవలం 12వేలమంది




ఉద్యోగులను తొలగించాలన్న నిర్ణయానికి వ్యతిరేకంగా చెన్నైలో ఆందోళన చేపట్టారు. టిసిఎస్ సీనియర్, మేనేజర్‌స్థాయి ఉద్యోగులను తొలగిస్తుందని, దీంతో సుమారు 30వేల నుంచి 40వేల మందిపై ప్రభావం ఉంటుందని యునైట్ సభ్యురాలు జనని ఆవేదన వ్యక్తం చేశారు. అనుభవజ్ఞులైన స్థానంలో కొత్త వాళ్లను 80 నుంచి 85శాతం తక్కువ జీతానికి నియమించుకుంటుందని యునైట్ ఆరోపిస్తుంది. ఉద్యోగులను తొలగించే బదులు వారి నైపుణ్యాలను పెంచాలని డిమాండ్ చేసింది. రూ.2.55లక్షల కోట్ల ఆదాయం కలిగిన కంపెనీ లాభార్జన కోసం ఉద్యోగులను తొలగించడం అన్యాయమని ఆగ్రహం వ్యక్తం చేసింది. 30వేల మందిని తొలగిస్తున్నామనే ఆరోపణలను టిసిఎస్ ఖండించింది. ముందస్తుగా చెప్పినట్లు కేవలం 2శాతమే దాదాపు 12వేలమందిని తొలగించనున్నట్లు పేర్కొంది.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps.